ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

ఖమ్మం 16

గురువారం 24 ఆగస్టు 2017





నేడు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో..

నగరంలో మట్టి గణపతి

ప్రతిమల పంపిణీ

పెవిలియన్ గ్రౌండ్ వేదిక

9

27నుంచి పార్లమెంటరీ స్టాండింగ్

కమిటీ పర్యటన



- చైర్‌పర్సన్ రేణుకాచౌదరి ఆధ్వర్యంలో 20 మంది ఎంపీల రాక
- అడవులు, కాలుష్యం, సైన్స్ అండ్ టెక్నాలజీపై పరిశీలన

7

సర్వేకు రంగం సిద్ధం





- భూ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సమరం
- ప్రక్షాళనకు ముహూర్తం ఖరారు
- 1నుంచి 10వరకు గ్రామసభలు
- 10నుంచి 15వరకు మండల కేంద్రాల్లో సదస్సులు
- రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బృందాలు
- సమయం సరిపోదంటున్న నిపుణులు

రాష్ట్రంలో భూ సంబంధిత వివాదాలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా భూముల సర్వేకు రంగం సిద్ధం చేసింది. ఒకటో తేదీనుంచి గ్రామం యూనిట్‌గా సభలు నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక బృందాలను నియమించింది. అయితే ఈ సర్వే ప్రక్రియ పదిహేను రోజుల్లోనే పూర్తి చేయాలని నిర్ణయించగా, అంత స్వల్పకాలంలో పూర్తిచేయడం సాధ్యం కాదని పలువురు అధికారులు పేర్కొంటున్నారు.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం

11

అనాథ 'బడి'

- వీధి బాలల పాఠశాల తెరుచుకునేదెన్నడో ?
- ఖాళీగా ఉంటున్న సీఆర్‌టీలు
- పట్టించుకోని అధికారులు

11


ఖమ్మంలో భారీ చోరీ

- 70 తులాల బంగారం, ఐదు కిలోల వెండి అపహరణ
- శ్రీరాంహిల్స్‌లో ఘటన
- నగరంలో షోలాపూర్ గ్యాంగ్?

6

నిధిలేని ప్రతినిధులు!

- నిధులు లేవు.. నిర్ణయాధికారం లేదు
- అలంకారప్రాయంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు
- శిలాఫలకాల్లో పేర్లకే పరిమితమవుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు
- గ్రామాల్లో వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న వైనం



అందరిలా వారూ ప్రజాప్రతినిధులే.. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజలచేత ఎన్నికైన వారే.. కానీ వారికి మిగతావారిలా నిర్ణయాధికారం లేదు.. నిధులూ లేవు. దాంతో వారు కేవలం అలంకార ప్రాయంగా మిగిలారు. స్థానిక సంస్థల్లో జడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యుల పరిస్థితి దయనీయంగా ఉంది. కేవలం శిలాఫలకాల్లో పేర్లకే పరిమితమవుతున్నారు. వారి సిఫారసుతో ఎలాంటి సమస్యలూ పరిష్కారం కావు. దాంతో వారు గ్రామాల్లోకి వెళ్లలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జడ్పీ చైర్మన్లు ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలను వివరించాలని నిర్ణయించారు. -ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

11

ఆదాయపు పన్ను గణనలో మినహాయింపులు

బోనకల్: ఉద్యోగులకు సంబంధించిన ఆదాయపు పన్నులో మినహాయింపుల గణనను గురించి ప్రధాన సమాచారాన్ని మీకోసం అందజేస్తున్నాం... ఇంటిని రుణంతో నిర్మించి సొంతంగా ఉంటున్న వారికి రుణంపై చెల్లిస్తున్న వడ్డీపై రూ.రెండు లక్షల వరకు మినహాయింపు ఉంది. ఒకవేళ ఇంటిని భార్య, భర్త ఇద్దరూ జాయింట్‌గా రుణం పొంది నిర్మిస్తే ఇద్ధరికి సమానంగా విభజించి ఒక్కొక్కరు గరిష్ఠంగా రెండు లక్షల మినహాయింపు పొందవచ్చు. ఇంటి రుణం తీసుకొని ఇంట్లో స్వయంగా నివసించకుండా అద్దెకు ఇచ్చినట్లయితే ఇంటిరుణంపై వడ్డీ పూర్తిగా మినహాయింపు ఉంటుంది. కానీ వచ్చే అద్దెను ఆదాయంగా చూపాలి. సెల్ఫ్,స్పౌజ్, పిల్లల ఉన్నత



చదువుల పిల్లల కోసం విద్యారుణంపై చెల్లించిన వడ్డీ మినహాయింపు ఉంటుంది. ఈ మినహాయింపు గరిష్ఠంగా ఏడు సంవత్సరాలు వర్తిస్తుంది.

గణనాథున్ని ఏసమయంలోపు పూజించాలంటే..

ఖమ్మం సాంస్కృతికం: ఈసారి వినాయక చవితి రోజు(ఆగస్టు 25న).. చవితి రాత్రి 9.20 వరకు ఉన్నది. కాబట్టి ఇంట్లో పూజ చేసుకునేరు మధ్యాహ్నం 12గంటలలోపు పూజించాలి. వీధుల్లో మంటపాన్ని పెట్టి ఆవాహన చేసేవాళ్లు సాయంత్రం లోపు పూజ చేయాలి.

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్సర్వ విఘ్నోప శాంతయే

మన పడుగలు మన భారతీయ సంస్కృతికి అద్దం పడుతూ.. అవి ఆణిముత్యాలతో కూడిన ముత్యాల హారంలా ప్రకాశిస్తూ, మన సంస్కృతిని ప్రతిబింబింప చేస్తుంటాయి. అటువంటి పండుగలలో విశిష్టమైనది వినాయకచవితి. తొలుత ఏ పని ప్రారంభించాలన్నా గణపతి పూజతో ప్రారంభిస్తాం. పిన్నల నుంచి పెద్దల వరకూ ఎంతో భక్తి శ్రద్ధలతో ఎంతో వేడుకగా చేసుకునేది ఈ చవితి పండుగ. భాద్రపద శుద్ధ చవితి రోజున విశేషంగా గణపతి పుట్టిన రోజు అయిన ఈ రోజున పండుగ జరుపుకొంటాం. మహేశ్వరాది దేవతా గణాలందరికీ గణపతి ప్రభువు. అంటే హిందువుల సకలదేవతా గణాలకు ఆయనే ప్రభువన్న మాట. బ్రహ్మ తొలుత ఈ సృష్టి కార్యాన్ని ప్రారంభించేముందు గణపతిని పూజించినట్లు రుగ్వేదం చెబుతోంది. బ్రహ్మవైవర్తన పురాణం లో 'గణ' శబ్ధానికి విజ్ఞానమని, 'ణ' అంటే తేజస్సు అని పేర్కొన్నారు.



అధ్యాపకుడిని కావాలనుకున్నా..

టైపిస్టుగా చేరా

టి. రాజేంద్రం,
దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఖమ్మం



ఇంటర్వ్యూ Interview

- ఖమ్మం సాంస్కృతికం

సమాజసేవ చేసి ఎంతో మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే కాంక్ష. వచ్చిన రెండు అవకాశాలను వదులుకుని కుటుంబ పోషణకై ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ ద్వారా టైపిస్టుగా వృత్తిలో చేరారు. అంచెలంచెలుగా ఎదుగుతూ దేవాదాయ, ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న తమ్మా రాజేంద్రం ఆంధ్రజ్యోతితో ముచ్చటించారు.

కుటుంబ నేపథ్యం..

మాది వ్యవసాయ కుటుంబం. వరంగల్ జిల్లా పరకరాల మండలం ధర్మారం గ్రామం. తల్లిదండ్రులు తమ్మా కనకయ్య, నర్సమ్మ. నాన్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేశారు. ఇద్దరం అన్నదమ్ములం, పెద్దవాడిని నేను ఎమ్మెస్సీ బీఈడీ పూర్తిచేశాను. మా తమ్ముడు మునిసిపల్ శాఖలో చిరుద్యోగిగా పనిచేస్తున్నారు. ఐదో తరగతి వరకు మూడు కి.మీ చదువు కోసం నడిచివెళ్లాం.

చదువు సాగిందిలా...

ఐదో తరగతి వరకు నడికూడి గ్రామంలో ఆరు నుంచి పరకాలలో ప్రభుత్వ హాస్టల్‌లో, ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బీఎస్సీని వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పూర్తిచేశాను. బీఎడ్, ఎంఎస్సీని వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో చేశారు.

ఉద్యోగ నేపథ్యం :

డిగ్రీలోనే స్కూల్ అసిస్టెంట్‌గా సెలక్ట్ అయ్యాను. తర్వాత ఫిషరీష్ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టు వచ్చింది. 1987లో టైపిస్ట్‌గా వరంగల్‌లోని దేవాదాయశాఖ కార్యాలయంలో ఉద్యోగంలో చేరాను. తర్వాత సీనియర్ అసిస్టెంట్ ఖమ్మం జిల్లా కొత్తగూడెం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ఉద్యోగోన్నతిపై ఈవోగా 2010లో మేడారం ఆలయానికి, వరంగల్ భద్రకాళి ఆలయాల్లో పనిచేశా. ఉద్యోగోన్నతిపై వరంగల్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేశాను.

సాధించిన అవార్డులు

నాలుగుసార్లు ఉత్తమ ప్రశంసలను అందుకున్నా. 2017 ఆగస్టు 15న జిల్లాలో హరితహారానికి అవార్డు సాధించా. మంచి అధ్యాపకుడిని కాలేకపోయానన్న బాధ కలిగినా మేడారం జాతరలో కోటి మందికి సేవల్ని అందించడం సంతృప్తిని ఇచ్చింది.



అమ్మలా అక్కున చేర్చుకుంటున్న

అంగన్‌వాడీ ఆయమ్మ

కష్టపడితే తగిన ప్రతిఫలం ఉంటుందని, చేసే పనిని బాధ్యతగా చేస్తే గుర్తింపు అనేది దానంతట అదే వస్తుందని నిరూపించారు కొద్దిపాటి పారితోషకం తీసుకునే ఓమహిళ. ఎవరున్నా లేకపోయినా తన పనిని తాను చేసుకుంటూ అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు అంగన్‌వాడీ కేంద్రంలో విధులు ఆయా కె.పాపమ్మ. 26ఏళ్లుగా కొద్దిపా టి పారితోషకాన్ని తీసుకుంటూ చిన్నారుల, గర్భిణుల సేవలో తరిస్తున్నారు. కేంద్రా న్ని చక్కగా పచ్చని వాతావరణంలో ఉంచిన ఈమెను ఇటీవల జిల్లాస్థాయిలో ఉత్తమ ఆయాగా అవార్డు వరించింది. కేంద్రానికి వచ్చే ఎవరికైనా పరిశుభ్ర వాతావరణం, పచ్చని చెట్లు స్వాగతం పలికేలా చేసిన పాపమ్మపై ప్రత్యేక కథనం..

-అశ్వారావుపేట రూరల్

గిరిజన మహిళకు శ్రమకు తగిన ఫలితం

ఉత్తమ ఆయాగా అవార్డు అందుకున్న పాపమ్మ

పిల్లలను కేంద్రానికి తీసుకురావటంలో శ్రద్ధ

తోటను పెంచటంలో ఎంతో ప్రత్యేకత



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని అనంతారం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా అదే గ్రామానికి చెందిన కె.పాపమ్మ ఆయాగా విధులు నిర్వహిస్తున్నారు. అప్పట్లో ఆమెకు కేవలం నెలకు రూ.వంద మాత్రమే వేతనంగా ఇచ్చేవారు. అయినా ఆనాటి నుంచి కేంద్రంలో బాధ్యతగా పనిచేస్తూ వచ్చారు. కేంద్రం ప్రారంభమయ్యే సమయానికే ఇంటింటికి తిరిగి పిల్లలను తీసుకురావటం, గర్భిణులు, బాలితలు కేంద్రం ద్వారా అమలయ్యే పథకాలను సక్రమంగా వినియోగించుకునేలా చూడటంలో పాపమ్మ దిట్ట. దీంతో పాటు కేంద్రంలో రకరకాల పూల, కూరగాయల మొక్కలను ప్రత్యేక శ్రద్ధతో పెంచుతున్నారు. వీటికి నిత్యం నీళ్లుపోయటం, కలుపు తీయటం పాపమ్మ పనిగా పెట్టుకుంటారు. కొద్దిరోజుల క్రితం కేంద్రానికి వచ్చిన ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీలక్ష్మీబాయి కేంద్ర ఆవరణను చూసి ఆయాను ఎంతగానో మెచ్చుకున్నారు. ఇక విధుల పట్ల బాధ్యతగా ఉంటూ ఉన్నతాధికారులు చెప్పే ప్రతిపనిని ఎంతో శ్రద్ధతో చేస్తున్నారు. నెలల తరబడి వేతనాలు ఆలస్యమైతే ఇబ్బందులు పడైనా కేంద్ర నిర్వహణలో తన వంతు పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం రెండు కేంద్రాలు ఒకేచోట నిర్వహిస్తుండటంతో బాధ్యతలు మరింతగా పెరగగా అలుపుసొలుపు లేకుండా పాపమ్మ పనులు తన బాధ్యతలకు న్యాయం చేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణలు, బాలింతలు, చిన్నారులకు వేసే టీకాల సమయంలో ఇంటింటికి తిరిగి వారిని వస్తున్నారు. ఐసీడీఎస్ అంటేనే గ్రామస్థులు అనేక ఫిర్యాదులు చేయడం సర్వ సాధారణం. కాని ఇక్కడ మాత్రం కార్యకర్తలు మొదలు ఆయా వరకు అందరూ బాధ్యతగా పనిచేస్తూ గ్రామస్థుల చేత, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతనూ శభాష్ అనిపించుకున్నారు.



పిల్లలను కేంద్రానికి తీసుకువస్తున్న ఆయా పాపమ్మ



మంత్రి పద్మారావు చేతుల మీదుగా జిల్లా ఉత్తమ అవార్డు అందుకుంటున్న పాపమ్మ

మంత్రి పద్మారావు చేతుల మీదుగా అవార్డు...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐసీడీఎస్ ద్వారా ఉత్తమ ఆయాగా ఎంపికైన పాపమ్మ ఆగష్టు 15వ తేదీన కొత్తగూడెంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈఏడాది జరిగిన మహిళా దినోత్సవం సందర్భంగా కూడా పాపమ్మ అవార్డును అందుకున్నారు. అశ్వారావుపేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అవార్డును, రూ.వెయ్యి నగదును పొందటం జరిగింది.

కష్టం అనుకోకుండా పనిచేస్తా: పాపమ్మ

1991లో ఆయాగా చేరా. అప్పట్లో రూ.100 మాత్రమే వేతనంగా ఇచ్చేవారు. కూలి కూడా రావటం లేదని నాతోపాటుగా చేరిన చాలామంది ఆయాలు మానివేశారు. అయినా నేనుమాత్రం ఇక్కడే ఇరవై ఆరేళ్లుగా కష్టాన్ని ఇష్టంగా మల్చుకుని పనిచేస్తున్నా. మా కార్యకర్తలు సత్యావతి, కల్పన సహకారంతో పనులన్నీ చక్కగా చేసుకుంటాను. జిల్లాస్థాయిలో అవార్డు పొందటం ఎంతో ఆనందంగా ఉంది.

మినీ లోకం



డాక్టర్‌గారు థర్మామీటర్ పెట్టమన్నది నోట్లో..!!

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి



సంఘటనస్థలంలో సైదులు మృతదేం

కొణిజర్ల: కొణిజర్ల వద్ద బుధవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. ఎస్‌ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బొట్లకుంటకు చెందిన గుగులోతు సైదులు(25) ద్విచక్రవాహనంపై ఖమ్మంవైపు వెళ్తుండగా, ఎదురుగా కొణిజర్ల వైపువస్తున్న ఓ కళాశాలబస్సును ఢీకొన్నాడు. ప్రమాదంలో సైదులు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

గురుకులాల్లో నూతన 'నాణ్యత విద్యావిధానం'

వైరా పాఠశాల పరిశీలనలో రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ రూపాదేవి వెల్లడి

వైరా: తెలంగాణ రాష్ట్రంలోని సాంఘికసంక్షేమ గురుకుల విద్యాలయాల్లో అధునాతన విద్యాబోధన కోసం నూతన నాణ్యత విద్యావిధానాన్ని అమలుచేస్తున్నామని.. ఆ విద్యాసంస్థల రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ రూపాదేవి వెల్లడించారు. వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన నూతన నాణ్యత విద్యావిధానాన్ని రూపాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. సులభతరంగా విద్యాబోధన చేసేందుకు నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఈ విధానాన్ని అమలుచేస్తున్నామన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలను ఒక రీజియన్‌గా ఏర్పాటుచేశామన్నారు. ప్రతినెలా మూడు సబ్జెక్టులను ఎంచుకొని ఒక్కోసబ్జెక్టుకు సంబంధించి 15మంది ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. అన్నిసబ్జెక్టుల్లో ఉపాధ్యాయులకు సకాలంలో ఈ శిక్షణ పూర్తిచేస్తామన్నారు. ఈ విద్యావిధానంలో 80శాతానికిపైగా నైపుణ్యం కనబరిచినవారికి యాత్రలు కూడా నిర్వహిస్తామన్నారు. అమెరికా యూనివర్సిటీల తరహాలో తెలంగాణలోని సాంఘికసంక్షేమ విద్యాలయాల్లో స్లిప్పుడు తరగతులు నిర్వహిస్తున్నామని ప్రకటించారు. 90శాతానికిపైగా విద్యాలయాల్లో ఈ విధానాన్ని అమలులోకి తెచ్చామన్నారు. ఎనిమిదో తరగతినుంచి ఇంటర్మీడియట్‌వరకు ఈ విధానాన్ని అమలుచేస్తున్నామని వివరించారు. దీంతో విద్యార్థులు ఒక రోజు ముందుగానే సంబంధిత పాఠ్యాంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనంచేసి మరుసటిరోజు తరగతిగదుల్లో వాటిగురించి చర్చించటం, సందేహాలను నివృత్తి చేసుకోవటానికి అవకాశం ఏర్పడుతుందని రూపాదేవి వివరించారు. కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలను అభివృద్ధిచేస్తున్నామన్నారు. ఇప్పటికే తమసంస్థ పరిధిలో 35 డిగ్రీకళాశాలలు ప్రారంభించామని డిప్యూటీ సెక్రటరీ ప్రకటించారు. నాణ్యమైన ఆహారం, అన్నివసతులు కల్పిస్తున్నామన్నారు. శిక్షణ కో ఆర్డినేటర్ జార్జివర్షి, జిల్లా కో ఆర్డినేటర్ కె.శారద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ రూపాదేవి .. నాణ్యత విద్యావిధానంపై శిక్షణనిస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ శారద

10న పోలీసులకు ప్రత్యేక వైద్యశిబిరం

జిల్లా పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్

ఖమ్మంక్రైం: పోలీస్ సిబ్బంది వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తున్నామని.. ఇందులో భాగంగా సెప్టెంబరు 10వతేదీన ఖమ్మంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటుచేయనున్నట్లు జిల్లా పోలీస్ కమిషనర్ తఫ్సీర్‌ఇక్బాల్ అన్నారు. పోలీస్‌సిబ్బందికి ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించేందుకు హైదరాబాద్‌కు చెందిన ఇండో-యూఎస్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రివైద్యులు ఎం.గౌతమ్‌రెడ్డి, ఎంవి.కమలాకర్‌రావు బుధవారం సీపీని కలిసి చర్చించారు. సీపీ ఇక్బాల్ మాట్లాడుతూ.. పోలీస్‌సిబ్బంది వ్యక్తిగత ఆరోగ్యపరిరక్షణకు వైద్యశిబిరం ఉపయోగపడుతుందన్నారు. పోలీస్ సిబ్బంది ప్రస్తుతం గణేష్ ఉత్సవ బందోబస్తుల్లో బిజీగా ఉన్నందున, ఉత్సవాల అనంతరం సెప్టెంబరు 10న వైద్యశిబిరం ఏర్పాటుచేస్తామన్నారు. పోలీస్‌సిబ్బంది శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీ సూచించారు.

29న జిల్లాస్థాయి ఆటల పోటలు

డీవైఎస్‌వో పరంధామిరెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్: నేషనల్ స్పోర్ట్స్‌డేను పురస్కరించుకొని ఈ నెల 29వ తేదీన నగరంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో జిల్లాస్థాయి 'అండర్-16' క్రీడాపోటీలు నిర్వహించనున్నట్టు డీవైఎస్‌వో పరంధామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో అథ్లెటిక్స్, వాలీబాల్, జిమ్నాస్టిక్స్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడాంశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు తీసుకుని 29న ఉదయం 8గంటలకు స్టేడియానికి రావాలని డీవైఎస్‌వో కోరారు. సమాచారం కోసం 08742-234328 నంబరుద్వారా సంప్రదించాలని కోరారు.

బేడీలు వేయడం చట్టవిరుద్ధం: మేజిస్ట్రేట్‌కు మధు ఫిర్యాదు

ఇల్లెందు: జిల్లా కారాగారంలో ఖైదీగా ఉంటున్న తనను రాజకీయ ఖైదీగా చూడకుండా మరో ఇద్దరి చేతులకు కలిపి బేడీలు వేసి కోర్టుకు తీసుకొస్తున్నారంటూన్యూడెమోక్రసీ నాయకుడు మాజీ దళకమాండర్ ఆవునూరి మధు జిల్లా న్యాయమూర్తికి ఫిర్యాదు చేశారు. బుధవారం కోర్టు వాయిదాకు హాజరైన సందర్భంగా మధు తనతోపాటు మరో ఇద్దరికి ఉమ్మడిగా బేడీలు వేశారని చెప్పారు. దొంగల్లాగా పరిగణిస్తూ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు.

విప్లవోద్యమాలను అణచివేసేందుకు సర్కారు కుట్ర

ఎన్డీ నేతల ఇళ్లపై పోలీసుదాడులను ఖండిస్తున్నాం ● రాష్ట్ర సహాయ కార్యదర్శి రంగారావు

ఖమ్మం అర్బన్: ఎన్డీ నేతల ఇళ్లపై పోలీసుదాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, విప్లవోద్యమాలను అణచివేసేందుకు ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని సీపీఐఎంఎల్ (ఎన్డీ) రాష్ట్ర సహాయకార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గత నాలుగురోజులుగా ఎన్డీ నేతలపై పోలీస్ నిర్బంధాలు ఎక్కువయ్యాయన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని ఎన్డీ నేతలను లొంగిపోవాలని. లేకుంటే ఎన్‌కౌంటర్ చేస్తామని హెచ్చరిస్తుండటంతోపాటు ఇళ్లలోకి చొరపడి సోదాలు చేస్తున్నారన్నారు. విప్లవసాహిత్యం తదితరాలను స్వాధీనం చేసుకుంటున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో తీవ్రంగా విఫలమైన ముఖ్యమంత్రి కేసీఆర్.. తనపనితీరును నిలదీసేపార్టీలను అణగదొక్కేందుకు పూనుకున్నారని రంగారావు విమర్శించారు.

● ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారన్న భయంతో తమపార్టీపై గతంలోలేని నిర్బంధాలను ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే తమపార్టీ దళనేత మధుపై ఉపా చట్టం మోపారన్నారు. ప్రజల తరఫున సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారన్న కారణంగానే తమ పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బంగారు తెలంగాణ సాధిస్తానని, ఆందోళనలులేని పౌరసమాజాన్ని ఏర్పాటు చేస్తానని, హక్కుల పరిరక్షణకు పాటుపడతానని గతంలో చెప్పిన ముఖ్యమంత్రి.. హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌ను ఎత్తివేశారన్నారు. గతంలోని కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల మాదిరిగానే టీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు.

నిత్యం నిజాంను సమర్థించే ముఖ్యమంత్రి కేసీఆర్.. తన పరిపాలనలోనూ నిజాంను ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారని రంగారావు ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఉద్యమించింది తమ పార్టీ సహా ఉద్యమపార్టీలే అనే విషయం కేసీఆర్‌కు ఎక్కువగానే తెలుసన్నారు. అయితే, ప్రశ్నించేతత్వం ఉన్న నేతలు తననూ నిలదీస్తారన్న భయంతోనే నిర్బంధాలకు పూనుకుంటున్నారని మండిపడ్డారు. ఇకనైనా.. ప్రభుత్వం అహంకారవైఖరివీడి ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్డీ రాష్ట్రనేత రాయల చంద్రశేఖర్, జిల్లా నాయకులు జి.రామయ్య, ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్డీ నేత పోటు రంగారావు

కల్తీలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి: ఎన్డీ

సత్తుపల్లి రూరల్: ఆహార ఉత్పత్తులలో కల్తీలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సత్తుపల్లి పట్టణంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్న కల్తీ కారం, పసుపు, నూనెలకు సంబంధించి కల్తీలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోని మరల ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సత్తుపల్లి కేంద్రంగా తయారైన ఉత్పత్తులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతోపాటు ఆంధ్రలో కూడా విక్రయిస్తున్నారన్నారు.

సత్తుపల్లి, పెనుబల్లి మండలాల్లో భారీవర్షం

● జలమయమైన రహదారులు

సత్తుపల్లి రూరల్: సత్తుపల్లి పట్టణం, మండలంలో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో దాదాపు రెండు గంటలపాటు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారి, అంతర్గత రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. సైడ్ డ్రెయిన్లలో వరద నీరు పొంగి పొర్లి లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి చేరింది. రెండు గంటల పాటు కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించడంతోపాటు ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. మండలపరిధిలోని గంగారం, బేతుపల్లి, రేజర్ల, పాకలగూడెం, రామానగరం గ్రామాల్లోని సైడ్‌డ్రెయిన్లలో పూడిక పేరుకుపోవడంతో చుట్టుపక్కల ఉన్న ఇళ్లల్లోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో ఆయాగ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పాకలగూడెం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో రోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరదనీరు చేరి బురద పేరుకుపోయింది.

పెనుబల్లిలో: మండలంలో బుధవారం ఉదయం కురిసిన వర్షానికి పెనుబల్లి, వీఎం బంజర్, లంకపల్లి గ్రామాల్లో ఆర్‌ఎండ్‌బీతో పాటు గ్రామ అంతర్గత రహదారులపై వర్షపునీరు చేరింది. వర్షపు నీరు రహదారులపై చేరడంతో గృహయజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెనుబల్లి ప్రధాన రహదారి తూర్పు బజార్‌కు వెళ్లే రహదారి నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ఆర్‌ఎండ్‌బీ రహదారిపైకి నీరు చేరడంతో ప్రధాన రహదారి



వీఎం బంజర్‌లో జలమయంగా రోడ్డు, గంగారంలో ఇంట్లోకి చేరిన నీరు

చెరువును తలపించేలా మారింది. వీటితో పాటు వీఎం.బంజర్‌లోని పాత ఎస్‌బీహెచ్ బ్యాంకు రహదారి నుంచి గ్రామీణ వికాస్ బ్యాంకు రహదారి వరకు సీసీ రోడ్లపై నీరు చేరడంతో గృహయజమానులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. దీంతోపాటు లంకపల్లి ప్రధాన కూడలి నుంచి ఏరుగట్ల వెళ్లే ఆర్‌ఎండ్‌బీ రహదారి కూడా జలమయంగా మారింది. ఆర్‌ఎండ్‌బీ రహదారులకు సైడ్‌డ్రెయిన్లు లేకపోవడంతో కురిసిన వర్షం నీరు రోడ్డుపై చేరుతున్నదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆర్‌ఎండ్‌బీ రహదారులు లక్షల రూపాయలతో నిర్మించినప్పటికీ సైడ్‌డ్రెయిన్లు లేకపోవడంతో త్వరగా పాడవుతున్నాయని, ఈరహదారులకు సైడ్‌డ్రెయిన్లు నిర్మించాలని కోరుతున్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థిని


విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

కల్లూరు: కల్లూరులోని తెలంగాణ గ్రామర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని స్థిత ప్రజ్ఞ అంతర్జాతీయ స్థాయిలో మలేషియాలో 25వ తేదీన జరగనున్న అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికైంది. ఈపాఠశాల తరపున స్థితప్రజ్ఞ వరంగల్‌లో ఈనెల 16వ తేదీన జరిగిన జాతీయ కరాటే పోటీల్లో ఛాంపియన్‌షిప్ సాధించడమేకాక అంతర్జాతీయ కరాటే పోటీలకు కూడా ఎంపికైంది. ఈసందర్భంగా మలేషియా వెళ్తున్న విద్యార్థినికి ఆపాఠశాల హెచ్‌ఎం టి.అబ్బాస్‌హసన్, పరిపాలనాధికారి జక్కంపూడి రమాదేవి, కోశాధికారి ఎండీ.అయూబ్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

'రుణాలను వెంటనే విడుదలచేయాలి'

తల్లాడ: బీసీ కార్పొరేషన్ రుణాలను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రా సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం తల్లాడ మండలం రెడ్డిగూడెం వద్ద జెర్సీమిల్క్ ఫ్యాక్టరీ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 50శాతం జనాభావున్న బీసీలను ఏకంచేసేందుకు ప్రతి గ్రామం, ప్రతి మండలంలో కమిటీలు ఏర్పాటుచేస్తున్నట్టు వివరించారు. ఈసమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లాఅధ్యక్షుడు పి.రామ్మూర్తి, యువజనసంఘం జిల్లా అధ్యక్షుడు మేడేపల్లి కృష్ణమాచారి, పమ్మి వెంకటాచారి, మల్లెల శ్రీనివాసరావు, కొత్తా శ్రీనివాస్‌గౌడ్, బొడ్డు కృష్ణ, రాకేష్, మహేష్ పాల్గొన్నారు.

చేతి పంపు నిర్మాణానికి శంకుస్థాపన

తల్లాడ: తల్లాడ మండలం రంగంబంజర గ్రామంలో చేతిపంపు నిర్మాణానికి బుధవారం ఎంపీటీసీ సభ్యుడు పగడాల లచ్చిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ పొంగులేటి నియోజకవర్గ అభివృద్ధి నిధులతో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.పదిలక్షలతో ఇప్పటివరకు 20బోర్లను నిర్మించినట్టు తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్


పిల్లల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ట్రైనీ కలెక్టర్

కల్లూరు: కల్లూరు మండలంలోని చెన్నూరు గ్రామాన్ని బుధవారం ట్రైనీ కలెక్టర్ హనుమంత్ కొండిబా సందర్శించి ప్రభుత్వం తరుపున జరగనున్న పలు అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి పంచాయతీలో నిర్వహణపరంగా చేపట్టిన అభివృద్ధి పనులు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమం అమలు తీరు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలు, గర్భిణులకు అందిస్తున్న సేవలు, పిల్లల నైపుణ్య సాధనపై క్షుణ్ణంగా ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శివకుమారి, ఈవోఆర్డీ గోపాలరావు, సర్పంచి పాలెపు లక్ష్మీకాంతమ్మ, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, వీఆర్వోలు విష్ణు, వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం ఎస్.పుల్లారావు పాల్గొన్నారు.

సప్తపది ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

పెనుబల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ సప్తపది ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 4 గంటలకు వీఎం బంజర్ రింగ్ సెంటర్‌లో వినాయకుడి మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీచేస్తామని క్లబ్ అధ్యక్షుడు మిట్టపల్లి జనార్ధన్ తెలిపారు. మట్టి విగ్రహాలతో పూజలు చేసే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బైపాస్ రోడ్డు నిర్మించాలంటూ కేంద్రమంత్రికి వినతిపత్రం

సత్తుపల్లి: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా సత్తుపల్లి పట్టణంలో బైపాస్ రోడ్డు నిర్మించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయకు భారతీయ జనతాపార్టీ నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూసంపూడి రవీంద్ర ఆధ్వర్యంలో పలువురు సత్తుపల్లి నుంచి హైదరాబాద్ వెళ్లి కేంద్ర మంత్రి దత్తాత్రేయను కలిశారు. ఈ మేరకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మంత్రితో మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణం గుండా జాతీయ రహదారి నిర్మిస్తే నాలుగు కిలోమీటర్ల మేర భవనాలు తొలగించాల్సి ఉంటుందని, తద్వారా భవనాల యజమానులు భారీ స్థాయిలో నష్టపోతారని అన్నారు. దీనికి స్పందించిన మంత్రి దత్తాత్రేయ ఈ సమస్యను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో మాట్లాడతానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.


మంత్రి దత్తాత్రేయకు వినతిపత్రం దృశ్యం

ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, భవనాల యజమానులు కోరుకొండ వెంకటేశ్వరరావు, కృష్ణారావు, వనమా భాస్కరరావు, నున్నా మిశ్రా, నాయుడు రాఘవరావు, విజయ్, సాలి శివకృష్ణ, శ్రీను ఉన్నారు.

దోమల నివారణపై ఇంటింటి ప్రచారం

పెనుబల్లి: దోమల పెరుగుదలను అరికట్టే విధానాలను లంకాసాగర్ పీహెచ్‌సీ సిబ్బంది బుధవారం మండలపరిధిలోని లంకా శేషయ్య బంజర్ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా లంకాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వారి ఇంటి వద్ద నీటి నిల్వలను తొలగించి ఆరోగ్య సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నీటి నిల్వ ఉండడం వల్ల దోమలు, ఈగలు చేరి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, హెచ్‌ఈవో


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆశోక్ బాబు, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఏఎన్‌ఎంలు మల్లమ్మ, రమాదేవి, ఆశా కార్యకర్తలు సరస్వతి, రాహేలమ్మ, రజిని పాల్గొన్నారు.

పర్యావరణ స్ఫూర్తి

● మట్టి గణపతి విగ్రహాలతో ఉత్సవాలు

● ప్రధాన మంటపాల్లో విగ్రహాల ప్రతిష్ఠకు ఏర్పాట్లు

సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రధానంగా రెండు పెద్ద మంటపాల్లో మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేస్తూ ఉత్సవాల నిర్వాహకులు పర్యావరణ స్ఫూర్తిని చాటుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన గణపతి విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని జరుగుతుందని కొన్నేళ్లుగా విస్తృతంగా ప్రచారం జరగటంతో రెండేళ్లుగా సత్తుపల్లిలో రెండు ఉత్సవ కమిటీలు మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటుచేసి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సత్తుపల్లి గణేష్ ఉత్సవ కమిటీ, వాసవీక్లబ్ సత్తుపల్లి గ్రేటర్, సత్తుపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో జరిగే నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటుచేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించబోతున్నారు.

మట్టి విగ్రహాలను వినియోగించాలని విద్యార్థుల ప్రచారం

తల్లాడ: పర్యావరణానికి హాని కలిగించని సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలంటూ విద్యార్థులు వినూత్న కార్యక్రమం నిర్వహించారు. బుధవారం తల్లాడ మండలం మల్లవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారుచేశారు. తాము తయారుచేసిన మట్టి వినాయక విగ్రహాలను ప్రదర్శించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోటగిరి రాధ, ఉపాధ్యాయులు కోటేశ్వరశర్మ, పద్మజ, రామకృష్ణ, అనసూయ పాల్గొన్నారు.


మట్టి విగ్రహాల తయారీ దృశ్యం


పీవోపీ విగ్రహానికి తీసిపోని మట్టి విగ్రహం


ముస్తాబవుతున్న మంటపం

సినిమాలు

సత్తుపల్లి

● శ్రీనివాస	జయ జానకీ నాయక
● శ్రీబాలాజీ	ఫిదా
● సాయి బాలాజీ	నేనే రాజు నేనే మంత్రి
శ్రీకృష్ణ	కాటమరాయుడు

మీ సేవలో 'ఆంధ్రజ్యోతి'

పాఠకులకు 'ఆంధ్రజ్యోతి'ని మరింత చేరువ చేయడానికి స్థానిక విలేకరుల ఫోన్ నంబర్లను ఇస్తున్నాం.. అవినీతి, అక్రమాల సమాచారాన్ని అందించండి. మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం

సత్తుపల్లి	9985411343
సత్తుపల్లి రూరల్	8501943215
వేంసూరు	9966944799
పెనుబల్లి	9949931415
కల్లూరు	9491541765
తల్లాడ	9866673481

ప్రజా సమస్యలపై సీపీఎం ఇంటింటి సర్వే



ఇంటింటి సర్వే నిర్వహిస్తున నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని రైతుల తోపాటుగా ఇతర ప్రజాసమస్యలపై సీపీఎం అధ్వర్యంలో ఇంటింటి సర్వేను బుధవారం నిర్వహించారు. మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఎంతమందికి ప్రభుత్వం లబ్ధిచేకురుస్తుందో అందుకే ఈ సర్వే అన్నారు. రేషన్‌సరఫరా నిరుద్యోగ యువత పేర్లు పంట పొలాలు ఉండి కూడా ఆన్‌లైన్ కాని రైతుల పేర్లు నమోదు చేసుకోని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. మండలంలో గత పదిహేను రోజులనుంచి అవినీతి ఆరోపణలపై వెళ్లిన తహసీల్దార్ స్థానంలో ఎవ్వరినీ నియమించకపోవడం ప్రభుత్వ తప్పిదం కాదా అన్నారు. ఈకార్యక్రమంలో జోగయ్య, వెంకటేశ్వరులు, భిక్షాలు, సగుర్తి సంజీవరావు, మాంగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లాటరీతో సంబంధం లేకుండా రుణాలివ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్

బోనకల్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు లాటరీతో సంబంధం లేకుండా రుణాలను ఇచ్చేలా చూడాలని బుధవారం కేవీపీఎస్ నాయకులు ఎంపీడీవో విద్యాలతకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆసంఘ జిల్లా సహాయ కార్యదర్శి కొమ్ము శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్యాంకులను సంప్రదించకుండానే అర్హతలను బట్టి రుణాలను మంజూరు చేయాలని కోరారు. రుణాలకోసం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను గ్రామపంచాయతీలలో ప్రదర్శించాలని, ప్రతి గ్రామానికి 20యూనిట్లను కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు రమేష్, నాగరాజు, వెంకయ్య, నరేష్, సత్యానందం పాల్గొన్నారు.

12మంది జూదరుల అరెస్టు

తల్లాడ: తల్లాడ మండలంలో నూతనకల్, మల్లవరం గ్రామాల్లో పేకాటాడుతున్న 12మంది జూదరులను బుధవారం తల్లాడ పోలీసులు పట్టుకున్నారు. తల్లాడ ఎస్ఐ మేడా ప్రసాద్ ఆధ్వర్యంలో ముందుగా నూతనకల్ గ్రామంలోని పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న శ్రీనివాసరావు, పాపారావు, వేణు, లోకేశ్వరరావు, సుధాకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరివద్దనుంచి రూ.2100 నగదును స్వాధీనం చేసుకున్నారు. మల్లవరం గ్రామంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్ ఆవరణంలో పేకాట స్థావరంపై కూడా ఎస్ఐ ఆధ్వర్యంలో దాడి చేసి జూదరులను పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో రమేష్, రాంబాబు, నాగబాబు, రాములు, లక్ష్మణ్, అశోక్, కిషోర్ ఉన్నారు. వీరి వద్దనుంచి రూ.1700నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో కానిస్టేబుళ్లు బాబు, ఫిరోజ్, సీతరాములు పాల్గొన్నారు.

బిల్లులను వెంటనే చెల్లించాలి

సత్తుపల్లి రూరల్: ఉపాధి హమి పథకం కింద సత్తుపల్లి మండలంలో నిర్మించుకున్న మరుగుదొడ్ల బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జాజిరి శ్రీనివాస్ అన్నారు.

అంతరించిపోతున్న కళలను కాపాడుకోవాలి

● ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవంలో కల్లూరు ఏసీపీ రాజేష్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ రాజేష్, మాట్లాడుతున్న ఏసీపీ

సత్తుపల్లి రూరల్: రాష్ట్రంలో జానపద కళలకు ఆదరణ కరువైందని, తెలంగాణ అంటే జానపద కళలకు పెట్టింది పేరని కల్లూరు ఏసీపీ బల్లా రాజేష్ అన్నారు. ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా బుధవారం సత్తుపల్లి పట్టణంలోని స్థానిక కళాభారతి ఆడిటోరియంలో జరిగిన కళాజాతరను జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జానపద కళలకు ఆదరణ తగ్గిపోతున్నదని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా సత్తుపల్లి జానపద సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం జానపద కళాకారులు జానపద నృత్యాలు, పాటల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాగృతి మహిళా కొ-కన్వీనర్ తన్నీరు శోభారాణి, సత్తుపల్లి తహసీల్దార్ డి.పుల్లయ్య, ఎంపీడీవో ఎన్.రవి, నగర పంచాయుతీ ఛైర్‌పర్సన్ దొడ్డాకుల స్వాతిగోపాలరావు, దిశ కమిటీ సభ్యుడు డాక్టర్ మట్టా దయానంద్‌విజయ్‌కుమార్, కేసీఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గ్రాండ్ మౌలాలి అలాగే పలువురు కళాకారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాల అందజేత



బాధితులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు

పెనుబల్లి: పెనుబల్లిలో అనారోగ్యానికి గురై అసుపత్రిలో చికిత్స చేయించుకొన్న బాధితుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ సందర్భంగా మంజూరైనట్టు ధ్రువపత్రాలను పెనుబల్లి ఎంపీటీసీ సభ్యుడు కోటగిరి సుధాకర్‌రావు బుధవారం పెనుబల్లి పట్టణానికి చెందిన బానోత్ నరసింహ అనే బాధితుడికి అందజేశారు. పెనుబల్లికి చెందిన బానోత్ నరసింహ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందగా ఆయన ముఖ్యమంత్రి సహాయం కోరుతూ దరఖాస్తు చేసుకోగా నిధులు మంజూరయ్యాయి. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు ధ్రువపత్రాలను పెనుబల్లి-1 ఎంపీటీసీ సభ్యుడు కోటగిరి సుధాకర్‌రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు, బొర్రా వెంకటేశ్వరరావు, రాంబాబు, దేవానందం, కృష్ణ, ప్రసాద్, బాజీ, కోటేశ్వరరావు, మారేశ్వరరావు, ఇజ్రాయిల్, సాంబయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

చర్చి రోడ్డులో పందుల స్వైర విహారం



పందుల స్వైర విహారం

సత్తుపల్లి: సత్తుపల్లి నగరపంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పందులు ఇళ్ల ఆవరణల్లోకి ప్రవేశించి బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే పట్టణంలో పలువురు జ్వరాలతో బాధపడుతున్న క్రమంలో పందుల వల్ల అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోంది. టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న చర్చి రోడ్డులో పందులు గుంపులుగా సంచరిస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పిల్లలపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. నగరపంచాయతీ అధికారులు పట్టణంలో పందులను నివారించాలని కోరుతున్నారు.

ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

కల్లూరు: త్వరలో గ్రామాల్లో ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని కల్లూరు ఆర్డీవో కుముదినిసింగ్ తెలిపారు. డివిజన్ కార్యాలయంలో బుధవారం గణేష్ ఉత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు ప్రారంభం నుంచి నిమజ్జనం అయ్యేవరకు ఉత్సవ కమిటీలు తగినవిధంగా బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగుబాయి, జడ్పీటీసీ సభ్యురాలు జర్కుల లీలావతి, ఎస్సై పవన్‌కుమార్, ఈవో శ్రీధర్ రెడ్డి, ఆర్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

కల్లూరులో బైపాస్ నిర్మాణానికి మంత్రి తుమ్మలకు విన్నపం



మంత్రి తుమ్మలను కలసిన కల్లూరు ప్రముఖులు, సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిదులు

కల్లూరు: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కల్లూరు బైపాస్ రహదారి నిర్మాణానికి కృషిచేస్తానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హమీ ఇచ్చినట్లు కల్లూరు వ్యాపార ప్రముఖులు తెలిపారు. కల్లూరులో బైపాస్ రహదారి నిర్మించే విషయమై మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పాలెపు రామారావు, జిల్లా ఆర్య వైశ్య విభాగం ఛైర్మన్ పసుమర్తి చంద్రరావు ఆధ్వర్యంలో వర్తక, వ్యాపార ప్రముఖులు బుధవారం హైదరాబాద్ తరలివెళ్లి మంత్రి తుమ్మలను కలిశారు. జాతీయ రహదారి విస్తరణతో విలువైన భవనాలను కోల్పోవడమే కాక వర్తక, వ్యాపార రంగానికి తీవ్రమైన నష్టం వాటిల్లితుందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ వలసాల జయలక్ష్మి, మండల టీఆ ర్ఎస్ నాయకులు లక్కినేని కృష్ణ, చారుగుళ్ల అచ్యుత సీతారామారావు, కొప్పరపు ఆంజనేయులు, మద్దినేని శ్రీను, బొప్పన శ్రీనాథ్, రామారావు, అనుమోలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మించాలి.... మండల పరిషత్తులో తీర్మానం

వేంసూరు: రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషిమేరకు మంజూరైన ఖమ్మం-అశ్వారావుపేట జాతీయ రహదారిని వేంసూరు మండలం నుంచి నిర్మించాలని వేంసూరు మండలంలోని ప్రజాప్రతినిధులు కోరుతూ తీర్మానించారు. బుధవారం వేంసూరు మండలపరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ జగన్నాథం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ జాతీయ రహదారిని వేంసూరు మండలం గుండా నిర్మించేందుకు అధికారులు కృషిచేయాలని కోరారు. గ్రామాల్లో బెల్టు షాపులు ఎత్తివేయాలని కోరుతూ సమావేశంలో తీర్మానించారు. గతంలో పేదలు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. మరుగుదొడ్లనిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఇసుక కొరత ఏర్పడిందని, అధికారులు పట్టుకుంటున్నారని, వీటిని ఎలా నిర్మించాలని సర్పంచులు ప్రశ్నించారు. ఈసమావేశంలో ఎంపీడీవో గోవిందరావు, తహసీల్దార్ ఎన్‌టీ. ప్రకాశరావు, ఎక్సైజ్ ఎస్సై నాగరాజు, సర్పంచులు తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, పలగాని అప్పారావు, గాదె వెంకటరమణ, మందపాటి విజయలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు వెల్ది జగన్మోహనరావు, నాగళ్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఖమ్మంలో భారీ చోరీ

- 70తులాల బంగారం, ఐదుకిలోల వెండి చోరీ
- శ్రీరాంహిల్స్‌లో ఘటన

ఖమ్మంక్రైం: ఖమ్మంనగరంలో బుధవారం భారీ చోరీ జరిగింది.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చాకచక్యంగా నగలను అపహరించారు.. వీటి విలువ దాదాపు రూ. రూ.20లక్షల వరకు ఉంటుందని అంచనా. నున్నా రాధాకృష్ణ ఇంటి ప్రధాన తలుపును, లోపల కప్‌బోర్డ్‌లోని ఇనుప లాకర్‌ను అత్యంత నైపుణ్యంగా పగల గొట్టారు. ఇంట్లో వస్తువులను ఏమాత్రం చిందర వందర చేయకుండా కేవలం తమకు కావాల్సిన వస్తువులను మాత్రమే ఎత్తు కెళ్లారు.ఇంటికి సంబంధించిన వివరాలు పూర్తిగా తెలిసిన వారో లేక దొంగతనాల్లో ఆరి తేరిన ప్రొఫెషనల్ దొంగల పనో అయి ఉంటుందని అంచనా వేస్తున్నారు.. ఇంట్లోకి ప్రవేశించే ప్రధాన ద్వారం వద్ద తలుపుకు సంబంధించిన ధర్వాజ కమ్మిని ఒక పేడు మందం తొలిచారు.. అత్యంత పటిష్టంగా ఉన్న లాకర్‌ను ఏమాత్రం దెబ్బ తినకుండా తెరవటం గమనార్హం.. రాధాకృష్ణ సర్వం పేటలో పీడీగా పనిచేస్తుండటంతో ఆయన విధుల నిర్వహణకు అక్కడే ఉంటున్నారు.. తల్లి మరణించటంతో ఆయన భార్య రెండు రోజుల క్రితం కొత్తగూడెం వెళ్లారు.. ఇంట్లో ఎవరూ లేక పోవటంతో దొంగతనానికి ఆస్కారం ఏర్పడింది. ఇంటి తలుపు కొద్దిగా తెరిచి ఉండటంతో పని మనిషి వచ్చి చూసింది.. ధర్వాజ పగల గొట్టి ఉండటం,పిలిచినా ఎవరూ పలకపోవటంతో ఇరుగు పొరుగు వారికి చెప్పగా వారు రాధాకృష్ణకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. బాధితుడు రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఇటీవలే వివాహమైన తన కూతురు నగల భద్రత కోసం తమ ఇంట్లో దాచిందని చెప్పారు.. దోపిడీలో ఈ నగలన్నీ పోయాయని వాపోయాడు. ఈవిషయమై అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన ప్రదేశాన్ని ఏసీపీ గణేష్ పరిశీలించారు.




చోరీ జరిగిన ఇల్లు, ధర్వాజా పేడు తొలగించిన ప్రాంతం

నగరంలో షోలాపూర్ గ్యాంగ్?

షోలాపూర్‌కు చెందిన ఆరితేరిన దొంగలు ఈ దోపిడీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. కొద్ది రోజులుగా ఖమ్మంలో వరుసగా చోరీలు నమోదవు తున్న విషయం తెలిసిందే. మహిళల మెడలో బంగారు నగలను లాక్కెళ్లటంతో పాటు, ఆర్టీసీ బస్సుల్లో బంగారు వ్యాపారి నుంచి రెండు కిలోల బంగారం చోరీ, శ్రీరాం హిల్స్‌లోని భారీ చోరీ, పలు ప్రాంతాల్లో చోరీకి యత్నాల తీరు చూస్తుంటే దొంగతనాల్లో చేయి తిరిగిన బ్యాచ్ పనిగా భావిస్తున్నారు.. పలుప్రాంతాల్లో సేకరించిన సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా అనుమానితులను గుర్తించారు. వీరు షోలాపూర్‌కు చెందిన వారుగా భావిస్తున్నారు. వీరి కోసం ఖమ్మం నుంచి పోలీస్ బృందం షోలాపూర్‌కు వెళ్లినట్లు సమాచారం.

అమ్మా.. అనిపించుకునేలోపే..

అస్వస్థతతో తల్లి.. గర్భంలోనే చిన్నారి మృతి

వెక్కిరించిన పేదరికం.. అశ్వారావుపేటలో విషాదం

అశ్వారావుపేట రూరల్/ టౌన్: తొమ్మిది నెలల పాటు అష్టకష్టాలు పడి కడుపులో బిడ్డను మోసింది. మరి కొద్ది గంటల్లోనే పండంటి బిడ్డకు జన్మనిచ్చి అమ్మ అనిపించుకోవాలని ఎంతో ఆత్రుతగా ఎదురు చూసింది. అంతలోనే అనుకోని సంఘటనతో అస్వస్థతకు గురైంది. బిడ్డకు జన్మనిచ్చేలోపే అనంతలోకాలకు వెళ్లింది. చిన్నారి కూడా బాహ్య ప్రపంచాన్ని చూడకుండానే గర్భంలోనే తనువు చాలించింది. అందరూ సంతోషంతో ఉన్న వేళ ఊహించని సంఘటనతో అందరూ ఒక్కసారిగా దుఃఖసాగరంలో మునిగిపోయారు. పేదరికం వీరిని వెంటాడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని నారాయణపురానికి చెందిన ఆకుల సత్యనారాయణ, నాగమణి కూతురు శిరీష(24)కు ఏపీ రాష్ట్రంలోని కుక్కునూరు మండలం కొండపల్లి గ్రామానికి చెందిన బొందుల శేఖర్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. శిరీషకు మొదటి కాన్పు సమయంలో పెద్దాపరేషన్ చేసి ప్రసవం చేశారు. ప్రస్తుతం వీరికి రెండేళ్ల రాంపండు ఉన్నాడు. రెండో కాన్పు కోసం శిరీష తన తల్లిదండ్రుల ఊరు నారాయణపురం వచ్చింది. ఇక్కడే ఉంటూ వైద్యసేవలు పొందుతోంది. ప్రసవ సమయం దగ్గర పడుతుండటంతో ఆసుపత్రిలో చేరేందుకు నిశ్చయించుకున్నారు. ఇదే సమయంలో బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో శిరీషకు ఒక్కసారిగా పురిటి నొప్పులు మొదలయ్యాయి. ఆసుపత్రికి వెళ్లాలనుకునేలోపే నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు 108 ద్వారా అశ్వారావుపేటలోని ఓప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అప్పటికే శిరీషకు అధికంగా రక్తస్రావమై పరిస్థితి విషమించింది. ఆపరేషన్ చేయాల్సి వస్తుందని, వెంటనే ఖమ్మం తీసుకెళ్లాలని సూచించారు. పేదరికంతో మగ్గుతున్న శిరీష తల్లిదండ్రులు అతి కష్టమ్మీద నగదు సమకూర్చుకున్నారు. ప్రైవేటు వాహనంలో ఖమ్మం బయలు దేరారు. సత్తుపల్లికి చేరుకోగానే పరిస్థితి విషమించింది. గత్యంతరం లేక అక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసేలోపే శిరీష మృతి చెందింది. ఆమెతో పాటే కడుపులో ఉన్న పసికందు మృతిచెందింది. శిరీష మృతితో కుటుంబసభ్యులు బోరున విలపించారు. చిన్నతనంలో తల్లిని కోల్పోయిన రెండేళ్ల రాంపండును చూసి పలువురు కన్నీరు పెట్టుకున్నారు.



శిరీషమృతదేహం

వివాహిత ఆత్మహత్య

అన్నారం, (ములకలపల్లి): కడుపు నొప్పి తట్టుకోలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలో జరిగింది. పూసుగూడెం పంచాయతీ అన్నారం గ్రామానికి చెందిన తాటి సారయ్య, రాములమ్మ దంపతులకు తాటి జ్యోతి (18) అనే కుమార్తె ఉంది. ఆమెను ఇదేమండలంలోని జగన్నా ధపురం పంచాయతీ రావిచ్చగూడెనికి చెందిన పూశే చిన్న రాజులుతో ఆరునెలల క్రితం వివాహమైంది. వివాహ అనంతరం పాల్వంచలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఈక్రమంలో జ్యోతి మంగళవారం అన్నారంలోని పుట్టింటికి వచ్చింది. సాయంత్రం ఇంటివద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కడుపునొప్పి కారణంగా ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

800 లీటర్ల నీలి కిరోసిన్ పట్టివేత

నేలకొండపల్లి : ఖమ్మం జిల్లా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్న 800 లీటర్ల నీలికిరోసిన్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం నేలకొండపల్లి మండలం రాయిగూడెంవద్ద స్వాధీనం చేసుకున్నారు. తెల్దారుపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ బాబు నేలకొండపల్లి మండలం బోదులబండకు చెందిన జి.వెంకన్న గ్రామాల్లో నీలికిరోసిన్ సేకరించారు. తెల్దారుపల్లి నుంచి ఏపీలోని కృష్ణా జిల్లాలోని జిల్లా షేర్ మహ్మద్ పేటకు కొద్దిరోజులుగా అక్రమంగా కిరోసిన్‌ను ఏపీకీ తరలిస్తున్నారు. బుధవారం కిరోసిన్‌ను తరలిస్తుండగా సమాచారం అందుకున్నారు. తనిఖీలు నిర్వహించి 800 లీటర్ల నీలి కిరోసిన్, ట్రాలీ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

బీసీ గురుకులంలో వికటించిన పాలు

- 21 విద్యార్థినులకు తీవ్రఅస్వస్థత
- ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై ఎమ్మెల్యే ఆగ్రహం,కలెక్టర్‌కు ఫిర్యాదు

అశ్వారావుపేట టౌన్/ అశ్వారావుపేట రూరల్: అశ్వారావుపేట బీసీ బాలికల గురుకుల పాఠశాలలో కల్తీపాలు తాగి 21మంది విద్యార్థినులు బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటనపై స్థానిక ఎమ్మెల్యే, ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.నూతనంగా ఏర్పాటు చేసిన ఈ గురుకుల బాలికల పాఠశాలలో 47మంది విద్యార్థినులు ఉన్నారు. బుధవారం ఉదయం అల్పాహారానికి ముందు వారికి పాలు అందజేశారు. పది నిమిషాల్లో ఒక్కరొక్కరుగా తీవ్రఅస్వస్థతకు గురయ్యారు. ఊపిరి ఆడకపోవడం, చేతులు వంకరలు తిరిగిపోయాయి. మొత్తం 21మంది విద్యార్థినిలు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో పాఠశాల సిబ్బంది పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. డీఎంహెచ్‌ఎంఓ డా.దయానందస్వామి విద్యార్థినులను పరిశీలించారు. వీరిలో తీవ్రఅస్వస్థతకు గురైన సాయి సౌమ్య, ఇందు ప్రియ, కొనకళ్ళ ఇందుతో పాటుమరో ఇద్దరిని మెరుగైన వైద్యంకోసం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు.



చిన్నారులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

కక్కుర్తే ఘటనకు కారణం

పాఠశాలకు పాలను సరఫరా చేసేందుకు దమ్మపేటకు చెందిన కాంట్రాక్టర్ టెండర్‌ను పొందారు. నిబంధనల ప్రకారం విజయపాలను సరఫరా చేయాల్సిఉంది. అయితే కాంట్రాక్టర్ విజయపాలను కాకుండా పట్టణంలోని ఓ దుకాణం నుంచి తిరుమలపాలను కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నారు. నాణ్యమైన పాలు కాకుండా తక్కువ ధరకు టోన్డ్ మిల్క్ ప్యాకెట్లును కొనుగోలు చేస్తున్నారు. కాం ట్రాక్టర్‌తో కుమ్మక్కైన ప్రిన్స్‌పాల్, వార్డెన్‌లు తక్కువ ధరతో కొనుగోలు చేసిన పాలను అనుమతిస్తున్నారు. ఈ నేపధ్యంలోనే బుధవారం పాలు వికటించి పిల్లలకు అస్వస్థతకు కారణంగా చెపుతున్నారు.

కుళ్లిన కూరగాయలు.. బూజుపట్టిన మిరపకాయలు

పాఠశాలలో కుళ్లిన కూరగాయలు, బూజుపట్టిన ఎండిమిర్చి కనిపించాయి. కారం, ఉప్పు, పసుపువంటి నాణ్యతలేని సరుకులు కనిపించాయి. పొంగళిలో చట్నీకి బదులు చారును తయారు చేశారు. పాఠశాలలో కోడిగుడ్డు, అరటిపండ్లు వంటివి ఎక్కడా కానరాలేదు.

ప్రిన్సిపాల్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం

అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థినులను ట్రైకార్ చైర్మన్, ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పరామర్శించారు. అనంతరం పాఠశాలను సందర్శించారు ప్రిన్స్‌పాల్ కృష్ణవేణిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మీ పిల్లలైతే ఇలాంటి భోజనం పెడతారా... ఇలా చేస్తే మీ ఉద్యోగాలు ఊడతాయంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్కడనుంచే కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు పాఠశాల పరిస్థితి, సిబ్బంది, కాంట్రాక్టర్ల అక్రమాలపై ఫిర్యాదు చేశారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాలు, బూస్ట్ శాంపిల్స్‌ను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.

పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

- ఉద్యోగాలపేరుతో మోసం
- కేసులో విచారిస్తుండగా ఘటన

మధిర: ఖమ్మంజిల్లా మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు వెంటనే గుట్టుచప్పుడు కాకుండా ఖమ్మంలోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. భూపాలపల్లి జిల్లా ఏటూరి నాగారం మండలం దాట్ల గ్రామానికి చెందిన పాయం నాగలక్ష్మి, ఆలియాస్ కల్పన, చంద్రకళ అనే మహిళ వేణు అనే వ్యక్తిని పెళ్లిచేసుకుంది. కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం సత్యాలపాడులో నివాసముం టోంది. ఈమె వడ్డీలతోపాటు వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తోంది. ఈక్రమంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మధిర మండలంలోని ఆత్కూరు, అంబారుపేట, బంజారా కాలనీ, చింతకాని మండలంలోనూ మోసాలకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. మధిర టుటౌన్‌లోని బంజారాకాలనీకి చెందిన కంపరాజు లక్ష్మయ్య పోలీసుకు ఫిర్యాదు చేశారు. తన ఇద్దరు కొడుకులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.5లక్షలు తీసుకొని మోసగించిందని ఫిర్యాదు చేశారు. పోలీసులు బుధవారం మధ్యాహ్నం సత్యాలపాడు నుంచి కల్పనను విచారణ పేరుతో తీసుకువచ్చారు. స్టేషన్‌లో విచారణ చేస్తుండగానే బాత్‌రూమ్‌కు వెళ్లి అందులోనే కొంగుతో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం గ్రహించిన పోలీసులు వెంటనే ఓప్రత్యేక వాహనంలో గుట్టు చప్పుడు కాకుండా ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నట్లు సమాచారం.ఇదిలా ఉండగా ఈ విషయమై టౌన్ ఎస్ఐ తిరుపతిరెడ్డిని వివరణ కోరగా విచారణ కోసం తీసుకువచ్చిన ఆమెకు వాంతులు అయి నీరసంగా ఉండటంతో ఆసుపత్రికి పంపించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉందని పేర్కొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 5, 7

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు భాగస్వామి సహకారం లభిస్తుంది. కృషి రంగంలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. సంకల్పం నెరవేరుతుంది. ప్రియతములతో విందు వినోదాల్లో పాల్గొంటారు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. క్యాటరింగ్, వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారికి అనుకూలం.

మిథునరాశి: (మే21-జూన్21): ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. లక్ష్యాలు సాధిస్తారు. ప్రియతముల రాకతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. బంధుమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి ప్రోత్సాహకరం. సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): రవాణా, ఏజెన్సీలు, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం అందుకుంటారు. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. వ్యక్తిగత సౌకర్యాల కోసం ఖర్చు చేస్తారు. ఆర్థిక వ్యవహారాల్లో కొత్త ప్రయోగాలకు తగిన సమయం. సంకల్పం నెరవేరుతుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. రాజకీయ, సినీరంగాల వారికి ఉల్లాసంగా ఉంటుంది. ఒక సమాచారం ఆహ్లాదం కలిగిస్తుంది.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలం. సినీ, రాజకీయ, ఫొటోగ్రఫీ, ఎగుమతుల రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఒక సమాచారం ఉత్సాహం కలిగిస్తుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు సంబంధించిన పనులు పూర్తవుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరం సమావేశాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): వేడుకలు, సమావేశాల్లో ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి, వ్యాపారాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బంధుమిత్రులతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. పూర్వమిత్రులను కలుసుకుంటారు. లక్ష్య సాధనలో గత అనుభవం తోడ్పడుతుంది. ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం లభిస్తుంది. భాగస్వామి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆరోగ్యంపై దృష్టి సారించాలి. స్పెక్యులేషన్లు, పందాలు, పోటీల్లో పాల్గొంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ఆలయ సమాచారం..

జమలాపురం వెంకన్న



కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
టీటీడీ సత్రం	12	00
సీహెచ్ఎన్ఎన్	10	05

సంప్రదించాల్సిన ఫోన్ నెం: 08749-279855
ఈవో రమణమూర్తి: 94910 00705
ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ : 99895 07300

- *తెల్లవారుజామున 4.30గంటలకు ఆలయాన్ని తెరుస్తారు.*
- *5గంటలకు తీర్థబిందెలు తెచ్చే కార్యక్రమం.*
- *6.30కి మంగళహారతి, మంత్రపుష్పం సమర్పణ.*
- *ఉదయం 7.00గంటలకు బాలభోగ నివేదన.*
- *7.10 నుంచి 12గంటల వరకు సర్వదర్శనం, ఆర్జిత సేవలు.*
- *10.30 గంటలకు స్వామివారి నిత్య కల్యాణం.*
- *సాయంత్రం 3గంటల నుంచి తిరిగి ఆర్జిత సేవలు.*

భద్రాచలం రామయ్య

కాటేజీ/సదనం	మొత్తం	ఖాళీలు
కాటేజీలు	26	15
వందగదుల సదనం	62	39
శ్రీరామ సదనం	18	12
టీటీడీ సదనం	26	16
సౌమిత్రి సదనం	30	21

సంప్రదించండి..
దేవస్థానం కేంద్రీయ విచారణ కార్యాలయం : 08743-232467, 7660007671



తెల్లవారుజామున 4.30 నుంచి 5.30 వరకు, ఉదయం 7 గంటల నుంచి 1గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి 8.30 వరకు సర్వదర్శనం.

ప్రత్యేక దర్శనం టిక్కెట్టు ధర ఒకటికి : రూ.20

నిత్య సేవలు ఇలా..

- *తెల్లవారుజామున 4.30కి సుప్రభాతసేవ.*
- *5.30 నుంచి 7గంటల వరకు బాలభోగం, నివేదన సేవాకాలం.*
- *ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు సహస్రనామార్చన.*
- *8.30 నుంచి 11.30 వరకు, 12.30 నుంచి 1గంట వరకు, 3 నుంచి 8 గంటల వరకు మూల వరుల వద్ద అర్చన.*
- *9.30 నుంచి మధ్యాహ్నం 11.30 వరకు నిత్య కల్యాణం.*
- *11.30 నుంచి 12గంటల వరకు రాజభోగం.*
- *మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు ఆలయ తలుపులు మూస్తారు.*
- *రాత్రి 7గంటల నుంచి 8 వరకు దర్బారు సేవ.*
- *8.30 నుంచి 9 గంటల వరకు నివేద భోగం అనంతరం పవళింపు సేవ. ఆ తర్వాత ఆలయం తలుపులు మూస్తారు.*

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పంటల ధరలు (క్వింటాలుకు రూపాయల్లో)

పంట	కనిష్ఠం	నమూనా	గరిష్ఠం
పత్తి	3000	4,600	5,100
మిర్చి	2,000	3,800	5,400
మిర్చి (తాలు)	1,000	1,200	1,500
కందులు	3,800	4,000	4,426
పెసలు	3,011	4,000	5,150
మొక్కజొన్న	-	-	-
బొబ్బర్లు	-	-	-
మినుములు	-	-	-
వేరుశనగ	-	-	-





- ఖమ్మం స్పోర్ట్స్

ఉష్ణోగ్రత వివరాలు సెల్సియస్ డిగ్రీల్లో..

	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	25	33
కొత్తగూడెం	24	33

27నుంచి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పర్యటన

చైర్‌పర్సన్ రేణుకాచౌదరి ఆధ్వర్యంలో 20 మంది ఎంపీల రాక

అడవులు, కాలుష్యం, సైన్స్ అండ్ టెక్నాలజీపై పరిశీలన

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి-ఖమ్మం)

జిల్లాలో అడవులు, కాలుష్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలను పరిశీలించేందుకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రాబోతుంది. రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి చైర్‌పర్సన్ హోదాలో 20 మంది వివిధ పార్టీల ఎంపీల బృందం ఉమ్మడి జిల్లాలో రెండు రోజులపాటు ప ర్యటించబోతున్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఖమ్మం, భద్రాద్రి ఉమ్మడి జిల్లాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ స్వయంగా పరిశీలన చేయడంతోపాటు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నారు. రెండు జిల్లాలో సింగరేణి బొగ్గు గనులతోపాటు విస్తారంగా ఉన్న అడవులు, పరిశ్రమల నుంచి వెలువడుతున్న వాయు, జలకాలుష్యం తదితర అంశాలపై కమిటీ స్వయంగా పరిశీలించనుంది. ఆయా పరిశ్రమలను ప్రత్యక్షంగా తిలకించి సమావేశాలు నిర్వహించి కేంద్రానికి నివేదిక సమర్పించనుంది. 27న హైదరాబాద్ నుంచి ఖమ్మం చేరుకుని అర్బన్ మండల పరిధిలోని వెలుగుమట్ల అటవీశాఖ పార్కును పరిశీలిం చనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌లో రైతులను కలుసుకోనున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్‌లో గనులను సందర్శించి అధికారులతో సమావేశం కానున్నారు. పాల్వంచలోని కేటీపీఎస్‌ను సందర్శించి పర్యావరణంపై చర్చించనున్నారు. అనంతరం భద్రాద్రి ఐటీసీ పేపర్‌బోర్డుకు చేరుకుని రాత్రి బస అనంతరం 28వ తేదీ ఉదయం భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని సందర్శించనున్నారు. ఆ తర్వాత మణుగూరు హెవీవాటర్ ప్రాజెక్టును సందర్శించి అక్కడ అధికారులతో కమిటీ చర్చిస్తారు. అదేరోజు సాయంత్రం సారపాకలోని ఐటీసీ బీపీఎల్ కర్మాగారాన్ని సందర్శించి 28న రాత్రికి హైదరాబాద్ చేరుకుంటారు.



రజకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మధిర టౌన్: రజకుల సంక్షేమానికి గతంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధిశాఖ చైర్మన్ బుడాన్‌బేగ్, రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ కొండూరి సత్యనారాయణ అన్నారు. బుధవారం మధిరలోని సాయిబాబా కళ్యాణ మండపంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రజకుల అవగాహన సదస్సు జిల్లా అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో వారు మాట్లాడారు. రజకుల సంక్షేమానికి కేసీఆర్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి రూ.250కోట్ల నిధులు మంజూరు చేసి 31 జిల్లాల్లో యూనిట్లకు రుణం అందించేందుకు కృషిచేస్తోందని పేర్కొన్నారు. నిరుద్యోగ రజక యువకులకు రుణాలిచ్చి వృత్తినైపుణ్యతను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ నాగరాణి, టీఆర్ఎస్ నాయకుడు లింగాల కమలరాజు, రజక సంఘం రాష్ట్ర కోకన్వీనర్ చల్లా వీరేశం, శ్రీనివాస్, తలుపుల వెంకటేశ్వర్లు, తమ్మారపు బ్రహ్మయ్య, తిరుమలగిరి రాధాకృష్ణ, మంకెన కృష్ణ, నిమ్మటూరి రామకృష్ణ, నర్సింహారావు, సాయిబాబా, అల్లూరి కృష్ణ, విజయబాబు, తిరుమల, పద్మ, మల్లెల సత్యనారాయణ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బేగ్

సెప్టెంబరు 20నుంచి అక్టోబరు 4 వరకు

దసరా సెలవులు

అక్టోబర్ 9నుంచి ఎస్ఎ- 1పరీక్షలు

కొత్తగూడెం అర్బన్: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెప్టెంబరు 20వ తేదీ నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు దసరా సెలవులను విద్యాశాఖ ప్రకటించింది. దసరా సెలవుల అనంతరం సమ్మెటీవ్ (ఎస్ఎ-1) -1 పరీక్షలు నిర్వహించనున్నారు. సంక్రాంతి సెలవులు జనవరి 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ప్రకటించింది. ఎఫ్ఎ-2 పరీక్షలు సెప్టెంబరు 19వ తేదీ లోగా, ఎఫ్ఎ-3 పరీక్షలు నవంబరు 20వ తేదీలోగా, ఎఫ్ఎ-4 పరీక్షలు 31జనవరి 2018లోగా నిర్వహించాలని ఆదేశించింది. ఎస్ఎ-2 పరీక్షలు మార్చి 7వ తేదీ (2018) నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలు 2018 ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వర కు నిర్వహిస్తారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జూలై, ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు, జనవరి ఫిబ్రవరి (2018) నెలల్లో నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. వేసవి సెలవులు 2018 ఏప్రిల్ 12నుంచి జూన్ 1వ తేదీ వరకు ఉంటాయి. గతంలో జూన్ 12వ తేదీన పాఠశాలలు పున:ప్రా రంభం అయ్యేవి. అయితే జూన్ 2వ తేదీ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 1వ తేదీనే పాఠశాలలు తెరుస్తారు. ప్రతి ఏడాది మార్చి 23వ తేదీ లోగా సిలబస్‌పూర్తి చేయాలి. ఈ సారి జూన్ 1వ తేదీనే పాఠశాలలు పున: ప్రారంభమవుతాయి.

సూక్తి

సేవను మించిన ఆనందం లేదు
సంతోషాన్ని మించిన సంపద లేదు

టంగ్ ట్విస్టర్స్

1. Rory the warrior and Roger the worrier were reared wrongly in a rural brewery.
2. Chester Cheetah chews a chunk of cheep cheddar cheese.
3. Real rock wall, real rock wall, real rock wall
4. A gazillion gigantic grapes gushed gradually giving gophers gooey guts.

నవ్వుల్ నవ్వుల్

టీచర్ : ఏ రోజు పని ఆ రోజే చేయడం ఉత్తముల లక్షణం. అర్థమైందా?
బంటు : అర్థమైంది టీచర్. రేపటి హోంవర్క్ రేపే చేయాలి. ఈ రోజు కాదు!
టీచర్ : !!!!!!!!

ఓటమే లేకుండా..

ఏ ఆటలోనైనా గెలుపు-ఓటములు తప్పవు. కానీ కెరీర్ మొదలుపెట్టిన నాటి నుంచి ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా విజయాలు సాధించడం మామూలు విషయం కాదు. పుణేకు చెందిన జూనియర్ గోల్ఫర్ ఆర్యమన్ సింగ్ అదే చేసి చూపించాడు . నాలుగేళ్లుగా విజయాలే సాధిస్తూ దూసుకుపోతున్నాడు. 'ఇండియన్ గోల్ఫ్ యూనియన్- వెస్ట్ జోన్' అందించే 'ఆర్డర్ ఆఫ్ మెరిట్'ను వరుసగా మూడు సార్లు సాధించాడు. జోనల్ లెవల్‌లోనూ, జాతీయ స్థాయిలోనూ ఈ జూనియర్ గోల్ఫర్‌కు తిరుగులేదు. జూనియర్ గోల్ఫ్ చరిత్రలో 1,266 రోజులుగా ఓటమి ఎరుగని అజేయుడిగా నిలిచి సరికొత్త రికార్డు సాధించాడు.



ఆర్యమన్ సింగ్ వయసు పదేళ్లు. ప్రొఫెషనల్ ప్లేయర్‌గా గోల్ఫ్ ఆడటం మొదలెట్టి నాలుగేళ్లు అవుతోంది. జోనల్ లెవల్‌లో ఇంతవరకు ఆర్యమన్‌కు తిరుగులేదు. ఈ ఛోటా గోల్ఫర్ తన కెరీర్‌లో ఒక్క మ్యాచ్‌ను కూడాచేజార్చుకోలేదు. 1,266 రోజులుగా తన విజయ యాత్ర కొనసాగిస్తూ జూనియర్ లెవల్ గోల్ఫ్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు.

'నా నాలుగో ఏట నుంచి గోల్ఫ్ ఆడటం మొదలుపెట్టాను. రెండు సంవత్సరాల పాటు గోల్ఫ్ సాధన చేశాను. ఆట గురించే ఎప్పుడూ ఆలోచించేవాడిని. జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయుల్లో జరిగే ప్రతి గోల్ఫ్ టోర్నమెంట్‌లో పాల్గొనేవాడిని. అహ్మదాబాద్‌లోని 'కెన్స్‌విల్లే గోల్ఫ్ కోర్సు'లో జరిగిన మ్యాచ్‌లో తొలిసారిగా విజయం సాధించాను. ఆనాటి నుంచి ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తూ వస్తున్నాను. మూడేళ్లుగా 'జస్టిన్ పార్కన్స్' నాకు కోచింగ్ ఇస్తున్నాడు. గోల్ఫ్ క్రీడలో పేరుగాంచిన మార్క్ రోయ్, డేవిడ్ స్టాక్టన్, విజయ్ దివెచ వంటి దిగ్గజాల దగ్గర ఎన్నో మెలకువలు నేర్చుకున్నాను. నేనింకా గోల్ఫ్ నేర్చుకునే దశలోనే ఉన్నాను. భవిష్యత్తులో ఈ క్రీడలో మరింత రాణించాలని అనుకుంటున్నాను. నాకు గోల్ఫ్‌తో పాటు క్రికెట్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, టెన్నిస్ క్రీడలంటే కూడా ఎంతో ఇష్టం. సమయం చిక్కితే అవి కూడా ఆడుతుంటాను. టీవీ చూస్తాను. స్కూల్‌వర్క్ కంప్లీట్ చేసుకున్న తర్వాతే ఆటలు ఆడతాను'

- ఆర్యమన్



ఔనా!

ఉడుము ఊపిరి తీసుకోకుండా నీటిలో అరగంట పాటు ఉండగలదు.



చుక్కలు కలపండి



మీకు తెలుసా?




58 శాతం మంది మహిళలు ప్రతిరోజూ నెయిల్ పాలిష్ వేసుకుంటారని ఓ అధ్యయనంలో తేలింది.

రంగులు వేయండి



బొమ్మ గీయండి



జంబ్లింగ్ వర్డ్స్


ఈ కింది పదాలను సరిచేయండి

1. KJOE ▸ ....
2. HAET ▸ ....
3. THBA ▸ ....
4. RSHU ▸ ....

చెప్పగలరా?

నాడిలో ఉన్నా కానీ కోడిలో లేను
జూలులో ఉన్నా కానీ జూన్‌లో లేను
గుడిలో ఉన్నా కానీ బడిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

దారి కనుక్కోండి



జవాబులు

చెప్పగలరా? : నాలుగు
జంబ్లింగ్ వర్డ్స్ :
1. JOKE 2. HATE/HEAT 3. BATH 4. RUSH

'నిధి'లేని ప్రతినిధులు..!

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - ఖమ్మం)
స్థానిక సంస్థల పటిష్ఠం ద్వారానే పల్లెలు అభివృద్ధి సాధిస్తాయన్న మాట.. మాటగానే మిగులుతోంది. నిధుల లేమితో జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు నామమాత్రమయ్యాయి. జడ్పీ చైర్మన్ నుంచి జడ్పీటీసీలు, ఎంపీపీ, ఎంపీటీసీలు శిలాఫలకాల్లో ప్రోటోకాల్‌కు మాత్రమే పరిమితమవుతున్నారు. చట్ట సభలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలకు ప్రత్యేక కోటా నిధులతోపాటు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలుచేసే అభివృద్ధి సంక్షేమ పథకాల నిధుల్లో కూడా వారి సూచనలకే ప్రాధాన్యం ఉండటంతో జడ్పీటీసీలు, ఎంపీటీసీలు నామమాత్రంగా మిగిలిపోతున్నారు. నిధుల లేమితో జిల్లాలోని అన్ని మండలాల స్థానిక సంస్థల ప్రతినిధుల్లో నైరాశ్యం నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి నేరుగా పంచాయతీలకు నిధులు వస్తుండటంతో సర్పంచ్‌లు సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నారు. జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు ఇలాంటి పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందులెదుర్కొంటున్నారు. గ్రామాలు, మండలాల్లో కనీసం ఒక మంచినీటి బోరు, సైడ్ డ్రైన్, రోడ్డు నిర్మాణం, అసంపూర్తి భవనాలు పూర్తి.. ఇలా ఏ పనికీ నిధులు లేకపోవడంతో ఆయా ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలను నెరవేర్చని పరిస్థితి నెలకొంది. దాంతో వారు గ్రామాల్లోకి వెళ్లలేకపోతున్నారు. గతంలో కేంద్రం, రాష్ట్రం నుంచి జిల్లా పరిషత్‌కు నిధులు వస్తే మండల పరిషత్‌లు, గ్రామపంచాయతీలకు పంపే ఆనవాయితీ ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు నేరుగా గ్రామపంచాయతీలకు ఆన్‌లైన్ పద్ధతిలో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకు వెళ్తున్నాయి.జిల్లాపరిషత్, మండల పరిషత్‌లు నిధులు లేకపోవడంతో మొక్కుబడి సమావేశాలకే పరిమితమవుతున్నాయి.

2013నుంచి అందని నిధులు

జిల్లా విభజన జరిగినా పూర్వ ఉమ్మడి జిల్లాకు సంబంధించిన అన్ని ప్రాంతాల జడ్పీ పాలన ఖమ్మం నుంచే జరుగుతోంది. అయితే జిల్లాపరిషత్‌కు బీఆర్‌జీఎఫ్ నిధులు 2013-14 నుంచి రావడం లేదు. గతంలో ఏటా రూ.10 నుంచి 13కోట్ల వరకు బీఆర్‌జీఎఫ్ నిధులు వచ్చేవి. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధినిధి నుంచి నిధులు రాకపోవడం వల్ల జిల్లా పరిషత్ సభ్యులు రోడ్లు, డ్రైన్లు తదితర మౌళిక సదుపాయాల పనులు చేపట్టలేకపోతున్నారు. స్టేట్‌ఫైనాన్స్ స్కీం కింద 2014-15లో 39వేలు, 2015-16లో రూ.66 లక్షల 25వేలు, 2016-17లో రూ.7లక్షల 66వేలు, 2017-18కి రూ.25లక్షల 60వేలు మండలాలకు, జిల్లాపరిషత్ నిర్వహణతోపాటు ఇతర ఖర్చులకు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ నిధులతోనే ఆఫీస్ ఖర్చులు వెళ్తున్నాయి. కొన్నిచోట్ల ఏటా చాలక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీఎఫ్‌సీ కింద 2014-15లో నిధులు వచ్చి నిలిచిపోయాయి. రూ.60 లక్షలు మాత్రమే ఆ ఏడాది వచ్చాయి. ఈ నిధులు కూడా గతంలో ఏటా రూ.10కోట్ల వరకు వచ్చేవి. కానీ ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నేరుగా గ్రామపంచాయతీలకే వస్తున్నాయి. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ, ఎంపీపీ సభ్యులందరూ నిధులు లేకుండా పాలన ఎలా అని వాపోయారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు వచ్చినప్పుడు ఏర్పాటుచేసే శిలాఫలకాల్లో మాత్రమే తమ పేర్లు చూసుకుని ఆనందపడాల్సి ఉంది తప్ప ప్రజలకు ఏమీ చేయలేకపోతున్నామని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద గతంలో జిల్లాపరిషత్‌కు 20 శాతం నిధులు ఉండేవి. అవి కూడా ప్రస్తుతం ఎమ్మెల్యేలు సిఫార్సు చేసిన వాటికే ఇస్తున్నారు. జడ్పీటీసీ, ఎంపీపీలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీంతో ఉపాధి హామీ కింద రోడ్లు, డ్రైన్లు, ఇతర భవన నిర్మాణ పనులు జిల్లా పరిషత్ సభ్యులు చేపట్టలేకపోతున్నారు. జడ్పీకి గతంలో జనరల్ ఫండ్ రూ.70లక్షల వరకు వచ్చేది. ప్రస్తుతం ఆ నిధులు కూడా రావడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, చిన్నచిన్న సమస్యలు పరిష్కారం చేయలేకపోతున్నామని సభ్యులు వాపోతున్నారు.

నిధుల కోసం ప్రయత్నిస్తున్నాం

జడ్పీ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత

జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు నిధుల సమస్య ఉన్న మాట వాస్తవమే. గతంలో జిల్లా పరిషత్ ద్వారా నిధుల కేటాయింపు జరిగేవి. ఇప్పుడు నిబంధనలు మారడం వల్ల గ్రామపంచాయతీలకే నేరుగా నిధులు వెళ్తున్నాయి. జడ్పీటీసీలు, మండలాలకు నిధులు ఇవ్వాలని జిల్లాపరిషత్‌లను మరింత బలోపేతం చేయాలని త్వరలో రాష్ట్రంలోని జడ్పీ చైర్మన్లు అందరం కలిసి ముఖ్యమంత్రిని కోరబోతున్నాం. గత మూడేళ్లగా నిధులు లేకపోవడం వల్ల పాలనాపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరిస్తాం.

సర్వేకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి-ఖమ్మం)
రాష్ట్రంలో భూ సమస్యలు లేని రెవెన్యూ గ్రామాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందుకోసం గతంలో అధ్యయనం కోసం ఒక కమిటీని కూడా నియమించింది. ఈక్రమంలో భూముల లెక్కలు పక్కా చేసేందుకు సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తారుమారుగా ఉన్న భూముల లెక్కల చిక్కులు విప్పేందుకు రంగం సిద్ధం చేస్తోంది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ పరంగా భూసమస్యలు వివాదాలు లేకుండా చూడాలన్న యోచించింది. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా భూప్రక్షాలన చేయాలని నిర్ణయించారు. సెప్టెంబరు 1వ తేదీనుంచి భూప్రక్షాలనకు ముహూర్తం ఖరారు చేసింది. అయితే తప్పుల తడకలకుగా ఉన్న భూముల లెక్కలను సరిచేయాలంటే ఎక్కువ సమయమే పడుతుంది. కానీ ప్రభుత్వం 15రోజుల్లోనే ప్రక్షాలన చేసేందుకు సమయం పెట్టగా ఆయా రోజులపాటు రెవెన్యూ అధికారులతోపాటుగా ఇతర శాఖల అధికారులు కూడా భూముల లెక్కలపై సమరం తప్పదని పలువురు అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

ప్రత్యేకంగా సభల ఏర్పాటు

భూ ప్రక్షాళనలో భాగంగా ప్రత్యేకంగా సభలు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామాలు, మండలాల్లో సభలు ఏర్పాటు చేసేందుకు తేదీలు ప్రకటించింది. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 10వ తేదీ వరకు గ్రామాల్లో సభలు, 10 నుంచి 15వ తేదీ వరకు మండలాల్లో సభలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకుగాను ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 11వేల వరకు గ్రామాలు ఉండగా 3600ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయనుంది. జిల్లాలో 385రెవెన్యూ గ్రామాలుంగా, ఒక్కో గ్రామాన్ని ఒక్కో యూనిట్‌గా తీసుకుని సమస్యలు పరిష్కరించనున్నట్టు సమాచారం. కాగా గ్రామీణ స్థాయిలో ఓ రెవెన్యూ అధికారి, వ్యవసాయ అధికారి, గ్రామం నుంచి ఓ వ్యక్తి, రాజకీయంగా ఒకరికి కలిపి మొత్తం ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధించి ఎమ్మెల్యేలు, మంత్రులు పర్యవేక్షించనున్నారు.

ఎనిమిది దశాబ్దాల క్రితం సర్వే..

ప్రస్తుత భూవివాదాలకు దీర్ఘకాలంగా సర్వేసెటిల్‌మెంట్ జరగకపోవటే కారణమని రెవెన్యూ వర్గాలు గట్టిగా నమ్ముతున్నాయి. 80ఏళ్ల క్రితం 1936లో అందుబాటులో ఉన్న పరిజ్ఞానంతో భూముల విస్తీర్ణాన్ని కొలిచి సర్వే నెంబర్లు నిర్ణయించారు. ఈ క్రమంలో ఆంధ్రా ప్రాంతానికి తెలంగాణ ప్రాంతానికి భూ కమతాల విస్తీర్ణం పొంతన లేకుండా ఉంది. ఆంధ్రాలో చిన్న కమతాలుండటం, పూర్వం నుంచి అక్కడి రికార్డులు మొదటి నుంచి సవ్యంగా నిర్వహించటంతో పాటు ప్రతి లావాదేవీ కూడా రిజిస్ట్రేషన్ ద్వారా జరుగుతూండటం వల్ల భూ సమస్యలు, వివాదాలు తక్కువగా ఉన్నాయి. కానీ తెలంగాణ ప్రాంతంలో మాత్రం పెద్ద కమతాలు ఉన్నాయి. ఒక్కో సర్వే నెంబర్‌లో మూడు నుంచి ఆరు వేల ఎకరాల విస్తీర్ణంతో కూడిన సర్వే నెంబర్లున్నాయి. కానీ వీటిలో భూమి చేతులు మారటంతో ఎనిమిది దశాబ్దాలుగా అనేక మార్పులు జరిగాయి. దీనికి తోడు అప్పట్లో శాస్త్రీయమైన సర్వే లేకపోవటం వల్ల కొన్ని సర్వే నెంబర్లలో నమోదైన విస్తీర్ణం కంటే ఎక్కువ తక్కువలు కూడా ఉన్నాయి. ఎనిమిది దశాబ్దాల కాలంలో అప్పట్లో లేని రోడ్లు, చెరువులు, ప్రాజెక్టులు పుట్టుకొచ్చాయి. ప్రస్తుతం వ్యవసాయ భూములు నివాస ప్రాంతాలుగానూ, నివాస ప్రాంతాలు వ్యవసాయ భూములుగా కూడా మారిపోయాయి. ఈ క్రమంలో భూ వివాదాలు పరిష్కారం రెవెన్యూ శాఖకు తలనెప్పిగా మారింది. ఒక రైతుకు టైటిల్ ఒక సర్వే నెంబర్‌లో ఉంటే, మరో సర్వే నెంబర్‌లో రైతు ప్రదేశంపై సాగులో ఉంటున్న గ్రామాలు ఎన్నో ఉన్నాయి. నక్షాలో లేని సర్వే నెంబర్లు కూడా రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయి.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమే.. కానీ..

రెవెన్యూ గ్రామాల వారీగా భూములను సర్వేచేసి సెటిల్ మెంట్ చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని రెవెన్యూ యంత్రాంగం స్వాగతిస్తోంది. కానీ రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియను సెప్టెంబర్‌లో ప్రారంభించి డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని, ఒక్కో రెవెన్యూ గ్రామాన్ని 15రోజుల్లో సర్వే చేయాలని నిర్ణయించటం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక రెవెన్యూ గ్రామంలో మొత్తం భూమిని సర్వే చేయాలంటే ఎట్టి పరిస్థితుల్లో 15రోజుల సమయం సరిపోదని అంటున్నారు. ఆ గ్రామంలో ప్రతి సర్వే నెంబర్‌ను సర్వే చేస్తూ ఆయా నెంబర్లలో ఎవరు సాగులో ఉన్నారు. ఎంత విస్తీర్ణంలో సాగులో ఉన్నారు. వారు ప్రస్తుతం ఉన్న సర్వే నెంబర్, ప్రదేశంపై సాగులో ఉన్న సర్వే నెంబర్ ఒకటేనా అనే విషయాలు పరిశీలించటంతో పాటు రికార్డులు తయారు చేయాల్సి ఉంది. ఈ క్రమంలో పట్టా భూములతో పాటు, అస్సైన్‌మెంట్ భూములు, ప్రభుత్వ, సీలింగ్, భూదాన భూములన్నింటికీ సంబంధించి రికార్డు తయారు చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొత్తగా తలెత్తే భూ సమస్యలను కూడా తక్షణ పరిష్కారం చూపాల్సి ఉంటుంది. పూర్తి స్థాయిలో సర్వే జరిగిన తరువాత ఆ రెవెన్యూ గ్రామానికి సంబంధించి పాత నక్షా స్థానంలో కొత్త గ్రామ నక్షాను రూపొందించాల్సి ఉంటుంది. కాగా ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన తేదీల్లో ప్రక్షాళన చేయడం అసాధ్యమనే వాదన వినిపిస్తోంది. కాగా అధికారులు మాత్రం ఆయా భూ సమస్యలపై సమరం చేయాల్సిందేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అనాథ'బడి'

- వీధి బాలల పాఠశాల తెరుచుకునేదెన్నడో ?
- ఖాళీగా ఉంటున్న సీఆర్‌టీలు
- పట్టించుకోని అధికారులు

ఖమ్మం ఎడ్యుకేషన్: అనాథ పిల్లల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఖమ్మంలో పట్టణ వీధిబాలల పాఠశాలను ఏర్పాటు చేసింది. కానీ ప్రారంభానికి నోచుకోపోవడంతో కోట్ల రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. ఇద్దరు మంత్రులు నూతన భవనాన్ని ప్రారంభించి వెళ్లినా నేటికీ పాఠశాల తెరువకోలేదంటే వీధిబాలల అభ్యున్నతిపై జిల్లా విద్యాశాఖ అధికారులు ఎంతగా శ్రద్ధ చూపుతున్నారోనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

పాఠశాల తెరుచుకునేదెన్నడో ?

ప్రభుత్వ పాఠశాలలు తెరిచి రెండు నెలలు గడిచినా జిల్లాలో ఇంకా పట్టణ వీధి బాలల పాఠశాల మాత్రం తెరుచుకోలేదు. ఏ దిక్కులేనివారితోపాటు, తల్లిగాని, తండ్రిగాని ఒకరు మాత్రమే ఉన్న విద్యార్థుల కోసం ఈ పాఠశాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. కానీ దీన్ని ప్రారంభించడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని పలువురు ఆక్షేపిస్తున్నారు.

ఎంఈవో కార్యాలయానికే పరిమితి ?

పట్టణ వీధి బాలల పాఠశాలలో పనిచేసేందుకు రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఉపాధ్యాయులను(సీఆర్‌టీ) ఎంపిక చేశారు. ఉపాధ్యాయులతో పాటు ఒక స్పెషల్ ఆఫీసర్ ఈ పాఠశాలను నిర్వహించేందుకు అవసరముండగా కేవలం ఇద్దరు సీఆర్‌టీలనే ఎంపిక చేశారు. ఒక స్పెషల్ ఆఫీసర్‌ను ఎంపిక చేయగా అతడు నేటికీ రిపోర్టు చేయలేదు. తనకు ఆ పోస్టు ఇష్టంలేనందున రాలేదన్న వాదన విద్యాశాఖలో వినిపిస్తోంది. ఇక ఎంపికైన ఇద్దరు ఉపాధ్యాయులు కేవలం ఎంఈవో కార్యాలయానికే పరిమితమయ్యారు. పాఠశాల నడవనందున వీరు ఎంఈవో కార్యాలయంలో ఉంటున్నట్టు తెలుస్తోంది. ఇంకా మిగిలిన నలుగురు సీఆర్‌టీల ఎంపికపై ఎలాంటి కదలిక లేదు. నాన్ టీజింగ్ స్టాఫ్‌కు 10రోజుల క్రితం ఇంటర్వ్యూలు నిర్వహించారు.

పాఠశాల ప్రారంభంపై దృష్టి ఏది ?

పట్టణ వీధిబాలల పాఠశాలల ప్రారంభంపై విద్యాశాఖాధికారులు ఏ మాత్రం దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో ఇద్దరు మంత్రులు ప్రారంభోత్సవం చేసిన ఈ పాఠశాల నెలరోజులు గడిచినా కనీసం తెరుచుకోకపోవడం ఆశాఖ అధికారులకే తెలియాలి. ఇలాంటి పరిస్థితుల్లో వీధి బాలలు ఎక్కడ ఉండాలో అధికారులకే తెలియాలని పలువురు పేర్కొంటున్నారు.

వేసవిలో మూత

పట్టణ వీధి బాలల పాఠశాల గత ఏప్రిల్‌లో మూసివేశారు. వాస్తవానికి అసలు ఈ పాఠశాల ఎప్పుడు తెరిచే ఉంచాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయి అధికారులు చెప్పారని ఏప్రిల్‌లో మూసేసి పాఠశాలలో ఉన్న విద్యార్థులను పంపించి వేశారు. నాటి నుంచి నేటివరకు పాఠశాల తెరుచుకోలేదు. దాంతో వీధి బాలలు తలో దిక్కు వెళ్లినట్టు తెలుస్తోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి వీధి బాలల పాఠశాలను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని పాఠశాల తెరుచుకునేలా చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రారంభానికి నోచుకోని పట్టణ వీధి బాలల పాఠశాల

మత్స్య పరిశోధనా కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు



చేపలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

కూసుమంచి: పాలేరులోని మత్స్య పరిశోధనాకేంద్రాన్ని జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (టెక్నికల్) ఉత్పల్‌కుమార్‌సర్, కన్సల్టెంట్ గ్లోరీ స్వరూప పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ జరుగుతున్న పరిశోధనలు, పరిశోధనాకేంద్రంలో గల వసతులను పరిశీలించారు. ఈ కేంద్రంలో ఇక నుంచి నెల నెలా ఔత్సాహికులకు చేప పిల్లల ఉత్పత్తి, పెంపకంపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. మొదటగా ఆంధ్రప్రదేశ్ నుంచి 10మందిని, తెలంగాణ రాష్ట్రం నుంచి 15మంది మొత్తం 25 మందిని 25రోజులపాటు ఇక్కడే ఉంచి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈక్రమంలో ఇక్కడ వారికి నైపుణ్య శిక్షణకు సంబంధించి అవసరమైన సదుపాయాలు, హ్యాచరీలు, పాండ్స్, బసకు అవసరమైన హాస్టల్ వసతిని పరిశీలించారు. అన్నీ అనుకూలిస్తే సెప్టెంబరు-1 తేదీ నుంచి 25రోజులపాటు శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం సీనియర్ సైంటిస్ట్ విద్యాసాగర్‌రెడ్డి, సైంటిస్టులు శ్యాంప్రసాద్, రవి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ చెరువులో పడి పశువుల కాపరి మృతి

ముదిగొండ: ప్రమాదవశాత్తూ చెరువులో పడి పశువుల కాపరి మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలపరిధిలోని వల్లభి గ్రామానికి చెందిన చిగురుపాటి వెంకటేశ్వరరావు(50) రోజుమాదిరిగానే బుధవారం ఉదయం పశువులను మేపేందుకు వెళ్లాడు. చెరువుపక్కన వాటిని మేపుతుండగా కాలుజారి నీటిలో పడి మృతిచెందాడు. వెంకటేశ్వరరావు కుమారుడు సైదేశ్వరరావు ఫిర్యాదుమేరకు ఎస్ఐ లవణకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సమ్మ పోరాటాలు ఆదర్శనీయం



మొక్క నాటుతున్న లక్ష్మీనర్సయ్య

బోనకల్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లెల లక్ష్మీనర్సమ్మ పోరాటాలు నేటితరం మహిళలకు ఆదర్శప్రాయమని ఎన్ఆర్ఐ ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మీనర్సయ్య కొనియాడారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం ఆమె ప్రథమ వర్ధంతి సందర్భంగా మొక్కలను నాటారు. ఈకార్యక్రమంలో మల్లెల వెంకట్రావు, క్రాంతి కుమార్, శైలజ, ఎంపీటీసీ కిలారు వెంకటేశ్వరావు, తిరుపతయ్య పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయొద్దు

● ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు ● మండపాల వద్ద డీజే సౌండ్, ఊరేగింపురోజు బాణాసంచా కాల్చకూడదు: వైరా ఏసీపీ శ్రీధర్‌రెడ్డి

మధిర టౌన్: అనుమతి లేకుండా వినాయక మండపాలు ఏర్పాటుచేస్తే చర్యలు తీసుకుంటామని వైరా ఏసీపీ ఎం.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వినాయక మండపాలు ఏర్పాటుచేసే నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. టౌన్ ఎస్ఐ తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనరేట్‌గా ఏర్పడిందని, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఏరకమైన అధికారాలు ఉంటాయో.. అవే అధికారాలు ఖమ్మం కమిషనరేట్ పరిధిలో అమలవుతాయని తెలిపారు. మండప నిర్వాహకులు విగ్రహ ప్రతిష్ఠకు ముందే పోలీసు, విద్యుత్, నగరపంచాయతీ, గ్రామపంచాయతీలనుంచి పర్మిషన్ తీసుకోవాలని, విగ్రహాలు ప్రజలకు ఇబ్బందికలిగించేవిధంగా రోడ్లపై ప్రతిష్ఠించకూడదని, మండపాల వద్ద మైకు పర్మిషన్ కూడా తీసుకోవాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం రాత్రి పదిగంటల నుంచి తెల్లవారుజామున ఆరుగంటల వరకు మండపాల వద్ద ఎలాంటి సౌండ్‌సిస్టమ్ ఉపయోగించకూడదన్నారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా, ఊరేగింపు సమయంలో ఏదైనా ఘర్షణ వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగితే ఉత్సవ కమిటీ సభ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నవరాత్రి ఊరేగింపు సందర్భంగా డీజే సౌండ్ సిస్టమ్ నిషేధించబడిందని, ఊరేగింపులో బాణాసంచా కాల్చటం నిషేధించబడిందని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.. ఈసమావేశంలో సీఐ శ్రీధర్, పోలీసులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, హాజరైన మండపాల నిర్వాహకులు

చింతకాని: వినాయక మండపాల ఏర్పాటుకు గ్రామపంచాయతీ, పోలీసుశాఖ, విద్యుత్ శాఖల నుంచి అనుమతులు తప్పనిసరిగ తీసుకోవాలని ఎస్ఐ పి.సురేష్ సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌ల్లో వినయక ఉత్సవ కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు.

టీఆర్ఎస్ అధ్యక్షుడు బేగ్‌కు సన్మానం



బేగ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మధిర టౌన్: రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బుడాన్‌బేగ్‌కు బుధవారం నగరపంచాయతీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటిసారిగా మధిరకు వచ్చిన ఆయనకు నగరపంచాయతీ చైర్‌పర్సన్ మొండితోక నాగరాణి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగాల కమలరాజు, చావా రామకృష్ణ, మొండితోక సుధాకర్, దేవిశెట్టి రంగారావు, శ్రీను, రంగిశెట్టి కోటేశ్వరరావు, ఎం. జయాకర్, శీలం వీరవెంకటరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

ఆటా అవార్డుకు ఎంపికైన నాగరాజు



నాగరాజు

మధిర టౌన్: మధిర పట్టణానికి చెందిన నృత్య కళాకారుడు నాగరాజు జాతీయస్థాయి ఆటా అవార్డుకు ఎంపికయ్యారు. అక్టోబర్ 8న భద్రాచలంలో జరిగే ఆటా అవార్డుల కార్యక్రమంలో తానా, తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ, తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ అవార్డును అందుకోనున్నట్టు నాగరాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజును రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, భరత్ విద్యాసంస్థల డైరెక్టర్ శీలం వెంకటరెడ్డి, కరస్పాండెంట్ విద్యాలత పలువురు అభినందించారు.

ఇలాన్‌లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మధిర: మధిర మండలం ఆత్కూరులోని ఇలాన్ కంపెనీలో టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ సదానిరంజన్, ఏవో అనిల్‌కుమార్ ఇతర అధికారులు రికార్డులను పరిశీలించారు. లైసెన్స్ అలాగే ఆథరైజేషన్స్, పురుగుమందుల తయారీకి అనుమతులు ఉన్నట్టు నిర్వాహకులు చూపించారు. రికార్డులు సక్రమంగా ఉండటంతో సంస్థలో తయారవుతున్న ఐదురకాల శాంపిళ్లను తీసుకున్నట్టు ఏవో అనిల్‌కుమార్ తెలిపారు. అలాగే వేరే కంపెనీలకు చెందిన 340 బాక్సులను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సదానిరంజన్ తెలిపారు.

ఒకటో తేదీని పెన్షన్ విద్రోహదినంగా పాటించాలి

చింతకాని: సెప్టెంబర్ ఒకటిని పెన్షన్ విద్రోహదినంగా పాటించాలని యూఎస్‌పీసీ ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆసంఘం నాయకులు మాట్లాడుతూ ఉద్యోగికి రాజ్యాంగం కల్పించిన పెన్షన్ హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. సెప్టెంబర్ ఒకటిని ప్రతిఒక్కరూ సామూహిక సెలవులు పెట్టాలన్నారు. ఆరోజు ఖమ్మం కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో యూఎస్‌పీసీ నాయకులు, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు మల్లిఖార్జునరావు, కార్యదర్శి దేవయ్య, యూటీఎఫ్ మండల అధ్యక్షకార్యదర్శులు మీరా హుస్సేన్, మహేష్, నాయకులు నాగేశ్వరరావు, విజయచంద్రరావు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి: యూటీఎఫ్

బోనకల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతిని కొనసాగించాలని యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరావు డిమాండ్ చేశారు. ఒకటో తేదీన జిల్లా కేంద్రాలలో జరుగు ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం బోనకల్‌లో ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేటందుకు ఒకటో తేదీని పెన్షన్ విద్రోహదినంగా పాటించాలని సూచించారు. పాఠశాల విధులకు హజరయ్యే ఉపాధ్యాయులు కూడా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ నాయకులు వల్లంకొండ రాంబాబు, యనమద్ది శ్రీను, నారపోగు ఏసోబు, అప్పారావు, చంద్రప్రసాద్, టీపీటీఎఫ్, ఎస్టీఎఫ్ నాయకులు బాణోతు రమేష్, గంగరాజు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటీఎఫ్ నేతలు

పారుశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: ఎంపీడీవో

చింతకాని: గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు పారుశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో నవాబ్‌పాషా హెచ్చరించారు. మండలకేంద్రంలోని మండల ప్రజాప్రజాపరిషత్ సమావేశమందిరంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్లకు పారుశుధ్యం నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పారుశుధ్య నిర్మూలనకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్డీ రామయ్య, ఏపీవో కోటయ్య, పంచాయతీ కార్యదర్శులు బత్తిన శ్రీనివాసరావు,కొండపల్లి అనిల్‌కుమార్, ఖాన్, మేహారాజ్, సురేష్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి
పీహెచ్‌సీ వైద్యాధికారి బాలాజీ

మధిర రూరల్: గ్రామాల్లో అందరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలాజీ సూచించారు. బుధవారం మధిర మండలం మడుపల్లి గ్రామంలో మాటూరుపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యసిబ్బంది ఇంటింటా తిరిగారు. శిబిరంలో పలువురికి చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలు వీధుల్లో దోమలకు మందు స్ప్రే చేయించారు.. ఈ కార్యక్రమంలో మాటూరుపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



మురుగు గుంతల్లో దోమల మందును స్ప్రే చేస్తున్న ఏఎన్ఎంలు

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

మధిర టౌన్: మధిర నగరపంచాయతీ పరిధిలోని మడుపల్లి గ్రామానికి చెందిన వెలగందుల రాధకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.38వేల చెక్కును టీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం జిల్లా నాయకుడు లింగాల కమలరాజు అందజేశారు. అనారోగ్యానికి గురైన ఆమెకు ఈ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దేవిశెట్టి రంగారావు, నాయకులు శీలం వీరవెంకటరెడ్డి, అరిగె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు



పూడిక తొలగిస్తున్న సిబ్బంది

మధిర రూరల్: మధిర మండలం నాగవరప్పాడు గ్రామంలో బుధవారం పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ చావలి రామరాజు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలు చేశారు. అన్నివీధుల్లో కాల్వల్లో పూడికలు తీసి బ్లీచింగ్ ఫౌడర్ చల్లించారు. డ్రెయినేజీల వెంట ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేయటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సినిమాలు

మధిర

● శాంతి	జయ జానకీ నాయక
● శ్రీలక్ష్మీ శ్రీనివాస	నేనే రాజు.. నేనే మంత్రి
● వాసవి	లై

తిమ్మారావుపేటలో మండలస్థాయి క్రీడా పోటీలు

ఏన్కూరు: తిమ్మారావుపేట హైస్కూల్లో ఈనెల 29,30,31తేదీల్లో మండలస్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. ఎంఈవో జయరాజు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పోటీలకు అర్హులని తెలిపారు. 29న బాలికలకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని, 30న బాలుర జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు, 31వతేదీన అథ్లెటిక్స్ జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆయా పాఠశాలల నుంచి స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.



మట్టి విగ్రహాలతో విద్యార్థులు

మట్టి విగ్రహాలను తయారు చేసిన కొణిజర్ల విద్యార్థులు

కొణిజర్ల: మట్టి విగ్రహాను పూజిందాం, కాలుష్యాన్ని నివారిద్దాం అనే నినాదంతో కొణిజర్ల హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం పాఠశాల పీడీ దొండపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం వినాయకుడి మట్టి విగ్రహాలను తయారు చేశారు. పాఠశాల నుంచి 80 మంది విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేయడం నేర్చుకున్నారు. పాఠశాల హెచ్ఎం దామాల పుల్లయ్య విద్యార్థులను అభినందించారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ: గణేష్ ఉత్సవాలనిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాసూరి కృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాజకీయనాయకులు, సర్పంచ్‌లుతో సమావేశం నిర్వహించారు. వినాయకచవిత సందర్భంగా విగ్రహాలను పెట్టేవారు పోలీస్‌శాఖ నిబంధనలు పాటించాలని సూచించారు. గ్రామాలలో ప్రశాంతవాతావరణం మధ్య వేడుకలను జరుపుకోవాలని తెలిపారు. మండపం వద్ద 24 గంటల పాటు వాలంటీర్స్ ఉండాలని సూచించారు. గ్రామపంచాయతీ, విద్యుత్‌శాఖ, పోలీస్‌ల అనుమతు లను తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంగి స్తే కమిటీ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలను తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యాక్రమంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులు, ఆయా గ్రామా ల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పూజా సామగ్రిని సిద్ధం చేస్తున్న వ్యాపారులు

వైరా: వినాయక చవితిర్భంగా అవసరమైన పూజా సామగ్రి విక్రయాలకు వ్యాపారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయకుడికి ఇష్టమైన మారేడు, వెలక్కాయ, సీతాఫలం తదితర పూజా సామగ్రిని భక్తులు వినియోగిస్తారు. పూజా సామగ్రిని వ్యాపారులు మూడ్నాలుగురోజుల ముందునుంచే వివిధ ప్రాంతాల నుంచి సమకూర్చుకుంటున్నారు.

రేపు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తామని లయన్స్‌క్లబ్ నిర్వాహకులు శ్యాంబాబు, బుచ్చిరామారావు తెలిపారు. మట్టి గణపతిని పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం నినాదంతో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీచేస్తున్నామని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

డీజేకు అనుమతిలేదు: కారేపల్లి సీఐ సాంబరాజు

కారేపల్లి: వినాకయ చవితి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని నూతనంగా ఏర్పాటు చేస్తున్న విగ్రహాల సమాచారాన్ని ముందుగానే అందిచాలని ఉత్సవాల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కారేపల్లి సర్కిల్ సీఐ సాంబారాజు అన్నారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషనులో సీఐ సాంబరాజు నిర్వహించిన ప్రజాప్రతినిధుల సమావేశంలో సీఐ మాట్లాడారు. ఈఏడాది జరిగే గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటీ వారిపైనైనా చట్టపరమైనా చర్యలు తీసుకుంటాన్నారు. పండుగకు ముందురోజే విగ్రహాల ఏర్పాటు మైక్ పర్మిషన్లు తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా విగ్రహాలను పెట్టవద్దని దీనివల్ల ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఉత్సవాల్లో డీజేకు అనుమతులు ఇవ్వడంలేదనే, ఎవరైనా అతిక్రమించి డీజేలు పెడితేవాహనంతో పాటు డీజే సిస్టమ్‌ను సీజ్ చేసి నిర్వాహకులపై కేసులు పెడతామన్నారు. నిజ్జన వాహనాలకు తప్పనిసరిగా పత్రాలు ఉండాలని, వాహనం నడిపే డ్రైవర్‌కు లైసెన్స్ ఉండాలన్నారు. స్థానిక సర్పంచ్ అనుమతితో కార్యక్ర మం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాణోత్‌పద్మవతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు,హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కారేపల్లి సీఐ


ఏన్కూరులో వినాయక విగ్రహాల అమ్మకాల జోరు

ఏన్కూరు: వినాయక చవితి పర్వదినం సమీపిస్తుండటంతో మండల వ్యాప్తంగా ఆయా దుకాణాల్లో వినాయక విగ్రహాల అమ్మకాల జోరు పెరిగింది. పరిసర గ్రామాల నుంచి మండల కేంద్రమైన ఏన్కూరు వచ్చి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. చిన్న విగ్రహం నుంచి పెద్ద విగ్రహాల వరకు రకరకాల రంగులతో ఆకర్షణీయంగా వినాయక విగ్రహాలు చూడముచ్చటగా ఉన్నాయి. మరోవైపు ఆయా గ్రామాల్లో వినాయక మండపాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. సుమారు రూ.వెయ్యి నుంచి రూ.పదివేల వరకు వినాయక విగ్రహాలను అమ్ముతున్నారు.



ఏన్కూరులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీ సభ్యులు



సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు



ఖాళీ కుర్చీలతో సమావేశ మందిరం

కొణిజర్ల: స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు తమను అహ్వానించలేదని, గ్రామాలలో, మండలపరిషత్‌లో జరిగే కార్యాక్రమాలకు అహ్వానించడంలేదని, ఎలాంటి నిధులు రావడం లేదని పేర్కొంటూ బుధవారం మండలపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీటీసీ సభ్యులు బహిష్కరించి మండలపరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దీంతో అధికారులు మావేశానికి హాజరు కావాలని ఎంపీటీసీసభ్యులను బుజ్జగించారు. ఎంపీడీవో, ఈవోఆర్డీ, తహసీల్దార్ సభ్యులను సమావేశానికి తీసుకరావాలని ప్రయత్నం చేశారు. అయిన ఎంపీటీసీ సభ్యులు ససేమిరా అన్నారు. ఎంపీటీసీలకు గౌరవం దక్కడంలేదని వాపోయారు. అగష్టు 15న తమను అహ్వానించకూడదా అంటూ అధికారులను ప్రశ్నించారు. ఓ దశలో ఈ వోఆర్డీ సారీ చెప్పారు. అటువంటి సంఘటన పునరావృతం కాకుండ చూస్తామని హామీ ఇచ్చారు. సమావేశానికి తొలుత ఎంపీపీ ఉమారాణితో కలిసి 9 మంది, తర్వాత మరో ముగ్గురు వచ్చారు. 18 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా 12 మంది కూడా సమావేశాన్ని బహిష్కరించారు. బహిష్కరించిన వారిలో ఎంపీపీ ఉ మారాణి, తాళ్లూరి చిన్నపుల్లయ్య, ఏదునూరి శ్రీనువాసరావు, గాజుల కృష్ణమూర్తి, దొబ్బల కృష్ణవేణి, తడికమళ్ళ ఉమారాణి, సరోజన, నాగలక్ష్మీ, మీటు, లక్ష్మీ, హసీనాబేగం ఉన్నారు.

సమావేశం వాయిదా: బుధవారంసర్వసభ్య సమావేశం ఎంపీటీసీసభ్యులు బహిష్కరించడంతో తిరిగి 26వ తేదీకి వాయిదా వేశారు. ఆ రోజు సమావేశాన్ని నిర్వహిస్తామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

సినిమాలు

వైరా- వాసవీ

లై

ఏన్కూరు- లక్ష్మీనరసింహా

లై

'గొర్రెల సరఫరాలో ప్రభుత్వ వైఫల్యం'

వైరా: వైరా మండలంలో గొర్రెల పంపిణీలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి మేకల నాగేశ్వరరావు విమర్శించారు. గుమ్మా నర్సింహారావు అధ్యక్షతన వైరాలో బుధవారం జరిగిన ఆసంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. మూడునెలలైనా వైరా మండలంలో కేవలం 60మందికి మాత్రమే గొర్రెలు పంపిణీ చేశారని విమర్శించారు. జూలై నాటికే గొర్రెలు పంపిణీ చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పటివరకు గొర్రెలు సరఫరా చేయలేదని ఆక్షేపించారు. రూ.70వేలు విలువ చేయని గొర్రెలను రూ.1.10లక్షలకు అంటగడుతున్నారని వాతావరణం తట్టుకోలేక చనిపోతున్నాయని దుయ్యబట్టారు. గొర్రెలకు బదులు గేదెలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు బారి మల్సూర్, నాయకులు చింతలచెర్వు కోటేశ్వరరావు, మర్రి తిరుపతిరావు, కాంపాటి శివ, దొడ్డా లింగయ్యస్వామి పాల్గొన్నారు. అనంతరం మండల కమిటీ అధ్యక్షుడిగా చిత్తారి నాగరాజు, కార్యదర్శిగా గుమ్మా నర్సింహారావు, ఉపాధ్యక్షులుగా బుంగా కృష్ణ, కాట్రేవుల శ్రీను, సహాయ కార్యదర్శులు రాచబంటి నాగరాజు, దొంతెబోయిన వెంకయ్య ఎన్నికయ్యారు.

'క్రమశిక్షణే జీవితానికి పునాది'

ఏన్కూరు: క్రమశిక్షణే జీవితానికి పునాది అని లీడ్ఇండియా2020 శిక్షణ కో-ఆర్డినేటర్ మోదుగు లాలు అన్నారు. మండల పరిధిలోని తిమ్మారావుపేట హైస్కూల్లో గత మూడురోజులుగా జరుగుతున్న లీడ్ఇండియా2020 శిక్షణ కార్యక్రమాలు బుధవారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థిదశ నుంచే మానవతా విలువలు, క్రమశిక్షణ, పట్టుదల, జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. వ్యక్తి అభివృద్ధే దేశాభివృద్ధి అన్నారు. అబ్దుల్‌కలాం ఆశయ సాధనకు కృషిచేయాలని, సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్, లీడ్ఇండియా సభ్యులు ఖలేజమ్మ, ప్రమీల, పీఈటీ శోభన్‌నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లీడ్ఇండియాను విజయవంతం చేయాలని సంకేతం చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

‘బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017’విజేత?



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. **2017కి గాను ‘మాలతి చందూర్’ సాహిత్య పురస్కారానికి ఎంపికైనది?**
ఎ) రంగనాయకమ్మ బి) కనపర్తి వరలక్ష్మి
సి) శివరాజు సుబ్బలక్ష్మి
డి) యద్దనపూడి సులోచనరాణి

2. **కమ్యూనికేషన్ రంగంలో విశిష్ట సేవలందించినందుకు ‘మార్కోని సొసైటీ జీవన సాఫల్య పురస్కారం-2017’కి ఎంపికైన ఇండో అమెరికన్?**
ఎ) థామస్ కైలత్ బి) శంకర్ సుబ్రమణ్యం
సి) వెంకట్రామన్ రామకృష్ణన్
డి) పురుషోత్తందాస్ మహర్

3. **ఎకనమిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ 140 దేశాలపై నిర్వహించిన సర్వేలో 2017కిగాను అత్యంత నివాసయోగ్య నగరంగా తొలిస్థానంలో నిలిచింది?**
ఎ) వాంకోవర్(కెనడా) బి) గ్జిమాసున్(చైనా)
సి) వియన్నా(ఆస్ట్రియా) డి) మెల్‌బోర్న్(ఆస్ట్రేలియా)

4. **షాంఘై ర్యాంకింగ్ కన్సల్టెన్సీ 2017కిగాను ప్రకటించిన ‘అకడమిక్ ర్యాంకింగ్స్ ఆఫ్ వరల్డ్ యూనివర్సిటీ’ నివేదికలో తొలిస్థానం పొందింది?**
ఎ) హార్వర్డ్ యూనివర్సిటీ(అమెరికా)
బి) సింగువా యూనివర్సిటీ(చైనా)
సి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అమెరికా)
డి) టోక్యో యూనివర్సిటీ(జపాన్)

5. **2017 ఆగస్టు 17న రక్షణ శాఖ రూ.4168 కోట్లతో ఆరు అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. వీటి తయారీ సంస్థ బోయింగ్ ఏ దేశానికి చెందింది?**
ఎ) ఇటలీ బి) జర్మనీ సి) అమెరికా డి) ఫ్రాన్స్

6. **‘బల్గేరియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ-2017’ పురుషుల సింగల్స్ విజేత?**
ఎ) పీటర్ గ్రేడ్(డెన్మార్క్) బి) లక్ష్యసేన్(ఇండియా)
సి) లిన్‌డాన్(చైనా)
డి) జ్వొనిమిర్ డుర్కిన్‌జాక్(క్రొయేషియా)

7. **ఫోర్బ్స్ పత్రిక-2017కిగాను ప్రకటించిన అత్యధిక రెమ్యూనరేషన్ పొందుతున్న హీరోయిన్ల జాబితాలో తొలిస్థానం పొందింది?**
ఎ) జెన్నిఫర్ లోపెజ్ బి) జెన్నిఫర్ అనిస్టోన్
సి) అలిసియ వికెందర్ డి) ఎమ్మాస్టోన్

8. **ఇండియాటుడే ఇటీవల భారత ప్రధానుల సమర్థతపై ‘మూడ్ ఆఫ్ ద నేషన్’ పేరిట నిర్వహించిన సర్వేలో 33 శాతం ఓట్లతో అత్యంత సమర్థుడైన ప్రధానిగా నిలిచింది?**
ఎ) అటల్ బిహారి వాజ్‌పేయి
బి) జవహర్‌లాల్ నెహ్రూ
సి) ఇందిరాగాంధీ డి) నరేంద్రమోదీ

9. **మదర్సాల ఆన్‌లైన్ నమోదుకు ఇటీవల ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన రాష్ట్రం?**
ఎ) గుజరాత్ బి) ఉత్తరప్రదేశ్
సి) బిహార్ డి) కేరళ

10. **ఇన్ఫోసిస్ ఎం.డి. విశాల్‌సిక్కా రాజీనామాతో తాత్కాలిక ఎం.డి.గా ఎవరు నియమితులయ్యారు?**
ఎ) ప్రవీణ్‌రావు బి) సంజయ్ బంగా
సి) సబీర్ భాటియా
డి) విజయ్ శేఖర్ శర్మ

11. **తెలంగాణలో తొలి స్మార్ట్ పోలీస్‌స్టేషన్‌ను 2017 ఆగస్టు 18న ఎక్కడ ప్రారంభించారు?**
ఎ) జమ్మికుంట(కరీంనగర్) బి) బెజ్జంకి(సిద్ధిపేట)
సి) నవిపేట(నిజామాబాద్)
డి) దోమకొండ(నిజామాబాద్)

12. **2017 ఆగస్టు 19న మహిళ భద్రత కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన టోల్‌ఫ్రీ నంబరు?**
ఎ) 181 బి) 1551 సి) 112 డి) 999

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

13. **ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ అందించే ‘వ్యవసాయ నాయకత్వ అవార్డు-2017’కి ఎంపికైనది?**
ఎ) శివరాజ్‌సింగ్ చౌహాన్(మధ్యప్రదేశ్)
బి) నితిష్ కుమార్(బీహార్)
సి) కె.చంద్రశేఖర్‌రావు(తెలంగాణ)
డి) విజయన్(కేరళ)

14. **2017కి గాను ఫోర్బ్స్ పత్రిక ప్రకటించిన అత్యధిక ఆదాయం గల మహిళ క్రీడాకారుల జాబితాలో తొలిస్థానం పొందింది?**
ఎ) సెరెనా విలియమ్స్(టెన్నిస్)
బి) మరియ మజుచిక్(చెస్)
సి) పి.వి.సింధు(బ్యాడ్మింటన్)
డి) స్మృతి మందన(క్రికెట్)

15. **‘ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్- 2017’కి ఆతిథ్యమిస్తున్న నగరం?**
ఎ) కౌలాలంపూర్(మలేషియా)
బి) గ్లాస్గో(బ్రిటన్) సి) బ్యాంకాక్(థాయ్‌లాండ్)
డి) హంగ్జే(చైనా)

16. **ఎవరి జయంతిని పురస్కరించుకొని ఆగస్టు 20ని ‘సద్భావన దివస్’గా నిర్వహిస్తారు?**
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) రాజీవ్‌గాంధీ
సి) ఇందిరాగాంధీ డి) పండిట్ రవిశంకర్

17. **భారత నౌకా దళానికి చెందిన ఆరుగురు మహిళ అధికారులు ప్రపంచ యాత్ర లక్ష్యంగా చేపట్టిన ‘నావికా సాగర్ పరిక్రమ’ ప్రాజెక్టులో ఉపయోగిస్తున్న నౌక?**
ఎ) ఐఎన్‌ఎస్‌వి తరిణి
బి) ఐఎన్‌ఎస్‌వి మహదేవి
సి) ఐఎన్‌ఎస్‌వి సింధురక్షక్
డి) ఐఎన్‌ఎస్‌వి తలాష్

18. **రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతనంగా విడుదల చేయనున్న రూ.50 నోటుపై ఉన్న చిహ్నం ‘సాంస్కృతిక రథాన్ని’ ఎక్కడి నుంచి గ్రహించారు?**
ఎ) జైపూర్(రాజస్థాన్) బి) హింపి(కర్ణాటక)
సి) శ్రావణబెళగొళ(కర్ణాటక) డి) పింప్రి(మహారాష్ట్ర)

19. **‘నికోలాయ్ కుద్‌షెవ్’ ఇటీవల ఏ దేశం తరపున భారత్‌లో రాయబారిగా నియమితులయ్యారు?**
ఎ) రష్యా బి) మంగోలియా
సి) కజకిస్థాన్ డి) ఇజ్రాయెల్

20. **భారత్‌లో పాకిస్థాన్ నూతన హైకమిషనర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?**
ఎ) అబ్దుల్ బాసిత్ బి) మలీహాలోధి
సి) సొహెల్ మహమ్మద్ డి) రియాల్ షరీఫ్

21. **పి.ఆర్.శేషాద్రి ఇటీవల ఏ బ్యాంక్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు?**
ఎ) కెనరా బ్యాంక్ బి) లక్ష్మివిలాస్ బ్యాంక్
సి) బ్యాంక్ ఆఫ్ బరోడా డి) కరూర్ వైశ్యా బ్యాంక్

22. **2017కిగాను ‘స్పానిష్ సూపర్ కప్’ ఫుట్‌బాల్ టోర్నీ విజేత?**
ఎ) రియల్ మాడ్రిడ్ క్లబ్ బి) బార్సిలోనా క్లబ్
సి) ఇంగ్లీష్ ప్రిమీయర్ క్లబ్ డి) రివర్స్ ప్లెటో క్లబ్

23. **2017 ఆగస్టులో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏ దేశాన్ని ‘పోలియో రహిత దేశం’గా ప్రకటించింది?**
ఎ) సెనెగల్ బి) కాంగో
సి) సోమాలియా డి) పాకిస్థాన్

24. **‘అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీ-2018’కి ఆతిథ్యం ఇస్తున్న దేశం?**
ఎ) ఆస్ట్రేలియా బి) న్యూజిలాండ్
సి) ఇండియా డి) శ్రీలంక

25. **భారత వ్యవసాయ శాఖ 2016-17కి గాను విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి(మిలియన్ టన్నుల్లో)**
ఎ) 110.15 బి) 384.76 సి) 314.16 డి) 275.68

26. **భారత్ ఏ దేశంతో కుదుర్చుకొన్న మేధోహక్కుల పరస్పర అవగాహన ఒప్పందాన్ని కేంద్ర కేబినెట్ ఇటీవల ఆమోదించింది?**
ఎ) ఆస్ట్రియా బి) స్వీడన్ సి) ఫ్రాన్స్ డి) అమెరికా

27. **హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ నూతన చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్?**
ఎ) సంతోష్‌శర్మ బి) మన్నెల్లి లక్ష్మీకాంతం
సి) సంజయ్‌గుప్తా డి) హర్షకుమార్ భన్వాల్

28. **ఇటీవల విడుదలైన ‘ఇండియా ఎట్ 70; స్నాఫ్ షాట్ సిన్స్ ఇండిపెండెన్స్’ పుస్తక రచయిత?**
ఎ) ఎన్.సి.ఉల్లేఖ్ బి) రోషెన్ దలాల్
సి) అమృతా వర్గీస్ డి) అరుంధతిరాయ్

29. **మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ‘నమో యువ రోజ్‌గార్ కేంద్ర’ ప్రధాన ఉద్దేశం?**
ఎ) యువ పారిశ్రామికవేత్తలకు రుణసౌకర్యం
బి) ఆర్గానిక్ కూరగాయలను తక్కువ ధరకు ప్రజలకు చేరువ చేయడం
సి) యువజన సంఘాల ఏర్పాటు ద్వారా ఐక్యత పెంపొందించడం
డి) రాష్ట్ర నిర్మాణంలో యువత నైపుణ్యాల వినియోగం

30. **2017 ఆగస్టు 18న దోమలను నిరోధించే ప్రత్యేక రైలును ప్రవేశపెట్టిన నగరం?**
ఎ) ఢిల్లీ బి) బెంగళూరు
సి) చెన్నై డి) కోయంబత్తూర్

31. **కేంద్రమంత్రి స్మృతి ఇరాని ప్రారంభించిన చేనేత ఉత్పత్తి, ఎగుమతి సంస్థ ‘ఒరియంట్ క్రాఫ్ట్ లిమిటెడ్’ ఏ రాష్ట్రానికి చెందింది?**
ఎ) చత్తీస్‌గఢ్ బి) జార్ఖండ్ సి) మధ్యప్రదేశ్ డి) కేరళ

32. **‘ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్’ 2017 ఆగస్టులో ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో తొలిస్థానం పొందిన బ్యాట్స్‌మన్?**
ఎ) కేన్ విలియమ్సన్ బి) షకిబుల్ హసన్
సి) విరాట్ కోహ్లి డి) ఎవరూ కాదు

33. **శ్రీలంక నేవీ చీఫ్‌గా నియమితులైన తమిళ సంతతి వ్యక్తి?**
ఎ) కదిరగమర్. ఆర్ బి) డబ్ల్యూ.హెచ్.పెరెర
సి) పెరియార్ మురుగన్ డి) ట్రావిస్ సిన్నిహ

34. **ఎదగకుండా జన్మించిన శిశువుల పరిరక్షణ కోసం కృత్రిమ గర్భసంచిని రూపొందించింది?**
ఎ) యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా
బి) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా
సి) టోక్యో యూనివర్సిటీ, జపాన్ డి) ఎ, సి

35. **స్కూల్ టీచర్ల కోసం ‘మేఘశాల’ అనే మొబైల్ యాప్‌ను ప్రారంభించిన రాష్ట్రం?**
ఎ) రాజస్థాన్ బి) తమిళనాడు
సి) కర్ణాటక డి) హర్యాన

క్రీడా పురస్కారాలు

36. **2017కిగాను ‘రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న, అర్జున’ అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?**
ఎ) ఎస్.కె.శర్మ బి) సి.కె.ధక్కర్
సి) మేరికోం డి) కరణం మల్లీశ్వరి

37. **2017కిగాను ‘ధ్యాన్‌చంద్, ద్రోణాచార్య’ అవార్డుల ఎంపిక కమిటీ చైర్మన్?**
ఎ) మేరికోం బి) కరణం మల్లీశ్వరి
సి) అభినవ్ బింద్రా డి) పుల్లెల గోపిచంద్

38. **2017కిగాను ‘రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న’కి ఎంపికైన పారా అథ్లెట్ దేవేంద్ర ఝఝూరియ ఏ క్రీడకు చెందిన వ్యక్తి?**
ఎ) హైజంప్ బి) టెన్నిస్
సి) జావెలిన్ త్రో డి) షాట్‌పుట్

39. **దేవేంద్రతోపాటు 2017కిగాను ‘ఖేల్‌రత్న’ పొందిన మరో క్రీడాకారుడు?**
ఎ) ఎస్.ఎస్.పి.చౌరాసియా - గోల్ఫ్
బి) సర్దార్‌సింగ్ - హాకీ
సి) జ్యోతిసురేఖ - షూటింగ్
డి) విరాట్ కోహ్లి - క్రికెట్

40. **2017కిగాను ‘ధ్యాన్‌చంద్’ అవార్డుకి ఎంపికైన ముగ్గురిలో లేనిది?**
ఎ) సత్తిగీత - అథ్లెటిక్స్
బి) భూపేందర్‌సింగ్ - అథ్లెటిక్స్
సి) సయ్యద్ షాహిద్ హకీం - ఫుట్‌బాల్
డి) సుమరయి టెటె - హాకీ

41. **2017కిగాను ‘ద్రోణాచార్య’ అవార్డుకి ఎంపికైన ఏడుగురిలో మరణానంతరం పొందిన వ్యక్తి?**
ఎ) హీరానంద్ కటారియా - కబడ్డీ
బి) బ్రిజ్‌భూషణ్ మహంతి - బాక్సింగ్
సి) పి.ఎ.రాఫెల్ - హాకీ
డి) డాక్టర్ ఆర్.గాంధీ - అథ్లెటిక్స్

42. **2017కిగాను ‘అర్జున’ అవార్డు పొందిన 17 మందిలో సరైన వారిని గుర్తించండి?**
1. ప్రశాంతసింగ్ - బాస్కెట్ బాల్
2. చటేశ్వర్ పుజరా - క్రికెట్
3. ఎస్.వి. సునీల్ - హాకీ
4. మరియప్పన్ తంగవేలు - పారా అథ్లెట్
5. వరుణ్ సింగ్ బాటి - పారా అథ్లెట్
6. సాక్షి మాలిక్ - రెజ్లింగ్
ఎ) అన్నీ సరైనవే
బి) 6 మినహా అన్నీ సరైనవే
సి) 1, 2, 4 సరైనవి డి) 2 మాత్రమే సరైనది

సమాధానాలు

1) సి	7) డి	13) సి	19) ఎ	27) ఎ	35) సి
2) ఎ	8) డి	14) ఎ	20) సి	28) బి	36) బి
3) డి	9) బి	15) బి	21) డి	29) బి	37) డి
4) ఎ	10) ఎ	16) బి	22) ఎ	30) ఎ	38) సి
5) సి	11) ఎ	17) ఎ	23) సి	31) బి	39) బి
6) బి	12) ఎ	18) బి	24) బి	32) సి	40) ఎ
			25) డి	33) డి	41) డి
			26) బి	34) డి	42) బి

JOBS ఉద్యోగాలు

బిసిపిఎల్

గెయిల్ ఇండియా లిమిటెడ్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, న్యూమలీఘర్ రిఫైనరీ లిమిటెడ్, అసోం ప్రభుత్వం ఉమ్మడిగా నిర్వహిస్తున్న బ్రహ్మపుత్ర క్రాకర్ & పాలిమర్ లిమిటెడ్ (బిసిపిఎల్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 14

పోస్టులు - ఖాళీలు: సీనియర్ మేనేజర్(హెచ్ఆర్)2, మేనేజర్(కెమికల్ 2, ఎఫ్& ఎ 1), డిప్యూటీ మేనేజర్(కెమికల్ 2, హెచ్ఆర్ 1), సీనియర్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్ 1, ఇన్‌స్ట్రుమెంటేషన్ 1, మెకానికల్ 1), సీనియర్ ఆఫీసర్(లా 1, మార్కెటింగ్ 2)

అర్హత: పోస్టును అనుసరించి 50 శాతం మార్కులతో డిగ్రీ/ ఎంబిఏ/(పీజీ/ పీజీ డిప్లొమా)(పర్సనల్ మేనేజ్‌మెంట్/ పర్సనల్ మేనేజ్‌మెంట్& ఇండస్ట్రియల్ రిలేషన్స్)/ ఎల్ఎల్‌బి/ ఎల్ఎల్ఎం / బిటెక్(కెమికల్/ పెట్రో కెమికల్/ కెమికల్ టెక్నాలజీ/ పెట్రో కెమికల్ టెక్నాలజీ/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్/ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్/ మెకానికల్/ ప్రొడక్షన్/ ప్రొడక్షన్ & ఇండస్ట్రియల్/మాన్యుఫ్యాక్చరింగ్/ మెకానికల్ & ఆటోమొబైల్)/ సీఏ/ ఐసిడబ్ల్యుఏఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: పోస్టును అనుసరించి 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.200

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 21

వెబ్‌సైట్: www.bcplonline.co.in

ఎన్‌బిసిసి

ఎన్‌బిసిసి ఇండియా లిమిటెడ్ - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 94

పోస్టులు - ఖాళీలు: జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 1, అడిషనల్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 2, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) 6, ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్) 5, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ (సివిల్ 10, ఎలక్ట్రికల్ 5), డిప్యూటీ మేనేజర్(లా) 2, అసిస్టెంట్ మేనేజర్(లా 2), సీనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్(సివిల్ 10, ఎలక్ట్రికల్ 3), అసిస్టెంట్ మేనేజర్(హెచ్ఆర్ఎం 2, రాజ భాష 2), జూనియర్ ఇంజనీర్(సివిల్ 40, ఎలక్ట్రికల్ 4)

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 26

వెబ్‌సైట్: www.nbccindia.com

సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?

ఆధునిక భారతదేశ చరిత్ర

1. 'నాకు రక్తమివ్వండి. మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అని ప్రకటించిన జాతీయోద్యమ నేత?
ఎ) భగత్‌సింగ్ బి) చంద్రశేఖర్ అజాద్
సి) సుభాష్ చంద్రబోస్ డి) ఖుదీరాంబోస్
2. 1897 జనవరి 23న సుభాష్ చంద్రబోస్ జన్మించిన ప్రాంతం?
ఎ) కలకత్తా బి) కాన్పూర్ సి) ఢాకా డి) కటక్
3. సుభాష్ చంద్రబోస్ జన్మించిన భవనం నేడు చారిత్రక ప్రాధాన్యత పొందింది. దాని పేరు?
ఎ) ప్రగతి భవన్ బి) జానకీనాథ్ భవన్
సి) జననీ భవన్ డి) జాగృతి భవన్
4. ఐసిఎస్ ఉద్యోగాన్ని వదులుకొని సుభాష్ చంద్రబోస్ జాతీయోద్యమంలోకి ప్రవేశించిన సంవత్సరం?
ఎ) 1919 బి) 1920 సి) 1921 డి) 1922
5. సుభాష్ చంద్రబోస్ వ్యక్తిత్వంపై ప్రభావం చూసిన జాతీయోద్యమ నేత?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) చిత్తరంజన్ దాస్
సి) బిపిన్ చంద్రపాల్ డి) గాంధీజీ
6. గాంధీజీని జాతిపితగా అభివర్ణించిన జాతీయ నాయకుడు?
ఎ) గోపాలకృష్ణ గోఖలే బి) రవీంద్రనాథ్ ఠాగూర్
సి) సిఆర్.దాస్ డి) సుభాష్ చంద్రబోస్
7. సుభాష్ చంద్రబోస్ ఏ ఉద్యమం ద్వారా జాతీయోద్యమంలో ప్రవేశించారు?
ఎ) చంపారన్ సత్యాగ్రహం
బి) ఖిలాఫత్ ఉద్యమం
సి) సహాయనిరాకరణ ఉద్యమం
డి) ఉప్పు సత్యాగ్రహం
8. గాంధీజీ ఏ ఉద్యమంలో చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రను సుభాష్ చంద్రబోస్ నెపోలియన్స్ ఎల్బాదీవి నుంచి చేపట్టిన యాత్రతో పోల్చారు?
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) ఉప్పు సత్యాగ్రహం సి) వ్యక్తి సత్యాగ్రహం
డి) క్విట్ ఇండియా ఉద్యమం
9. సుభాష్ చంద్రబోస్‌ను 'నేతాజీ' అని తొలిసారి పిలిచింది?
ఎ) గాంధీజీ బి) నెహ్రూ
సి) సి.ఆర్.దాస్ డి) బిపిన్ చంద్రపాల్
10. ఏ జాతీయ కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షుడిగా బోస్ 1938లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు?
ఎ) కలకత్తా బి) లక్నో
సి) బొంబాయి డి) హరిపురి
11. ప్రణాళిక సంఘాన్ని స్థాపించి, భారతదేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని సూచించింది?
ఎ) గాంధీజీ
బి) మోక్షగుండం విశ్వేశ్వరయ్య
సి) సుభాష్ చంద్రబోస్
డి) నెహ్రూ
12. గాంధీజీ బలపర్చిన భోగరాజు పట్టాభి సీతారామయ్యను బోస్ ఏ కాంగ్రెస్ సమావేశంలో ఓడించారు?
ఎ) త్రిపురి బి) హరిపురి
సి) కలకత్తా డి) లక్నో
13. సుభాష్ చంద్రబోస్ 'ఫార్వర్డ్ బ్లాక్' రాజకీయ పార్టీని ఎప్పుడు స్థాపించారు?
ఎ) 1937 బి) 1938 సి) 1939 డి) 1940



14. ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టేందుకు బోస్ గృహనిర్బంధం నుంచి తప్పించుకొని భారత్‌ను వదిలిన సంవత్సరం?
ఎ) 1939 బి) 1940 సి) 1941 డి) 1942
15. కాబూల్, మాస్కో మీదుగా బోస్ ఏ నగరానికి చేరుకొన్నాడు?
ఎ) బెర్లిన్ బి) పారిస్ సి) లిస్బన్ డి) జెనీవా
16. సుభాష్ చంద్రబోస్ ఏ దేశంలోని రేడియో కేంద్రం ద్వారా భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు?
ఎ) రష్యా బి) ఫ్రాన్స్ సి) జర్మనీ డి) జపాన్
17. భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి సాయం చేస్తామని బోస్‌కు హామీ ఇచ్చిన దేశం?
ఎ) జర్మనీ బి) జపాన్ సి) రష్యా డి) ఏదీకాదు
18. టోక్యోలో సుభాష్ చంద్రబోస్‌తో చర్చలు జరిపిన 'టోజో' ఏ పదవిలో ఉన్నారు?
ఎ) జపాన్ అధ్యక్షుడు బి) ప్రధాన మంత్రి



ఎస్. రాజా చక్రధర్
సీనియర్ ఫ్యాకల్టీ

సి) సైన్యాధికారి డి) విదేశాంగ మంత్రి
19. 1943 నుంచి సుభాష్ చంద్రబోస్ ఏ దేశంలో తన సైనిక కార్యక్రమాలు ప్రారంభించారు?
ఎ) జర్మనీ బి) జపాన్
సి) సింగపూర్ డి) ఇండోనేషియా
20. 'భారత జాతీయ సైన్యం' ఏర్పాటుకు పునాది వేసింది?
ఎ) కెప్టెన్ మోహన్‌సింగ్
బి) రాజ్‌బిహారీ బోస్
సి) ఖుదీరాంబోస్ డి) ఎవరూ కాదు
21. 1942లో టోక్యోలో ప్రవాస భారతీయ సమావేశాన్ని ఏర్పాటు చేసింది?
ఎ) కెప్టెన్ మోహన్‌సింగ్ బి) లాల్ హరిదయాళ్
సి) సుభాష్ చంద్రబోస్ డి) రాజ్‌బిహారీ బోస్
22. సుభాష్ చంద్రబోస్ 'అజాద్ హింద్ ఫౌజ్'ను ఎక్కడ వ్యవస్థీకరించారు?
ఎ) టోక్యో బి) బెర్లిన్ సి) సింగపూర్ డి) మాస్కో

జనరల్ స్టడీస్ - ఇండియన్ హిస్టరీ

23. అజాద్ హింద్ ఫౌజ్‌లోని మహిళ రెజిమెంట్‌కి గల పేరు?
ఎ) ఝాన్సీరాణి రెజిమెంట్
బి) దుర్గావతి రెజిమెంట్
సి) రాణి అబ్బక్క రెజిమెంట్
డి) మహిళశక్తి రెజిమెంట్
24. భారత జాతికి సుభాష్ చంద్రబోస్ అందించిన నినాదాలు?
ఎ) జైహింద్ బి) చల్లో ఢిల్లీ సి) డూ ఆర్ డై డి) ఎ, బి
25. మొట్టమొదటి భారత ప్రభుత్వాన్ని నేతాజీ ఎక్కడ ఏర్పాటు చేశారు?
ఎ) టోక్యో బి) రంగూన్
సి) సింగపూర్ డి) మలేషియా
26. నేతాజీ ఏర్పాటు చేసిన భారత ప్రభుత్వాన్ని గుర్తించిన తొలి దేశం?
ఎ) రష్యా బి) జర్మనీ సి) జపాన్ డి) ఏదీకాదు
27. 1943లో టోక్యోలో జరిగిన తూర్పు ఆసియా దేశాల సమావేశానికి సుభాష్ చంద్రబోస్ ఏ హోదాలో హాజరయ్యారు?
ఎ) భారత సైన్యాధినేత బి) విదేశాంగ ప్రతినిధి
సి) భారత ప్రభుత్వాధినేత డి) ఏదీకాదు
28. అజాద్ హింద్ ఫౌజ్ పాలన కిందకి వచ్చిన తొలి భారత భూభాగం?
ఎ) అండమాన్ నికోబార్ దీవులు బి) నాగాలాండ్
సి) మణిపూర్ డి) సిక్కిం
29. అండమాన్ నికోబార్ దీవులకు సుభాష్ చంద్రబోస్ పెట్టిన పేరు?
ఎ) స్వరాజ్ దీవులు బి) షాహీద్ దీవులు
సి) అజాదీ దీవులు డి) ఎ, బి
30. సుభాష్ చంద్రబోస్ నేతృత్వంలో జాతీయ సేనకు, బ్రిటీష్‌వారికి మధ్య ప్రత్యక్ష యుద్ధం జరిగిన సంవత్సరం?
ఎ) 1943 బి) 1944 సి) 1945 డి) 1946
31. బ్రిటీష్‌వారిని ఓడించి ఆజాంద్ హింద్‌ఫౌజ్ జాతీయ పతాకాన్ని ఎక్కడ ఎగురవేసింది?
ఎ) మౌఢక్ బి) మయన్మార్
సి) అండమాన్ దీవులు డి) ఏదీకాదు
32. ఆంగ్లేయుల నుంచి జాతీయ సైనం స్వాధీనం చేసుకొన్న ప్రాంతాలు?
ఎ) మౌఢక్ బి) కోహిమా సి) ఇంఫాల్ డి) పైవన్నీ
33. భారత జాతీయ సైన్యం సాగించిన సమరం ఆగిపోవడానికి కారణం?
ఎ) జపాన్‌పై అమెరికా అణుదాడి
బి) బ్రిటీషర్లు రంగూన్‌ను ఆక్రమించడం
సి) జపాన్ సైనికుల తిరోగమనం
డి) పైవన్నీ
34. తైవాన్ దీవుల్లో సుభాష్ చంద్రబోస్ ప్రయాణించే విమానం ప్రమాదానికి గురైన సంవత్సరం?
ఎ) 1945 ఆగస్టు 15 బి) 1946 ఆగస్టు 16
సి) 1946 ఆగస్టు 17 డి) 1946 ఆగస్టు 18
35. బ్రిటీషర్లకు బంధీలుగా చిక్కి ఎర్రకోటలో న్యాయ విచారణ ఎదుర్కొన్న జాతీయ సైన్యం ప్రతినిధులు?
ఎ) షాన్‌వాజ్‌ఖాన్ బి) కల్నల్ టి.కె.షెనగల్
సి) బి.ఎస్.ధిల్లాన్ డి) పైవారందరూ
36. భారత సైనికాధికారుల తరపున వాదించి, వారి విడుదలకు తోడ్పడినవారు?
ఎ) బల్లూభాయ్ దేశాయ్ బి) అసఫ్ అలీ
సి) తేజ్ బహదూర్ సప్రూ డి) పైవారందరూ

సమాధానాలు					
			16) సి	23) ఎ	30) బి
1) సి	6) డి	11) సి	17) బి	24) డి	31) ఎ
2) డి	7) సి	12) ఎ	18) బి	25) సి	32) డి
3) బి	8) బి	13) సి	19) సి	26) సి	33) డి
4) ఎ	9) ఎ	14) సి	20) ఎ	27) సి	34) డి
5) బి	10) డి	15) ఎ	21) డి	28) ఎ	35) సి
			22) సి	29) డి	36) డి

JOBS ఉద్యోగాలు

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ - **గ్రౌండ్ డ్యూటీ** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
ఖాళీలు: 28 **కాంట్రాక్ట్ వ్యవధి:** అయిదేళ్లు
పోస్టులు - ఖాళీలు: మేనేజర్(ఫ్లయిట్ డిస్పాచ్) 14, మేనేజర్(ఆపరేషన్ ఎక్స్‌ప్యాట్ సెల్) 1, సీనియర్ ఆఫీసర్(ఫ్లయిట్ డిస్పాచ్) 6, ఆఫీసర్ - కాక్ పిట్ 1, అసిస్టెంట్ టెక్నికల్ (లైబ్రరి) 1, డిప్యూటీ మేనేజర్(ఫ్లయిట్ సేఫ్టీ) 1, సీనియర్ ఆఫీసర్(ఫ్లయిట్ సేఫ్టీ) 1, సింథటిక్ ఫ్లయిట్ (ఇన్‌స్ట్రక్టర్) 2, అసిస్టెంట్ ట్రైనింగ్ 1
వయసు: 21 ఏళ్లు
అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్(ఎంపిసి) / డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. అదనపు అర్హతల వివరాలకోసం వెబ్‌సైట్‌లోని ప్రకటన చూడవచ్చు.
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును కింది చిరునామాకు పంపాలి
దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ: ఆగస్టు 31
చిరునామా: The Chief of HR, Air India Express Limited, Airlines House, Durbar Hall Road, Near Gandhi Square, Kochi 682016
వెబ్‌సైట్: www.airindiaexpress.in

సిఇఐఎల్

సర్టిఫికేషన్ ఇంజనీర్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(సిఇఐఎల్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
మొత్తం ఖాళీలు: 23
పోస్టులు - ఖాళీలు: ఇంజనీర్స్(క్యూసీ/ క్యూఏ) 4, సీనియర్ ఇంజనీర్స్ (క్యూసీ/ క్యూఏ) 5, డిప్యూటీ మేనేజర్ (క్యూసీ/ క్యూఏ) 5, ఇంజనీర్ స్పెషలిస్ట్ 6, సీనియర్ ఇంజనీర్ స్పెషలిస్ట్ 2, ఆఫీసర్ 1
అర్హత: పోస్టును అనుసరించి కనీసం 50 శాతం మార్కులతో బిఇ/ బిటెక్(మెకానికల్/ ప్రొడక్షన్/ మెటలర్జికల్)/ఎంబిఏ(హెచ్‌ఆర్)/ పీజీ(పర్సనల్ మేనేజ్‌మెంట్ & లేబర్ వెల్ఫేర్) ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి
వెబ్‌సైట్: www.ceil.co.in

ఎన్ఐసిఇడి

కోల్కతాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలరా & ఎంటరిక్ డిసీజెస్(ఎన్ఐసిఇడి)- కింది పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు: 19
మెడికల్ ఎపిడెమియోలజిస్ట్(సైంటిస్ట్ సి)
ఖాళీలు: 1
అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణతతోపాటు పబ్లిక్ హెల్త్ రీసెర్చ్ విభాగంలో ఆరేళ్ల అనుభవం ఉండాలి.
సీనియర్ రీసెర్చ్ ఫెలో(మెడికల్) **ఖాళీలు:** 12
అర్హత: ఎంబిబిఎస్ ఉత్తీర్ణులై ఉండాలి
సీనియర్ రీసెర్చ్ ఫెలో(నాన్ మెడికల్) **ఖాళీలు:** 1
అర్హత: 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.
ఫీల్డ్ కన్సల్టెంట్ / మేనేజర్ **ఖాళీలు:** 1
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
డేటా మేనేజర్ **ఖాళీలు:** 1
అర్హత: (డిగ్రీ/ పీజీ)(కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి/ కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో అయిదేళ్ల అనుభవం ఉండాలి.
అసిస్టెంట్ డేటా మేనేజర్/ డేటా సెక్రటరీ
ఖాళీలు: 1
అర్హత: డిగ్రీ(కంప్యూటర్ అప్లికేషన్స్/ ఐటి/ కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణత + కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో రెండేళ్ల అనుభవం ఉండాలి.
అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ / అకౌంటెంట్ **ఖాళీలు:** 2
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత విభాగంలో అయిదేళ్ల అనుభవం ఉండాలి.
ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 5
వేదిక: National Institute of Cholera & Enteric Diseases, (NICED II Building within ID & BG Hospital Campus), 57, Beliaghata Main Road, Kolkata - 700010
వెబ్‌సైట్: www.niced.org.in/

ఎన్‌సిఇఆర్‌టి - డిఇఇ

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సెల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ & ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఇఇ)- తాత్కాలిక ప్రాతిపదికన **జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో**ల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. **ఖాళీలు:** 6
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో పీజీ(ఎడ్యుకేషన్/ ఇంగ్లీష్/ మేథమెటిక్స్/ మేథమెటిక్స్ ఎడ్యుకేషన్/ ఇంగ్లీష్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 40 ఏళ్లలోపు ఉండాలి.
వేతనం: నెట్ అర్హత పొందిన అభ్యర్థులకు నెలకు రూ.16,000 కాగా నెట్ స్కోరు లేని అభ్యర్థులకు రూ.14000
ఇంటర్వ్యూ తేదీ: ఆగస్టు 29
వేదిక: Department of Elementary Education(DEE), 4th Floor, Room No. 415, G.B Pant Block, NCERT, Sri Aurobindo Marg, New Delhi- 110016
వెబ్‌సైట్: www.ncert.nic.in



చిరు జల్లు... హరివిల్లు

చిరుజల్లులు వాతావరణాన్ని ఆహ్లాదంగా మార్చగా ఆకాశంలో విరిసిన ఇంద్రధనుస్సు మనసుకు ఉల్లాసాన్ని కలిగించింది. బుధవారం పగటి ఉష్ణోగ్రత వేసవిని తలపించే విధంగా ఉండగా.. సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడ్డాయి. ఆ సమయంలో ఆకాశం ఏర్పడిన సింగిడి నగరానికి కొత్త శోభ తీసుకొచ్చింది.

చిత్రం : రవి శంకర్, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్



పచ్చదనం పరుచుకుంది...

మండల పరిధిలోని రాయమాదారం సమీపంలో ఓ ప్రాంతం పచ్చదనంతో అందంగా కళకళలాడుతోంది. సాగర్‌కాల్వ సమీపంలో ఉన్న ఈ ప్రదేశం చుట్టూ పచ్చని చెట్లు... మధ్యలో సన్ననికాల్వతో ఆ ప్రదేశమంతా చూడ ముచ్చటగా ఉంది. కోనసీమ అందాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

చిత్రం : చారి, ఏన్కూరు

గెజిటెడ్ అధికారులకు జోనల్ బదిలీలను చేపట్టాలి

- **అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలి**
- **టీజీవో జిల్లా సమావేశంలో శ్రీనివాసరెడ్డి**

ఖమ్మం కలెక్టరేట్: జిల్లాల్లో పనిచేస్తున్న మండల గెజిటెడ్ అధికారులకు జోనల్ బదిలీలను ప్రభుత్వం చేపట్టాలని జిల్లా గెజిటెడ్ అధికారుల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. అధికారులకు రావాల్సిన రాయితీలు, పదోన్నతులను తక్షణమే అమలు చేయాలని ఆయన కోరారు. బుధవారం ఖమ్మంలోని టీటీడీసీలో టీజీవో జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ప్రభుత్వం ఉద్యోగులకు కల్పించిన పీఆర్సీ కమిటీ నియామకాలను కార్యవర్గ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పునర్విభజన సమయంలో చేపట్టిన అత్యవసర సర్వీసుల కింద వర్క్‌టూ రూల్ బదిలీలు చేసిన వారిని తిరిగి యథాస్థానాలకు కేటాయించాలని కోరారు. డివిజన్ స్థాయి అధికారులకు ప్రభుత్వ వాహనాలు, సెల్‌ఫోన్లు కేటాయించాలన్నారు. పదోన్నతుల్లో జోనల్‌పద్ధతులను కొనసాగించాలని అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆయన కోరారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఉన్న అన్ని హైస్కూల్‌లో అటెండర్ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. ఏన్నాళ్ల నుంచో నిరీక్షిస్తున్న అధికారులకు ఇళ్లస్థలాలను కేటాయించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని శ్రీనివాసరెడ్డి కోరారు. ఇంకా ఈ సమావేశంలో పలు తీర్మాణాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీజీవో గౌరవాధ్యక్షుడు ఎస్కే ఖాజామియా, టీజీవో జిల్లా కార్యదర్శి కస్తాల సత్యనారాయణ, కె.శేషుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీజీవో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



హాజరైన టీజీవో సంఘం నాయకులు

ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ

ఖమ్మం టౌన్:నగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా టీం ఆధ్వర్యంలో జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ.కొండల్‌రావు, జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో విషజ్వరాలతోపాటు డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీలలోని ల్యాబ్‌టెక్నీషియన్లకు ఖమ్మం డీఎంహెచ్‌వో కార్యాలయంలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా టీం ఉబాలే లక్ష్మణ్ శిక్షణ ఇచ్చారు.

గణేష్ మండపాలకు పువ్వాడ ఫౌండేషన్ వితరణ

ఖమ్మం బైపాస్‌రోడ్: నగరంలోని అన్ని గణేష్ మండపాల విద్యుత్ ఖర్చులు పువ్వాడ ఫౌండేషన్ ద్వారా భరిస్తామని ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం స్తంభాద్రి ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం విద్యుత్‌శాఖ డీఈ రవికి ఎమ్మెల్యే పువ్వాడ రూ.3లక్షల చెక్కును అందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. మట్టి వినాయక విగ్రహాలు వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలని ఆయన కోరారు. తద్వారా ఇతరులకు ఆదర్శంగా ఉంటామన్నారు. దేవుడి కార్యక్రమంలో పాల్గొన్నందున ఎంతో సంతోషంగా ఉందన్నారు. పువ్వాడ ఫౌండేషన్ సామాజిక సేవా కార్యక్రమాలు నిరవధికంగా కొనసాగిస్తుందన్నారు. ఈ మేరకు నిమజ్జనం నిర్వహించే బొక్కలగడ్డ ప్రాంతాన్ని వినాయక ఘాట్‌గా మారుస్తూ త్వరలోనే కార్పొరేషన్ పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏసీపీ గణేష్, కార్పొరేటర్ కమర్తపు మురళి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రసన్న కృష్ణ, వినోద, జైపాల్‌రెడ్డి, నారాయణరావు, సత్యనారాయణ, లక్ష్మినారాయణ, అంజయ్య, విద్యుత్ ఏడీ బాలాజీ, గోపాల్ పాల్గొన్నారు.



డీఈ రవికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్

పుష్పం.. పత్రం.. ఆయుర్వేదం..!



● గణపతి పూజలో ఆయుర్వేద రహస్యం

● 21 రకాల ఆకుల్లో ఎన్నో ఔషధ గుణాలు..!

మండపంలో గణపతి విగ్రహం ప్రతిష్ఠించింది మొదలు.. నిమజ్జనం వరకు భక్తి శ్రద్ధలతో రెండుపూటలా శాస్త్రోక్తంగా పూజలు చేయటం ఆనవాయితీ. ఈ సందర్భంగా 21 రకాల పత్రాలను పూజలో ఉపయోగిస్తారు. ఇంత వరకూ అందరికీ తెలుసు. కానీ.. ఈ పత్రాల్లోని ఆయుర్వేద రహస్యం గురించి మాత్రం చాలా మందికి తెలియదు. ఈ నేపథ్యంలో ఆకుల్లోని ఔషధ గుణాలు, వాటి ఉపయోగాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

- మధిర



మాచీపత్రం..

పెదవులు, దంతాలు, చిగుళ్ల, నాలుక, కంఠం, అంగిలి, నోరు ఈ ఏడు భాగాలను కలిపి ముఖం అంటారు. ఈ భాగాల నుంచి వచ్చే దుర్గంధాన్ని హరించి, సుగంధాన్ని అందించే ఔషధ గుణం ఈ మాచీపత్రానికి ఉంటుంది.



బిల్వపత్రం:

తెలుగులో మారేడు ఆకు అంటారు. ఇది మధుమేహానికి ఔషధంగా పనిచేస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది. బిల్వఫలంలోని గుజ్జు మలబద్ధకాన్ని తొలగించి, ఆరోగ్యాన్ని చేకూర్చుతుందని ఆయుర్వేదం చెపుతోంది.



చూతపత్రం:

చూతపత్రం అంటే మామిడి ఆకు. ఇది నెగిటివ్ ఎనర్జీని తొలగిస్తుంది. గాలి సోకటం వల్ల ఆరోగ్యం బాగుంటుంది. మూత్ర వ్యాధిని తగ్గిస్తుంది. మామిడిచిగుళ్ల చక్కని కంఠస్వరాన్ని ఇస్తాయి. గుండెల్లో మంట, వాంతులు, అతిసారం నివారణలో చూత పత్రం విశేషంగా పనిచేస్తుంది.



తులసి పత్రం:

ఇది విషపురుగులను దరిచేరనివ్వదు. కంటికి కన్పించని సూక్ష్మజీవులను నాశనం చేస్తుంది. గజకర్ణం అనే చర్మవ్యాధిని నివారిస్తుంది.



సింధువారపత్రం:

అంటే వావిలి చెట్టు ఆకు. ఈ ఆకు వాతరోగాన్ని తగ్గిస్తుంది.



బృహదిపత్రం:

దీనిని తెలుగులో మొలక అంటారు. ఇది శ్వాససంబంధ వ్యాధుల్లో విశేషంగా ఉపకరిస్తుంది.



దుర్వాయుగ్మం:

తెలుగులో గరిక అంటారు. చర్మరోగం, చుండ్రు నివారణకు ఉపకరిస్తుంది. చెడ్డకలలు వచ్చినప్పుడు చేసే మూత్రవిసర్జన లాంటి సమస్యలను నివారిస్తుంది.



అపామార్గపత్రం:

అంటే ఉత్తరేని చెట్టు దీని విత్తనాల వలతో పాయసం వల్ల అతి ఆకలిని నివారిస్తుంది. కడుపునొప్పి, శ్వాస వ్యాధుల నివారణకు విశేషంగా పనిచేస్తుంది.



గండలీ పత్రం:

ఈ ఆకు జ్వరాన్ని తగ్గిస్తుంది. దాహం తగ్గడానికి ఉపయోగపడుతుంది.



దేవదారు పత్రం:

ఈ ఆకు నుంచి తీసిన నూనె కీళ్లనొప్పుల నివారణకు ఉపయోగపడుతుంది. దీనికి దేవకాష్ట అని మరో పేరు కూడా ఉంది. ఇది హిమాలయాల్లో ఎక్కువగా దొరుకుతుంది.



శమీపత్రం:

శమీపత్రం అంటే జమ్మి ఆకు. త్రిదోషజన్యమైన వ్యాధులను నివారిస్తుంది.



జాజిపత్రం:

ఈ ఆకు నుంచి తీసిన సుగంధ తైలం తలనొప్పి, చెవినొప్పికి మంచి ఔషధంగా పనిచేస్తుంది.



మరువకపత్రం:

ఈ ఆకును ధవనం, మరువం అంటారు. ఇది దుర్గంధాన్ని పారదోలుతుంది. పురుగులను వెళ్లగొడుతుంది.



ఆర్కపత్రం:

అంటే జిల్లేడు ఆకులు. ఎర్రజిల్లేడు, తెల్లజిల్లేడు అనే రెండురకాలు ఉంటాయి. తెల్లజిల్లేడు శ్రేష్టమైంది. పాముకాటుకు విరుగుడు, నపుంసకత్వ నివారణ, శ్వాసకోశ వ్యాధుల్లో, పుండ్లను మాన్పుడంలో దివ్యఔషధంగా పనిచేస్తుంది.



అర్జున పత్రం:

అంటే మద్దిచెట్టు ఆకు. రక్తదోషాలను, టీబీ వ్యాధులు, గుండెకు సంబంధించిన వ్యాధులను నివారించటంలో ఉపయుక్తమైంది.



అశ్వత్థపత్రం:

రావిచెట్టు ఆకు. ఇది స్త్రీ సంబంధ వ్యాధులను నివారించటంలో దివ్య ఔషదంగా పనిచేస్తుంది.



బదరీపత్రం:

రేగుచెట్టు ఆకును బదరీపత్రం అంటారు. ఇది పొట్ట పెరగడాన్ని నిరోధించి, తిన్న ఆహారాన్ని సరిగ్గా జీర్ణం చేసేందుకు ఉపకరిస్తుంది.



విష్ణుక్రాంత పత్రం:

ఇది మంచి దృష్టిని, కంఠస్వరాన్ని, జ్ఞాపకశక్తిని ఇస్తుంది. మూత్రదోషాలతో, కుష్టు వ్యాధి నివారణలో విశేషంగా ఉపకరిస్తుంది.



దాడిమీపత్రం:

దానిమ్మ ఆకు. ఇది అజీర్ణాన్ని పోగొడుతుంది. వాంతులను నివారిస్తుంది. జలుబును తగ్గిస్తుంది. ఆకలి కల్గించేందుకు ఉపకరిస్తుంది.



కరవీరపత్రం:

అంటే గన్నేరు. దీని పాలు మొండిపుండ్లను మాన్పుతాయి. వాపులను, గడ్డలను తగ్గిస్తాయి. తేలుకాటుకు కరవీరపత్రం పాలు మంచి ఔషధం.



దత్తూరపత్రం:

ఉమ్మెత్త ఆకు. ఈ ఆకులు జ్వరాన్ని, కుష్టు, కృతి తగ్గించుటకు, పుండ్లు మాన్పుటకు, నొప్పి తగ్గుటకు ఉపయోగపడుతుంది. శ్వాస వ్యాధులను తగ్గిస్తుంది. విష ప్రభావాన్ని శరీరమంతటా వ్యాపించకుండా నిరోధించే విశేష గుణం ఈ ఆకులో ఉంది.

మట్టి గణపతికి జై



● భక్తుల్లో పెరుగుతున్న అవగాహన

● మట్టి విగ్రహాల కొనుగోలుకు మొగ్గు

ఖమ్మం సాంస్కృతికం: 'మట్టి గణపతినే పూజించండి.. పర్యావరణాన్ని రక్షించండి..' అంటూ కొన్నేళ్లుగా కొనసాగుతున్న ప్రచారం.. ఇప్పుడిప్పుడే ఫలితాన్నిస్తోంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వల్ల ఎన్నో అనర్థాలున్నాయన్న అవగాహన పెరుగుతుండడంతో.. మట్టి విగ్రహాల కొనుగోలుకు జనం మొగ్గు చూపుతున్నారు.

పెరుగుతున్న ఆసక్తి..

గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది మట్టి విగ్రహాల కొనుగోలు పెరిగింది. ఈ విగ్రహాలను ఉచితంగా ప్రజలకు అందించేందుకు ఇటు స్వచ్ఛంద సంస్థలతోపాటు, పలు ఉత్సవ కమిటీలు ముందుకు వచ్చాయి. వివిధ కూడళ్ల, విద్యాసంస్థల వద్ద నేడు ఉచితంగా మట్టి వినాయకుల్ని పంపిణీ చేయనున్నారు.

హైదరాబాద్ నుంచి ఉచిత రవాణా..

మట్టి విగ్రహాల కొనుగోలును ప్రోత్సహించేందుకు స్తంభాద్రి ఉత్సవ సమితి కార్యదర్శి సాయికిరణ్ ఉచిత ట్రాన్స్‌పోర్టుకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌లో కొనుగోలు చేసిన మట్టి విగ్రహాలను ఖమ్మం తరలించేందుకు ప్రత్యేకంగా ఉచిత వాహనం ఏర్పాటు చేసి, ఆయా మండపాలకు విగ్రహాలను తరలించారు.

ఆరు అడుగులు..

మట్టి గణపతి విగ్రహాలు అడుగు ఎత్తు మొదలుకొని ఆరు అడుగుల వరకు అమ్మకాలు జరిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌కు విగ్రహాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా చక్కటి ఆకృతుల్లో, రంగుల్లో తీర్చిదిద్దారు. దీంతో.. మట్టి విగ్రహాలు సైతం ఆకర్షణీయంగా ఉండటంతో కొనుగోలు చేసేందుకు మండపాల నిర్వాహకులు ఎక్కువగానే ఆసక్తి చూపారు.

నేడు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో.. మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

ఖమ్మం గాంధీచౌక్: గణపతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, రోటరీక్లబ్ ఆఫ్ స్తంభాద్రి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో ఉచిత మట్టివినాయక విగ్రహాలు పంపిణీ చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఏడాది 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది సైతం అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు.



మూడేళ్లుగా మట్టి విగ్రహాలే..

మల్లిఖార్జున్, కొనుగోలుదారుడు

మూడు సంవత్సరాలుగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నాం. వీటి వల్ల పర్యావరణానికి హాని ఉండదు. నీటిలో త్వరగా కరిగిపోతాయి. ధర కాస్త ఎక్కువయినా ఎంతో బాగుంటున్నాయి.



విగ్రహాల రవాణా ఉచితం

సాయి కిరణ్, స్తంభాద్రి ఉత్సవ సమితి కార్యదర్శి

నా సొంత ఖర్చులతో మట్టి విగ్రహాలకు ఉచిత ట్రాన్స్‌పోర్టు కల్పించాను. మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహించేందుకు మండప ఖర్చుల్ని తగ్గించి ఉచితంగా ట్రాన్స్‌పోర్టు చేస్తున్నారు.



ఈ సారి ఎక్కువే..

వినోద్ , స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు

గత ఏడాది కన్నా ఈ సారి ఎక్కువ మంది మట్టి వినాయకుల్ని ఏర్పాటు చేస్తున్నారు. ముందుగానే విస్తృతంగా ప్రచారం చేయడం ఫలించింది. విగ్రహాల ఉచిత పంపిణీకి కూడా ఏర్పాట్లు చేశాం.

ప్రకృతిని ప్రేమించండి.. మట్టి గణపతిని పూజించండి..

● భద్రాద్రి కొత్తగూడెం జేసీ రాంకిషన్



విద్యార్థులు తయారు చేసిన మట్టి గణపతులను పరిశీలిస్తున్న జేసీ రాంకిషన్

పాల్వంచ టౌన్: 'ప్రతి ఒక్కరూ ప్రకృతిని ప్రేమించండి.. మట్టి గణపతిని పూజించండి' అని భద్రాద్రి కొత్తగూడెం జాయింట్‌కలెక్టర్ రాంకిషన్ పిలుపునిచ్చారు. బుధవారం పాల్వంచలోని ఆశ్రమ పాఠశాలలో.. పాల్వంచ, కొత్తగూడెం, ములకలపల్లి, బూర్గంపాడు మండలాల్లోని విద్యార్థులకు నేషనల్ గ్రీన్‌కోర్, జిల్లా సైన్స్ విభాగం, ఆశ్రమ పాఠశాల సంయుక్తంగా మట్టి గణపతి విగ్రహాల తయారీపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేసీ మాట్లాడుతూ... వినాయక చవితి ప్రకృతి పండుగగా ఉండాలని, ప్రకృతికి హాని కలిగించే విధంగా ఉండొద్దని అన్నారు. విగ్రహాలను రసాయనాలతో తయారు చేయడం వల్ల జల, వాయు కాలుష్యం ఏర్పడి, జీవకోటి ప్రాణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఏటీడీవో లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ ప్రకృతికి ఆటంకం కలుగ చేస్తే దాని ప్రభావం జీవకోటిపై ఉంటుందన్నారు. మానవుని వికృతి చేష్టలు పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా సైన్స్ అధికారి ఎస్. చలపతిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ నూరుశాతం లక్ష్యాన్ని అధిగమించిందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గ్రీన్‌కోర్ కమిటీలు ఏర్పాటు చేశారని, నాటిన ప్రతి మొక్కను కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ సీహెచ్. బుచ్చిరాములు, జిల్లా ఎన్‌సీఎస్‌సీ కో-ఆర్డినేటర్ సంపత్ కుమార్, ఎంఈవో సరస్వతి, కమిటీ నిర్వాహకులు పి. శివరామకృష్ణ, వి. పద్మాకర్, పి. సాయికృష్ణ, వై. ప్రకాశ్‌కుమార్, ప్రభావతి, కే. విజయలక్ష్మి, మాధవి, పార్థసారథి, వీరన్న, రాజేందర్, వర్తక సంఘం అధ్యక్షులు చలవాది ప్రకాశ్, వాసవిక్లబ్ అధ్యక్షులు ప్రసాద్‌రావు, నర్సింహారావు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు.. పటిష్ట బందోబస్తు

● 'ఆంధ్రజ్యోతి'తో ఏసీపీ గణేష్



ఏసీపీ గణేష్

ఖమ్మం క్రైం: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఖమ్మం నగరంలో పటిష్ట చర్యలు చేపట్టినట్లు ఏసీపీ గణేష్ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఉత్సవ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: గణేష్ ఉత్సవాలకు ఎటువంటి ఏర్పాట్లు చేపట్టారు..?

ఏసీపీ: నగరంలో 800 విగ్రహాలు ఏర్పాటు చేస్తారని అంచనా వేస్తున్నాం. ఇందుకు సంబంధించి ఉత్సవ సమితి నిర్వాహకులతో సమావేశాలు, తదితర ముందస్తు చర్యలు చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: భద్రతా పరంగా చేపట్టిన చర్యలు ఏంటి..?

ఏసీపీ: అనుమతి పొందాకే మండపం ఏర్పాటు చేయాల ని చెప్పాం. ప్రతీ మండపం వద్ద నిఘా, ప్రతీ వీధికి ఒక కానిస్టేబుల్‌ను నియమించాం. వేదికల వద్ద అశ్లీల నృత్యాలు, తదితర అసాంఘిక చర్యల నియంత్రణ, వేదికల వద్ద మైక్‌ను నిర్ణీత సమయం వరకే అనుమతించేలా చూడాలని నిర్ణయించాం. కరెంటు వైర్లు నాణ్యత గలవి వాడకం ద్వారా అగ్నిప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: ఊరేగింపు రోజున ఎలాంటి ఆంక్షలు విధిస్తారు..?

ఏసీపీ: విగ్రహాల నిమజ్జన ఊరేగింపుల కోసం ప్రత్యేక రూట్ మ్యాప్ రూపొందించాం. ఆ రోజున కొన్ని రోడ్లలో వన్ వే అమలవుతుంది కనుక అనుమతించిన రోడ్‌లలోనే శోభాయాత్ర జరపాలి.

ఆంధ్రజ్యోతి: ఎక్కడెక్కడ నిమజ్జన అనుమతి ఉంది..?

ఏసీపీ: మున్నేరులో బొక్కలగడ్డ వద్ద, ప్రకాష్ నగర్‌లో మరో చోట వినాయక నిమజ్జనాలకు అనుమతించాం. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా లకారం చెరువులో నిమజ్జనం నిషేధించాం.

ఆంధ్రజ్యోతి: నిమజ్జన ప్రాంతాల్లో రక్షణ చర్యల గురించి..?

ఏసీపీ: ఘాట్ల వద్ద ఈతగాళ్లు, వైద్య బృందాలు, లైటింగ్ ఏర్పాట్లు, నీటి వసతి కల్పించనున్నాం. డయల్ 100తో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తాం.

ఆరేళ్లుగా మట్టి గణపతికి పూజలు..



మట్టితో సిద్ధి గణపతిని తయారు చేస్తున్న దండిబొట్ల రామాంజన కుమార శర్మ

కొత్తగూడెం సాంస్కృతికం: కొత్తగూడెంలోని శ్రీనగర్ కాలనీ శ్రీ చం డీ సర్వఘ్న పీఠంలో పురోహితుడిగా ఉన్న దండిబొట్ల రామాంజన కుమారశర్మ ఆరేళ్లుగా మట్టి గణపతిని తయారుచేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఈ ఏడాది నవరాత్రులను పురస్కరించుకుని చండీ సర్వఘ్న పీఠంలో నాలుగు అడుగుల ఎత్తయిన సిద్ధి గణపతిని మట్టితో తయారు చేశారు. రామాంజన కృషిని పలువురు అభినందించారు.

చవితి ఉత్సవాల్లో.. అప్రమత్తంగా ఉండండి



గణేష్ నవరాత్రి ఉత్సవాలపై పోలీస్ అధికారులతో సమీక్షిస్తున్న భద్రాద్రి జిల్లా ఎస్పీ అంబర్ కిషోర్‌ఝా

● మండపాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయండి

● పోలీస్ అధికారుల సమావేశంలో ఎస్పీ కిషోర్ ఝా

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం: గణేష్ నవరాత్రుల బందోబస్తు విషయంలో పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులను ఆదేశించారు. కొత్తగూడెంలో జిల్లా పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. నవరాత్రుల్లో రోజుకు రెండుసార్లు అయినా ఎస్‌హెచ్‌వోలు తప్పని సరిగా మండపాలను సందర్శించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లను పిలిపించి ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా బైండోవర్ చేయాలని సూచించారు. దొంగతనాలకు ఆస్కారం ఉంటుందని, గస్తీ పెంచాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలన్నారు. ప్రధాన కూడళ్లలో సీసీకెమెరాలను ఏర్పాటు చేసి, పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. బక్రీద్ పండుగ కూడా ఇదే సమయంలో వస్తోందని, ఎటువంటి మతపరమైన సంఘటనలకూ తావివ్వకుండా ముందుగానే అయా ఏరియాల్లోని అన్ని రకాల మతపెద్దలను పిలిపించి మాట్లాడాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకునేలా చూడాలన్నారు. మండపాల వద్ద అశ్లీల నృత్యాలు, కార్యక్రమాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ సునీఈల్‌దత్, కొత్తగూడెం, మణుగూరు డీఎస్పీలు సురేందర్‌రావు, అశోక్‌కుమార్, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, అడ్మిన్ ఆర్ఐ కృష్ణ, ఆపరేషన్స్ ఆర్ఐ ప్రసాద్, ఎంపీవో సోములు పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తి రిమాండ్

క్రైం: నగరంలోని గట్టయ్య సెంటర్‌లో యువతిని వేధిస్తున్న వ్యక్తిని టుటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టుకు రిమాండ్ చేశారు. ప్రతీ రోజు కళాశాలకు వెళ్లి వచ్చే సమయంలో నగరంలోని గట్టయ్య సెంటర్‌లో ఓ వ్యక్తి తనను వేధిస్తున్నాడని ఓ యువతి షీటీంకు ఫిర్యాదు చేయగా వారు నిఘా ఏర్పాటు చేసిన బుధవారం అదుపులోకి తీసుకున్నారు. షీటీం ఇన్‌చార్జ్ సీఐ అంజలి అతడికి కౌన్సిలింగ్ ఇచ్చి టుటౌన్ పోలీసులకు అప్పగిచారు.

సినిమాలు

● ఆదిత్య	అనబెల్లి
● వినోద	ఫిదా
● సుందర్‌మ్యాక్స్	ఆనందోబ్రహ్మ
● నర్తకి	లై
● తిరుమల	జయజానకినాయక
● కిన్నెరసాని	వివేకం
● శ్రీనివాస	నేనే రాజు నేనే మంత్రి

బస్సుల వేళలు



ఖమ్మం నుంచి హైదరాబాద్

● ఇంద్ర

- ఉదయం : 5.00, 6.00, 10.30, 1.00 (బీహెచ్‌ఈఎల్)
- మధ్యాహ్నం : 12.00, 1.00, 2.30 (బెంగళూరు)
- సాయంత్రం : 4.30, 6.00
- రాత్రి : 11.30, 12.30

● సూపర్ లగ్జరీ

- ఉదయం 4.00, 6.00, 9.30, 10.30, 11.30, 12.30, 1.00, 1.30, 1.45, 2.15, 2.30, 4.00, 4.15, 4.30, 5.15, 6.10
- విచారణ : 9959225979

-సాంస్కృతికం

ప్రధాన ఆసుపత్రి

ఆర్ఎంవో	8008553182
సూపరింటెండెంట్	8008553185

పోలీస్ సమాచారం

●డీఎస్పీ	9440795303
● వన్‌టౌన్	
ల్యాండ్	228333
సీఐ	9440795317
● టు టౌన్	
ల్యాండ్	224302
సీఐ	9440904888
● త్రీ టౌన్	
ల్యాండ్	223190
సీఐ	9440795339
● అర్బన్	
ల్యాండ్	223663
సీఐ	9440795309

ఎనిమిదో రోజు

సెర్ప్ ఉద్యోగుల సమ్మె



రోడ్లు ఊడ్చి నిరసన తెలుపుతున్న సెర్ప్ ఉద్యోగులు

బైపాస్‌రోడ్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెర్ప్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఉద్యోగులు చీపుర్లతో రోడ్డు ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు. ఐక్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణారావు వారికి మద్దతు తెలిపారు. సెర్ప్ ఉద్యోగులు డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సుజాత, అరుణ, స్వాతి, ఈశ్వరి, చంటి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

● సీపీఐ ఎంఎల్ ఎన్డీ జిల్లా కార్యదర్శి కొల్లేటి



మాట్లాడుతున్న ఎన్‌డీ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

మయూరి సెంటర్: నగరంలో రాజకీయ నాయకులు ఆక్రమించిన ప్రభుత్వ భూములను వెంటనే ఇళ్లు లేని పేదలకు పంచాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కొల్లేటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కార్యాలయంలో జరిగిన డబుల్ బెడ్‌రూం ఇళ్లసాధన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలోని వందలాది ఎకరాలు కబ్జాకు గురవుతున్న అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. జేఏసీ జిల్లా కన్వీనర్ పాపారావు మాట్లాడుతూ అర్హులైన పేదలకు కబ్జాదారులు ఆక్రమించిన భూమిని ఇచ్చి ఇళ్లు నిర్మించాలన్నారు. జిల్లాలో వేలాది ఎకరాలు కబ్జాదారుల చేతుల్లో ఉందని నగరంలోని ఇళ్లులేని పేదలను గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని బీజేపీ నగర అధ్యక్షుడు రుద్రప్రదీప్ ప్రభుత్వానికి సూచించారు. బట్టు లలిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మచ్చా విద్యాసాగర్, ఎం. వెంకన్న, దూదేకుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సిద్దా సాహెబ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పేర్ల మధు, ఎన్‌డీ డివిజన్ నాయకులు ఎస్‌కే. ఖాసీం, గుమ్మడి కనకరాజు, యలమద్ది కళాధర్, కే. నాగేశ్వరరావు, బాబు పాల్గొన్నారు.

'అండర్ బ్రిడ్జీ సమస్య పరిష్కరించాలి'



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గాంధీచౌక్: నగరంలోని సారధీనగర్ అండర్‌బ్రిడ్జీ సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరుతూ సీపీఎం 48వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సంతకాలు సేకరించారు. అండర్ బ్రిడ్జీ వద్ద సంతకాలు సేకరించి మునిసిపల్ డీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి రవికుమార్ మాట్లాడారు. సారధీనగర్ బ్రిడ్జీ ప్రజలకు తీవ్రసమస్యగా మారిందన్నారు. రోజు వందల మంది ప్రజలు విద్యార్థులు, కూలీలు కార్మికులు పట్టాలు దాటాల్సి వస్తోందని, ప్రమాదానికి దారితీసే పరిస్థితి ఉందనితెలిపారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శీలం వీరబాబు, శ్రీధర్, రామకృష్ణ, నర్సింహారావు, నరేష్‌పాల్గొన్నారు.

'పోటీ పరీక్షలకు ఇంగ్లీష్ ఎంతో ముఖ్యం'

చర్చికాంపౌండ్: నేటి పోటీ ప్రపంచంలో పోటీ పరీక్షలకు ఇంగ్లీష్ బాష ఎంతో ముఖ్యమని సీపీ తఫ్సీర్ ఇక్బాల్ అన్నారు. నగరంలోని శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్సీ ఆధ్వర్యంలో 'ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ టీచింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ స్కిల్స్'పై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను బుధవారం పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సాయంత్రం ఐదు గంటల నుంచి 6:30 నిమిషాల వరకు కొనసాగుతాయన్నారు. ఆసక్తి ఉన్న సిబ్బంది పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇనిస్టిట్యూట్ లెక్చరర్ ప్రసాదరావు, స్కూల్ ప్రిన్సిపాల్ శేషగిరిరావు పాల్గొన్నారు.

చిట్టి చేతులతో మట్టి విగ్రహాల తయారీ



ప్రతిమలు తయారు చేస్తున్న చిన్నారులు

ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో చిన్నారులచిట్టి చేతులతో మట్టి గణపతి విగ్రహాలు తయారు చేశారు. బుధవారం వివిధ ఆకృతలతో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి అబ్బురపరిచారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి విగ్రహాలను వాడాలని ఈ కార్యక్రమం నిర్వహించామని పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య పేర్కొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

క్రైం: నగరంలోని ఓ పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్సు అధికారులు దాడి చేసి నిర్వాహకుడు అశోక్‌రెడ్డితో పాటు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని రఘునాధపాలెం రోడ్డులోగల వినయ్ అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ. 28,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

నీలికిరోసిన్ పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న మూడు బ్యారెళ్ల (600 లీటర్ల) నీలి కిరోసిన్‌ను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. ట్రాలీ ఆటోలో తరలిస్తుండగా ముస్తఫానగర్ వద్ద పట్టుకున్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

క్రైం: అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ రేగుల నర్సయ్య కుటుంబ సభ్యులకు టుటౌన్ పోలీసులు బుధవారం రూ. 25వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందించిన వారిలో కానిస్టేబుళ్లు నోవా శ్రీహరి, చంద్రనాథ్, యాదగిరి వెంకన్న తదితరులు న్నారు.

6న ఎస్సీ, బీసీ కార్యాలయాల ముట్టడి

మయూరి సెంటర్: ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలను అందించలేని రాష్ట్రప్రభుత్వం అసమర్థతకు నిరసనగా వచ్చే నెల 6న ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల కార్యాలయాల ముట్టడికి యువత అధికసంఖ్యలో తరలిరావాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి సిద్ధినేని కర్ణకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని గిరిప్రసాద్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎస్సీ, బీసీ కార్పొరేషన్లలో లాటరీల ద్వారా కాకుండా దరఖాస్తు చేసుకున్న వారందరికీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 6న జరిగే కార్యక్రమానికి నిరుద్యోగులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, రవీందర్, సతీష్‌రెడ్డి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షకు శిక్షణ

చర్చికాంపౌండ్: టీఎస్ బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష కోసం ఉచిత శిక్షణ అందిస్తున్నామని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి. శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన అర్హులైన బీసీ అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, అభ్యర్థులకు సెప్టెంబర్ 10న ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.

'సెప్టెంబర్17ను విమోచనదినంగా ప్రకటించాలి'



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మయూరిసెంటర్: సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా అధికారికంగా ప్రకటించి నిర్వహించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ లోకేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లాఅధ్యక్షుడు సన్నె ఉదయ్‌ప్రతాప్, రాష్ట్ర కార్యదర్శి కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ యాదగిరిరెడ్డి మాట్లాడారు. కోట్లాదిమంది భారతీయుల నిరంతర పోరాటం, త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్రం వచ్చిందన్నారు. ప్రజలందరు ఏకతాటిపై నిలిచి, నిర్వహించిన ఉద్యమాల కారణంగా తెలంగాణ ప్రాంతం విముక్తి పొందిందన్నారు. నేడు టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, తెలంగాణ విమోచన ఉద్యమాలను మరిచారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.ప్రభాకరరెడ్డి, విద్యాసాగర్, ఎం.శ్రీనివాసరావు, కొలిపాక శ్రీదేవి, వీరస్వామి, రవీందర్, చంద్రశేఖర్, ఉపేందర్ పాల్గొన్నారు.

లక్ష్యం.. నిర్లక్ష్యం...!



ఆన్‌లైన్ చేయని ట్రేడ్ లైసెన్సులు, అద్దెలు ● సీడీఎంఏ ఆదేశాలు బేఖాతర్

కార్పొరేషన్: కార్పొరేషన్‌కు ప్రధాన ఆదాయ వనరులపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో బకాయిలు కొండలా పేరుకుపోతున్నాయి. కార్పొరేషన్‌కు వచ్చే ట్రేడ్ లైసెన్సుల ఫీజును ఆన్‌లైన్ చేయాలని మునిసిపల్ శాఖ రాష్ట్ర కమిషనర్ డైరెక్టర్ ఆదేశాలు జారీచేసినా పట్టించుకోవడం లేదు. గతంలో రెవెన్యూ విభాగం సిబ్బంది వాణిజ్య సముదాయాల సర్వే చేశారు. కానీ ట్రేడ్ లైసెన్సుల వివరాలను ఆన్‌లైన్ చేయలేదు. దీంతో ట్రేడ్ లైసెన్సుల వసూళ్ల వివరాలు ఎప్పటికప్పుడు తెలవడం లేదని అకౌంటింగ్ సెక్షన్ అధికారులు చెబుతున్నారు. ఇక కార్పొరేషన్‌కు సంబంధించిన దుకాణాల సముదాయాల అద్దెలు కూడా ఆన్‌లైన్ కాలేదు. అద్దెలు కూడా బకాయి పడుతున్నాయి. రెండు ప్రధాన ఆదాయ వనరుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. కాగా ట్రేడ్ లైసెన్సులను, అద్దెలను ఆన్‌లైన్ చేయాలని సాక్షాత్తు రాష్ట్ర మునిసిపల్ శాఖ కమిషనర్, డైరెక్టర్ ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. ఆన్‌లైన్ పేరుతో సర్వేచేసిన అనంతరం ఆన్‌లైన్‌పై దృష్టిపెట్టలేదు.

ట్రేడ్ లైసెన్సుల ఫీజు బకాయి రూ. 20 లక్షలు

ఈ ఏడాది మార్చి వరకు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు రూ. 41 లక్షలు రావాలి. అయితే రూ. 20.75 లక్షలు మాత్రమే వసూలు అయ్యాయి. ట్రేడ్ లైసెన్సులు ఆన్‌లైన్ కాకపోవడంతో వాటికి సంబంధించిన డిమాండ్ నోటీసులు పంపిణీ చేయలేకపోతున్నారు. ట్రేడ్ లైసెన్సులను ఆన్‌లైన్ చేయాలని మునిసిపల్ శాఖ కమిషనర్, డైరెక్టర్ (సీడీఎంఏ) ఆదేశించడంతో కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగం సిబ్బంది నగరంలో వాణిజ్య సముదాయాలు, ఇతరత్రా దుకాణాల వివరాలను నమోదు చేసుకున్నారు. వాటిని ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ట్రేడ్ లైసెన్సుల ఫీజులను ఆన్‌లైన్ చేయాలని ఆదేశాలున్నాయి. అయినప్పటికీ ట్రేడ్ లైసెన్సులు ఆన్‌లైన్ చేయకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నాయి.

దుకాణాల అద్దెల పరిస్థితి అంతే...

కార్పొరేషన్ పరిధిలో దుకాణాల అద్దెలు ఇంకా కాగితాల్లోనే నడుస్తున్నాయి. నెలకు రూ. 96 లక్షలు వసూలు కావాల్సి ఉండగా ఈ ఏడాది మార్చి వరకు రూ. 51 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. అద్దెల బకాయిలు పేరుకుపోయిన నేపథ్యంలో ఆ దుకాణాల అద్దెలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

బస్టాండ్‌రోడ్డులో దుకాణానికి నెలకు రూ. 15వేలు, స్టేషన్‌రోడ్డులో రూ. 5వేలు, పెవిలియన్ గ్రౌండ్ సమీపంలో దుకాణానికి రూ. 20వేల నుంచి రూ. 30వేలుగా అద్దెను ఖరారు చేశారు. గతంలో దుకాణానికి రూ. 4 వేల నుంచి 8వేల వరకు మాత్రమే ఉండేది. గతంలోనే అద్దె బకాయిలు ఉండగా ప్రస్తుతం పెరిగిన అద్దెలను చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అద్దెలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో బకాయిలు ఏడాది చివరలోనే తెలుస్తుంటాయి. ఇప్పటికైనా ట్రేడ్ లైసెన్సులు, అద్దెలను ఆన్‌లైన్ చేస్తే బకాయిలు ఎంతో ఎప్పటికప్పుడు తెలుస్తుంది. అయితే సీడీఎంఏ ఆదేశాలను సైతం అధికారులు పట్టించుకోకపోవడంతో కార్పొరేషన్ ఆదాయం ఆశించిన లక్ష్యం చేరుకోలేకపోతున్నదనే ఆరోపణలు ఉన్నాయి.

త్వరలోనే ఆన్‌లైన్ పూర్తి



ట్రేడ్ లైసెన్సుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ త్వరలోనే పూర్తి చేస్తాం. ఆన్‌లైన్ నమోదుకు ఎక్కువమంది సిబ్బందిని కేటాయిస్తాం. అద్దెలను ఆన్‌లైన్ చేసి బకాయిలు లేకుండా చర్యలు తీసుకుంటాం.

- మేయర్ పాపాలాల్

బజాజ్ సీటీ 100 వాహనం ఆవిష్కరణ



నూతన వాహనాన్ని ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ సీఐ నరేష్‌రెడ్డి

సాంస్కృతికం: దేశపు నెంబర్ 1 ఆటో మొబైల్ తయారీ సంస్థ బజాజ్ ఆటో, కమ్యూటర్ శ్రేణిలో అత్యంత ప్రజాదరణ పొందిన సీటీ 100 ఎలక్ట్రిక్ స్టార్ట్ ద్విచక్రవాహనాన్ని ట్రాఫిక్ సీఐ నరేష్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. నగరంలోని వెంకటరమణ ఆటో మొబైల్ షోరూంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎలక్ట్రిక్ స్టార్ట్‌తో సీటీ 100 వాహనం మార్కెట్‌లోకి రావడం ఎంతో గర్వకారణమన్నారు. ఎలాంటి రోడ్లపైనా అయినా సౌకర్యవంతంగా రైడింగ్ చేయవచ్చన్నారు. పలు రంగుల్లో వాహనాలు ఉన్నాయని సీఓఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సెల్ఫ్ స్టార్ట్‌తో కస్టమర్లకు అదనపు సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో జీఎం వెంకన్న, బాలాజీ, రవికుమార్, ఏరియా మేనేజర్ ఖయ్యూం పాల్గొన్నారు.

డీఎస్ఎంఎం సమావేశాలు విజయవంతం చేయాలి

మయూరిసెంటర్: హైదరాబాద్‌లో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే జాతీయస్థాయి దళిత సంఘ్ శోషణ్ ముక్తి మంచ్ (డీఎస్ఎంఎం) సమావేశాలను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్ పిలుపునిచ్చారు. టూటౌన్ ఏరియాలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో జెండా దిమ్మెను ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు గంటా బీమయ్య, మనోహర్ మాట్లాడారు. దళితులు తెలుగు రాష్ట్రాల్లో అణచివేతకు గురవుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వెంకయ్య, వీరస్వామి, మణెమ్మ, ఉపేందర్, కౌలన్య, రాజేష్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న మనోహర్

'హార్వెస్ట్'లో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారం



విద్యార్థి నాయకులతో ఏసీపీ గణేష్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి, కరస్పాండెంట్ రవిమారుత్

చర్చికాంపౌండ్: నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో జులై 29న జరిగిన నమూనా ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నగర ఏసీపీ పీవీ గణేష్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్నికైన అభ్యర్థులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు ప్రొఫెషనల్స్‌గానే కాక సేవారంగంలో కూడా పాల్గొని సమాజ అభ్యున్నతిలో పాలుపంచుకోవాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, నిజాయితీ గల వ్యక్తులు నాయకులుగా ఉన్న సమాజం అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రవిమారుత్, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, సీబీఎస్ఈ కో ఆర్డినేటర్ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మద్యంతాగి వాహనం నడపటం ప్రమాదకరం'

క్రైం: మద్యం తాగి వాహనాలు నడపటం ప్రాణాలకు ప్రమాదకరమని ట్రాఫిక్ ఎస్ఐ గౌతం అన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నగరంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 26 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపకుండా కుటుంబ సభ్యులు అడ్డుకోవాలని అన్నారు. ప్రాణం అన్నిటికంటే విలువైనదని గుర్తించాలన్నారు.

9, 10 తేదీల్లో హమాలీ ఫెడరేషన్ మహాసభలు

మయూరిసెంటర్: వచ్చే నెల 9, 10 తేదీల్లో నగరంలో హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభలు నిర్వహించనున్నట్లు హమాలీ యూనియన్ జిల్లాఅధ్యక్షుడు కల్యాణం వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నగరంలోని మంచికంటిభవన్‌లో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలపై జరిగే ఈ మహాసభకు హమాలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మ విష్ణువర్ధన్, భూక్యా శ్రీను, లింగయ్య, అంజిరెడ్డి, వీరస్వామి, లింగయ్య పాల్గొన్నారు.

తిమ్మారావుపేటలో మండలస్థాయి క్రీడా పోటీలు

ఏన్కూరు: తిమ్మారావుపేట హైస్కూల్లో ఈనెల 29, 30, 31తేదీల్లో మండలస్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. ఎంఈవో జయరాజు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పోటీలకు అర్హులని తెలిపారు. 29న బాలికలకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని, 30న బాలుర జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు, 31వతేదీన అథ్లెటిక్స్ జరుగుతాయని తెలిపారు.

'మధుసూదన్‌రెడ్డి మరణం తీరనిలోటు'

చర్చికాంపౌండ్: పన్నాల మధుసూదన్ రెడ్డి అకాలమరణం కళారంగానికి తీరనిలోటని ప్రజానాట్య మండలి సీనియర్ నాయకుడు కే. దేవేంద్ర తెలిపారు. మధుసూదన్‌రెడ్డి మృతికి బుధవారం ఆయన సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుసూదన్‌రెడ్డి విద్యార్థి దశనుంచి ఎస్ఎఫ్ఐ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని, కళారంగానికి విశేష కృషి చేశారని అన్నారు. పూర్తిస్థాయి ప్రజానాట్యమండలి ఉద్యమ నిర్మాణానికి కృషిచేశారన్నారు. ప్రస్తుత ప్రజానాట్యమండలి రాష్ట్రకమిటీసభ్యుడిగా ఉద్యమానికి విలువైన సూచనలు, సలహాలు ఇస్తూ క్రీలక భూమిక పోషించారన్నారు. 'రేపేంది', 'ఎవనిచే జనించు', 'తులసీతీర్థం', 'ఓటున్న ప్రజలకు కోటి దండాలు', 'ఊహాజీవులు', 'ఏక్‌దినర్‌కా సుల్తాన్', 'ఎలక్షన్‌దేవుడు' తదితర నాటకాలలో నటించారని తెలిపారు. ప్రజానాట్య మండలి ఖమ్మటౌన్ అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. ఖమ్మంలో నెలనెల వెన్నెల వ్యవస్థాపనలో ఆయన పాత్ర మరువలేనిది, వ్యవస్థాపక అధ్యక్షుడుగా, గౌరవాధ్యక్షుడుగా పనిచేశారని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో కెజోజి, బుర్రి వెంకటకుమార్, సదానంద్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు, హిమాం, ముత్యాలు, లింగయ్య, నవీన్ ఉన్నారు.


నివాళులర్పిస్తున్న ప్రజానాట్యమండలి నాయకులు

వివిధకళాసంస్థల సభ్యుల సంతాపం

ఖమ్మం కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు వీవీ అప్పారావు, నాగబత్తిని రవి, నెల నెలా వెన్నెలనాయకులు ఏఎస్‌కుమార్, జగన్మోహన్‌రావు, కృష్ణప్రసాద్, పాపారావు, సాంస్కృతిక సారథి రాష్ట్ర కో ఆర్డినేటర్ యశ్‌పాల్, తదితరులు మధుసూధన్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్రనాయకుడు పోతినేని సుదర్శన్, పొన్నం వెంకటేశ్వర్లు, విక్రం పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు.

'ప్రజా ఉద్యమాలకు తీరని లోటు'

మయూరి సెంటర్ : పన్నాల మధుసూదన్‌రెడ్డి మరణం ఇటు ప్రజా ఉద్యమాలకు, కళారంగానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర నేత పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. అకాల మృతిచెందిన మధుసూదన్‌రెడ్డి మృతదేహాన్ని బుధవారం సందర్శించి నివాళులర్పించారు. మధుసూదన్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పార్టీలో కొనసాగారని ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని అన్నారు. సంతాపం తెలిపిన వారిలో జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, వై. విక్రమ్ తదితరులు ఉన్నారు.

'ఐదువేల విగ్రహాల

పంపిణీ లక్ష్యం'


విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కార్పొరేషన్: స్తంభాద్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నగరంలో ఐదువేల మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నామని ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, మేయర్ పాపాలాల్ తెలిపారు. బుధవారం నగరంలోని ప్రకాష్‌నగర్‌లో మట్టి గణపతి విగ్రహాల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌కు వంద చొప్పున మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తామన్నారు. అనంతరం కార్పొరేటర్ కమర్తపు మురళికి మట్టిగణపతి విగ్రహాన్ని అందించి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఉత్సవ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

స్వీపింగ్ మిషన్ పనితీరు పరిశీలన



స్వీపింగ్ మిషన్ పనితీరును పరిశీలిస్తున్న మేయర్ పాపాలాల్, ఏఎంసీ చైర్మన్ కృష్ణ

స్పోర్ట్స్: మునిసిపల్ కార్పొరేషన్‌కు నూతనంగా వచ్చిన స్వీపింగ్ మిషన్ పనితీరును నగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పరిశీలించారు. సుమారు రూ.42 లక్షల విలువైన ఈ మిషన్ రోడ్లు ఊడ్చటమేగాకుండా మార్కెట్ వంటి విశాలమైన ప్రాంతాల్లో ఉపయోగపడుతుందా..? అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పాపాలాల్, ఏఎంసీ చైర్మన్ గుండాల కృష్ణ, మార్కెట్ సూపర్‌వైజర్ ఆంజనేయులు, త్రిలోక్ పాల్గొన్నారు.

● ఇంకా అర్బన్ కేజీబీవీనా ?

ఎడ్యుకేషన్: నగరంలోని జడ్పీసెంటర్‌లో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఇంకా ఖమ్మం అర్బన్ పేరులోనే ఉంది. గతంలో ఇక్కడ నడిచిన కేజీబీవీ (అర్బన్) నూతన భవనంలోకి వెళ్లి నెల రోజులు గడిచింది. పాత భవనంలో రఘునాథపాలెం మండలానికి చెందిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఏర్పాటుచేశారు. ఈ పాఠశాల ఏర్పాటుచేసి దాదాపు నెల రోజులు గడుస్తున్నా ఇంకా బోర్డుపై 'కేజీబీవీ అర్బన్'గానే ఉంది. జిల్లా అధికారులు, పాఠశాల నిర్వాహకులు కనీసం బోర్డుపై పేరు మార్చలేని బిజీలో ఉన్నారా ? అని స్థానికులు నవ్వి పోతున్నారు.


ఇంకా పేరు మారని బోర్డు..

'గొర్రెల సరఫరాలో ప్రభుత్వ వైఫల్యం'

వైరా: వైరా మండలంలో గొర్రెల పంపిణీలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి మేకల నాగేశ్వరరావు విమర్శించారు. గుమ్మా నర్సింహారావు అధ్యక్షతన వైరాలో బుధవారం జరిగిన ఆసంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. మూడునెలలైనా వైరా మండలంలో కేవలం 60మందికి మాత్రమే గొర్రెలు పంపిణీ చేశారని విమర్శించారు. జూలై నాటికే గొర్రెలు పంపిణీ చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పటివరకు గొర్రెలు సరఫరా చేయలేదని ఆక్షేపించారు. రూ.70వేలు విలువ చేయని గొర్రెలను రూ.1.10లక్షలకు అంటగడుతున్నారని వాతావరణం తట్టుకోలేక చనిపోతున్నాయని దుయ్యబట్టారు. గొర్రెలకు బదులు గేదెలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు బారి మల్సూర్, నాయకులు చింతల చెర్వు కోటేశ్వరరావు, మర్రి తిరుపతిరావు, కాంపాటి శివ, దొడ్డా లింగయ్యస్వామి పాల్గొన్నారు.

● హరితహారం...


చింతగుర్తి రహదారికి ఇరువైపులా పచ్చని చెట్లు

రఘునాథపాలెం: హరితహారాన్ని పరిపూర్ణంగా అమలుచేస్తే నగర, పట్టణ, గ్రామాల్లోని రోడ్లు, పచ్చల తోరణాలు తలపిస్తాయి. ఆడవుల శాతం పెరుగుతుంది. హరితహారంతో ఎంతో మేలు జరుతుందనే నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మొదటి విడత హరితహారంలో మండలంలోని చింతగుర్తి, రఘునాథపాలెం, బైపాస్‌రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. ఇప్పుడు అవి ఎంతో ఎత్తు పెరిగి రోడ్లకు పచ్చల తోరణాలుగా దర్శనమిస్తున్నాయి.


రఘునాథపాలెం బైపాస్ రోడ్డులో...

పూజా సామగ్రిని సిద్ధం చేస్తున్న వ్యాపారులు

వైరా: వినాయక చవితి సందర్భంగా అవసరమైన పూజా సామగ్రి విక్రయాలకు వ్యాపారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయకుడికి ఇష్టమైన మారేడు, వెలక్కాయ, సీతాఫలం తదితర పూజా సామగ్రిని భక్తులు వినియోగిస్తారు. మూడ్నాలుగురోజుల ముందునుంచే వ్యాపారులు వీటిని సమకూర్చుకుంటున్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

రకం	కిలో ధర
టమోటా	50
వంకాయ	34
బెండకాయ	30
పచ్చిమిర్చి	30
కాకరకాయ	30
బీరకాయ	34
సొరకాయ	15
దొండకాయ	24
పొట్లకాయ	30
దోసకాయ	30
చిక్కుడు	54
గోరుచిక్కుడు	44
క్యాబేజీ	24
ములక్కాయ(1)	5
ఆలుగడ్డ	16
చామగడ్డ	34
క్యారెట్	54
బీట్‌రూట్	34
ముల్లంగి	40
కంద	60
బీన్స్	54
క్యాప్సికం	50
బచ్చలకూర(1కట్ట)	3
పాలకూర(1కట్ట)	3
తోటకూర(1కట్ట)	2.5
గోంగూర(1కట్ట)	2
కొత్తిమీర(1కట్ట)	10
ఉల్లిగడ్డలు	35

- ఖమ్మం స్పోర్ట్స్

సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

ఖమ్మంరూరల్: సెప్టెంబర్17న తెలంగాణవిమోచన దినోత్సవంగా ప్రకటించాలని బీజేపీ ఖమ్మం రూరల్ అధ్యక్షుడు వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ నర్సింహారావుకి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాదిమంది త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. కార్యక్రమంలో నాగరాజు, బుచ్చిరాములు, శ్రీనివాసరావు, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పాఠశాలకోసం అద్దె భవనాన్ని తీసుకోండి

● జిల్లా పరిషత్ సీఈవో మారుపాక నగేష్



పాఠశాల స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం గ్రామంలో పక్కా భవనం లేనందున ఒక భవనాన్ని అద్దెకు తీసుకుని పాఠశాల తరగతులు నిర్వహించాలని జడ్పీ సీఈవో మారుపాక నగేష్ ఆదేశించారు. గ్రామంలో గతంలో ఉన్న భవనం శిథిలావస్థకి చేరుకోవడంతో దానిని కూల్చివేశారు. భవనం కూల్చివేసి ఏడాది గడిచినా నూతన భవనం మంజూరు చేయలేదు. ఇటీవల విద్యార్థులున్నా.. భవనం లేదు.. చెట్టకిందే చదువులు అంటూ 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమయిన విషయం విదితమే.. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ చాట్ల పరుశురాం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకవచ్చారు. దీంతో జడ్పీ సీఈవో నగేష్‌ను గ్రామానికి వెళ్లి పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించారు. ఈక్రమంలో సీఈవో ఎంపీడీవో, ఎంపీపీతో వచ్చి పరిస్థితిని పరిశీలించి అద్దెభవనాన్ని తీసుకోవాలనిహెచ్ఎంను ఆదేశించారు. త్వరలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు అవుతాయన్నారు. ఆయన వెంట ఎంపీపీ వెంకటరెడ్డి, వైస్ఎంపీపీ బారి శ్రీను, సర్పంచ్ పరుశురాం, ఎంపీటీసీ సుధారాణి ఉన్నారు.

'ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

కూసుమంచి: ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం పాలేరులో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కూలీలందరు నిరుపేదలేనని వారికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించాలని తెలిపారు. అర్హులందరికి మూడెకరాల భూమి పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తాళ్లూరి వెంకటేశ్వర్లు, పుసులూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

చేగొమ్మ ఉన్నత పాఠశాలకు టీవీ బహూకరణ

కూసుమంచి: ఎన్ఆర్ఐ ఫౌండేషన్, రోటరీక్లబ్ వారి ఆధ్వర్యంలో చేగొమ్మ ఉన్నత పాఠశాలకు బుధవారం రు.15వేల విలువైన ఎల్ఈడీ టీవీని బహూకరించారు. విద్యార్థులకు డిజిటల్ క్లాసులు సులువుగా అర్థమయ్యేందుకు బహకరించినట్లు ఎంఈవో రామాచారి తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ ఫౌండేషన్ కోర్‌కమిటీ శ్రీనివాస్, సభ్యులు బయ్యనబాబు, రామకృష్ణ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

'గొర్రెలనుఅమ్ముకుంటే కఠిన చర్యలు'

తిరుమలాయపాలెం: ప్రభుత్వం కురుమ, గొల్ల కులస్థులకు రాయితీపై అందించిన గొర్రెల యూనిట్లను లబ్ధిదారులు అమ్ముకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి నర్సింహులు హెచ్చరించారు. బుధవారం స్థానిక మండల పశువైద్యశాలలో గొర్రెల యూనిట్ల లబ్ధిదారులతో అవగాహనసదస్సు నిర్వహించారు. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేటి వరకు 1284 గొర్రెల యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. ప్రస్తుత సీజీన్‌లో గొర్రెలకు వ్యాధులు రాకుండా ఉచితంగా టీకాలు వేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.అశోక్, ఏడీ బి.శ్రీనివాస్‌రావు, మండల పశువైద్యాధికారి అజ్మీర జగ్గులాల్, ప్రాథమక గొర్రెలసహకార సంఘం అధ్యక్షుడు మల్సూర్, పశువైద్య సిబ్బంది మహేష్,విషాలక్ష్మి, అశోక్,వెంకన్న, రమణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

● మండల పరిషత్ సమావేశంలో సభ్యుల డిమాండ్



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యులు

తిరుమలాయపాలెం: మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలం చెందారని ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు.. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అశోక్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత పిండిప్రోలు ఎంపీటీసీ సభ్యుడు చామకూరి సురేదర్ మాట్లాడుతూ మండలపరిషత్ జనరల్‌ఫండ్‌తో చేపట్టిన పనుల వివరాలపై చర్చ జరపాలని పట్టుబట్టారు. మూడున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి వివరాలను సభ్యులకు వివరించాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్ నిధులు ఎంపీటీసీ సభ్యులకు తెలియకుండా ఎంపీపీ ఇష్టానుసారం కేటాయించారని ఆరోపించారు. ప్రస్తుత సీజన్‌లో వివిధరకాల అంటువ్యాధులు వచ్చేఅవకాశం ఉందని వైద్య సిబ్బంది సానికంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఎపీటీసీ సభ్యులు రమేష్, వీరన్న, దామోదర్ కోరారు. వైద్యసిబ్బంది స్థానికంగా నివాసం ఉండకుండా ఖమ్మంనుంచి రాకపోకలు సాగిస్తున్నారని విమర్శించారు. మండలంలో స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు అస్థవ్యవస్థంగా వున్నాయని ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు కుళ్లిపోయిన కోడిగుడ్లను పంపిణీ చేస్తున్నారని అన్నారు. మిషన్ కాకతీయ కింద చేపట్టిన చెరువు పనుల్లో సరిహద్దులు గుర్తించకుండా పనులు చేపట్టారని జడ్పీ కో-ఆప్షన్‌సభ్యుడు జియావుద్దీన్ ఆరోపించారు. దమ్మాయిగూడెం సర్పంచ్ జ్యోతిని అవమానించిన వీఆర్వోపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీపీ అశోక్, జడ్పీటీసీ బానోతు విజయ , తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీవో వెంకటపతి రాజు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు జియావుద్దీన్, హనుమంతరావు, వైద్యాధికారులు జగ్గులాల్, పావని, ఏపీవో నర్సింహారావు, ఎంఈవో సత్యనారాయణ, పాల్గొన్నారు.

చవితికి సిద్ధమయిన గణనాథులు



కూసుమంచిలో సిద్ధం చేసిన వినాయక విగ్రహాలు

కూసుమంచి: చవితికి గణనాథుల విగ్రహాలు ముస్తాబయ్యాయి. గతేడాది కంటే ఈసారి విగ్రహాలను మండలంలో వివిధ ఆకృతులలో ఆకరణీయంగా తయారు చేశారు. మూడు అడుగుల నుండి 13 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు తయారుచేసినట్లు కళాకారుడు సలీం తెలిపాడు. మండలంలో గణేష్ నవరాత్రులు నిర్వహించేవారు గతంలో విగ్రహాల కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం గత మూడేళ్లుగా ఇక్కడే విగ్రహాలు దొరుకుతున్నాయి. పరిసర ప్రాంతాలకు చెందిన వారు కూడా ఇక్కడి నుండే విగ్రహాలను కొనుగోలు చేసుకొని వెళుతున్నారు. ఈఏడాది ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని కళాకారుడు సలీం తెలిపాడు.

దీంతో 10శాతం వరకు ధరలు పెంచి అమ్మాల్సి వస్తున్నదని తెలిపాడు. ఇదిలా ఉండా ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాల వద్దు మట్టి విగ్రహాలే ముద్దు అంటూ గత కొన్నేళ్లుగా ప్రచారం నిర్వహిస్తున్నా మట్టి విగ్రహాల ఏర్పాటు ఆచరణకు నోచుకోవడం లేదు.

నిబంధనలు పాటించాలి: ఎస్ఐ రఘు

వినాయకచవితిని పురస్కరించుకుని విగ్రహాలు ఏర్పాటులో ఉత్సవ కమిటీలు నిబంధనలు కచ్చితంగా పాటించాలని కూసుమంచి ఎస్ఐ రఘు సుచించారు. బుధవారం పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవకమిటీలు పాటించాల్సిన నిబంధనలు వెల్లడించారు. విగ్రహాల ఏర్పాటుపై పోలీసుల అనుమతి తీసుకోవాలి

హైవ్యాల్యూమ్ మైక్‌సెట్లు, డీజేలు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచెయ్యొద్దు. విద్యుత్ అనుమతి మీసేవా కేంద్రాల ద్వారా పొందాలి. రాత్రి పదిగంటల తర్వాత కార్యక్రమాలు చేపట్టవద్దు. ఆసుపత్రులు, పాఠశాలలు, పరిధిలో విగ్రహాలు ఏర్పాటు చేయవద్దని చెప్పారు.

సర్పంచ్‌ని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలనిధర్నా



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం: మండలంలోని దమ్మాయిగూడెం గ్రామసర్పంచ్ జ్యోతిని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాని డిమాండ్ చేస్తూ టీమాస్‌ఫోరం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిచారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి ప్రదర్శనగా బయలుదేరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఎంపీడీవో వెంకటపతిరాజుకు వినతిపత్రం అందించారు. అనంతరం టీమాస్‌ఫోరం జిల్లానాయకుడు బండి రమేష్ మాట్లాడుతూ ఆగస్టు 15న గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగరవేయనీయకుండా అడ్డుకున్న వీఆర్వో సత్యనారాయణ, ఉపసర్పంచ్ ఆలస్యం నాగేశ్వరరావుపై కేసు నమోదు చేయాలన్నారు.

గిరిజన మహిళైన సర్పంచ్‌ని జెండా ఎగురవేయనీయకుండా అడ్డుకోవడం దారుణ మన్నారు. విఆచరణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీమాస్‌ఫోరం జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు దోనేపల్లి వెంకన్న, కె.నర్సింహారావు, నాయకులు కొమ్ముశ్రీను, మల్సూర్, వృత్తిదారుల సంఘం నాయకులు అంగిరేకుల నర్సయ్య, వెంకన్న, రమేష్, రవి, టి.నాగేశ్వరరావు, వెంకటరామిరెడ్డి, రాయిండ్ల సుందరయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలివ్వాలి: కేవీపీఎస్

ఖమ్మంరూరల్: అర్హులందరికీ ఎస్సీ కార్పొరేషన్‌ద్వారా రుణాలందించాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి నందిగామ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట బుధవారం కేవీపీఎస్ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2017-18 కిగాను ప్రవేశపెట్టిన రుణాలను దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని సూపరంటెండెంట్ శ్రీదేవికి అందించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, బుచ్చిరాములు, ప్రసాదరావు, కొమ్ముశంకర్, వరకుమార్, బాలరాజు పాల్గొన్నారు.

'మరుగుదొడ్లు ముమ్మరంగా నిర్మించాలి'

ఖమ్మంరూరల్: గ్రామాలలో మరుగుదొడ్లను ముమ్మరంగా నిర్మించాలని ఖమ్మం రూరల్ ఈవోఆర్‌డీ ప్రభాకర్ సిబ్బందికి సూచించారు. రూరల్ మండలం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, బిల్‌కలెక్టర్లు, పారిశుధ్య సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అక్టోబర్ రెండు వరకు పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు నిర్మించాలని సూచించారు.పారిశుధ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీధి దీపాలు నిత్యం వెలిగేలా చూడాలన్నారు గ్రామాలలో మరుగుదొడ్లు నిర్మాణంపై ప్రజలకు అవగాహన కలిపించాలన్నారు.